ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు, : fb.com/vaartha

Published from Ongole Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, , Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 343 పేజీలు: 10+2 వెల: 6.50

యుద్ధంతో కాదు.. బౌద్ధంతోనే భవిష్యత్తు: పిఎం 9లో

ఇండియా కూటమిని మూసేయడం మేలు: ఒమర్

# తొక్కిసలాటపై న్యాయ విచారణ

## పదిరోజుల వైకుంఠద్వార దర్శనంపై పునఃసమీక్ష!

### ఆగమ నిపుణులు పరిశీలిస్తారని సిఎం చంద్రబాబు సంచలన ప్రకటన

### భవిష్యత్‌లో ఎఐతో టోకెన్ రహిత దర్శనాలు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనురాస్మంలో వైకుంఠద్వార దర్శనాల కోసం కోట్లాదిమంది భక్తులు వైకుంఠ ఏకాదశిన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవాలని భావిస్తారని, అలాంటపుడు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు అధికారులు తీసుకోవాలని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు సూచించారు. తిరుపతిలో టోకెన్లు జారీచేసే విధానం వల్ల ఈ తోపులాట, తొక్కిసలాట జరగడం, ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. తిరుపతిలో క్షతగాత్రుల నుండి తీసుకున్న అభిప్రాయాలు, సూచనల మేరకు భవిష్యత్తులో టోకెన్లు లేని స్వామివారి దర్శనాలను కృత్రిమమేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)విధానం అమలు చేస్తామన్నారు. తమకూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చిన తరువాత తిరుమల పవిత్రతను కాపాడటానికి ఒక్కొక్క >>2



గురువారం తిరుపతిలో జరిగిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావు

### నేను ఊరుకున్నా... దేవుడు వదిలిపెట్టడు

### మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం, టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం


### తీవ్ర క్షతగాత్రులకు రూ.5లక్షలు, సాధారణ క్షతగాత్రులకు రూ.2లక్షలు

### అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు..

### చికిత్సపొందుతున్నవారిని పేరుపేరునా పలకరించి ఓదార్చిన సిఎం

### తిరుపతిలో పర్యటించిన సిఎం చంద్రబాబు నాయుడు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై న్యాయవిచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తెలిపారు. అధికారుల బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని తేల్చారు. ఎంతో దూరం నుండి వైకుంఠద్వార దర్శన టోకెన్లకోసం వచ్చి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు.. తీవ్రంగా క్షతగాత్రులైన వారికి 5లక్షలు రూపాయలు, క్షతగాత్రులైన వారికి 2లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తామన్నారు. తిరుపతి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యచికిత్స లందించేలా వైద్యాధికారులను ఆదేశించినట్లు సిఎం చెప్పారు. రాజకీయాలకు అతీతంగా శ్రీవారి సేవచేస్తున్నామని భావించాలని, తెలిసి చేసినా తెలియక చేసినా తప్పుతప్పేనని చంద్రబాబు స్పష్టం చేశారు. కోట్లాదిమంది భక్తులు పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలు చేసుకోవాలని ఆనుకుంటారని, పవిత్రతకు భంగం కలగకుండా వచ్చిన భక్తులకు ప్రశాంత వాతావరణంలో సేవలందించడం ముఖ్యమన్నారు. ఈవిషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చూస్తూ ఊరుకునేదిలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరు పతిలో జరిగిన విషాదకర ఘటనలో మృతుల కుటుంబాలను ఓదార్చడానికి, తీవ్ర క్షతగాత్రులను పరామర్శించడానికి గురువారంమధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతికి చేరుకున్నారు. టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగంతో కలసి తొలుత తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు ఉన్నతపాఠశాల, పద్మావతి పార్కు ప్రాంతాలను, అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇక్కడ భక్తులు వేచివుండేందుకు తీసుకున్న చర్యలు, క్యూలైన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భక్తులను దర్శన టోకెన్లకు విడుదల చేసిన నిన్నరాత్రి 8.30గంటల సమయంలో అక్కడే విధుల్లో ఉన్న తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్ తీరుపై ఆయన వివరాలు రాబట్టారు. అక్కడ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసిన టిటిడి జెఇఒ గౌతమిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుండి తిరుపతి స్విమ్స్‌కు చేరుకుని అత్యవసర విభాగంలో >>2



గురువారం స్విమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు

## స్విమ్స్ మహిళా కళాశాలవద్ద ఉద్రిక్తత

### సిఎం, డి.సిఎం, మాజీ సిఎం సందర్శనతో అంతా గందరగోళం

**తిరుపతి హెల్త్, జనవరి 9 ప్రభాతవార్త :** క్షతగాత్రులను గంట ఆలస్యంగా గురువారం మధ్యాహ్నం పరామర్శించేందుకు సిఎం నారా చంద్రబాబు వచ్చాడు. గంటకు పైగా ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించి వెంటనే తిరిగి వెళ్లిపోయారు. అటు పిమ్మట డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఇంతలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆస్పత్రి వద్దకు వస్తున్నారనే విషయం తెలుసుకుని వైసీపీ శ్రేణులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. దాదాపు గంటన్నరకుపైగా ఆస్పత్రిలోని క్షతగాత్రులను పరామర్శించి పవన్ కల్యాణ్ ఆస్పత్రి బయటకు వచ్చారు. ఇక తిరుగు ప్రయాణం అయ్యే సమయంలో పవన్ కల్యాణ్ ఒక్క సారిగా యువత, జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పవన్ >>2



టిటిడి జెఇఒ గౌతమి



ఎస్‌పి సుబ్బారాయుడు



సివిఎస్‌ఒ శ్రీధర్

## ముగ్గురు టిటిడి ఉన్నతాధికారులపై వేటు

### టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, టిటిడి సివిఎస్‌ఒ శ్రీధర్ తక్షణం బదలీ

### తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి సస్పెన్షన్

**తిరుపతి, జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనం కోసంవచ్చి జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాదంలో ఉన్నతాధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే కారణమని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ విషాద ఘటనకు బాధ్యులైన టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ ఎస్.శ్రీధర్‌పై బదిలీ వేటు వేశారు. ఇంకా ప్రణాళిక లేకుండా బైరాగిపట్టెడ ప్రాంతంలో గేట్లు తెరిచిన తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణ >>2

## తప్పు జరిగింది.. క్షమించండి

### • టిటిడి ఇఒ, అదనపు ఇఒ మధ్య సమన్వయ లోపం • అధికారుల తప్పిదంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు • తిరుపతిలో డిప్యూటీ సిఎం పవన్ ఆగ్రహం

**తిరుపతి, జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, 40మందివరకు క్షతగాత్రులైన ఘటనకు టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి బాధ్యత తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. రద్దీని నియంత్రించడంలో ఆ ఇద్దరూ విఫలమయ్యారని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఇద్దరి ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతమంది టిటిడి సిబ్బంది, పోలీసులు ఉండి ఆరుగురు ప్రాణాలు కోల్పోయినా భక్తుల రద్దీని నియంత్రించడంలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని ఆయన అసహనం చెందారు. ఇదీ ఒక బాధాకరమైన ఘటన అన్నారు. తిరుపతిలో జరిగిన విషాదకర ఘటనలో మృతుల కుటుంబాలను ఓదార్చడానికి, తిరుపతి స్విమ్స్,రుయా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించడానికి గురువారం మధ్యాహ్నం ఉపముఖ్యమంత్రి పవన్ తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, జనసేననాయకులు ఆరణి మదన్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి,డాక్టర్ హరిప్రసాద్,చిత్తూరు జిల్లా ఎస్పీ మణి కంఠచందోలుతో కలసి ఆయన ఘటన జరిగిన తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు ఉన్నతపాఠశాల, పద్మావతి పార్కు ప్రాంతాలను,అక్కడ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇక్కడ భక్తులు వేచివుండేందుకు తీసుకున్న చర్యలు, క్యూలైన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్విమ్స్‌కు చేరుకుని క్షతగాత్రులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్లు జారీ ఘటనలో తప్పిదం జరిగిందని, రాష్ట్రప్రభుత్వం తరపున క్షమాపణలు చెబుతున్నట్లు ఆయన తెలిపారు. తప్పుజరిగిందని, బాధ్యత తీసుకుంటామన్నారు. >>2



గురువారం తిరుపతిలో ఘటన వివరాలు తెలుసుకుంటున్న డి.సిఎం పవన్

## తిరుమలను దివ్యక్షేత్రంగా నిలబెట్టాలన్నదే తపన

### టోకెన్లు ఇవ్వడం సరైంది కాదన్న భక్తులు

### మీడియాతో సిఎం చంద్రబాబు

**తిరుపతి,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనం కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ..ఇదీ తనమనసును కలచివేసిందని సిఎం చంద్రబాబునాయుడు విషాదవదనంతో తెలిపారు. వేంకటేశ్వరస్వామి పాదాల చెంత మనసా,వాచా ఎప్పుడూ ఎలాంటి అపశృతి జరగకూడదు. పవిత్రమైన దివ్యక్షేత్రంగా ఎప్పుడూ నిలబెట్టాలనేది తన తాపత్రయమని, ఓ భక్తునిగా , ముఖ్యమంత్రిగా కోరుకుంటానని అన్నారు. తిరుమల దివ్యక్షేత్ర పవిత్రతను కాపాడే బాధ్యతను ఎప్పుడో తీసుకున్నానన్నారు. ఇకపైనా తీసుకుంటానని ఆయన పునరుద్ఘాటించారు. దేవుని దర్శన టోకెన్లు జారీచేసిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించానని, అక్కడ 2వేలమందికి సరిపడే స్థలం ఉంటే 2,500మందిని ఎలా అనుమతించారనేది ఆశ్చర్యం కలిగించిందన్నారు. లోపాలను సరిదిద్దాల్సిన టిటిడి, పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు తిరుపతిలోని బైరాగిపట్టెడటోకెన్లుజారీ ప్రాంతాన్ని, ఘటనకు కారణాలను, స్విమ్స్ ఆస్పత్రిలో బాధితులందరితో వారి కుటుంబ సభ్యులు >>2

## అది పూర్తిగా ప్రభుత్వ తప్పిదమే



గురువారం పద్మావతి మెడికల్ కాలేజీలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ సిఎం జగన్

### తిరుపతి చరిత్రలో అలాంటి దుర్ఘటన జరగలేదు..

### మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలివ్వాలి

### బాధితులను పరామర్శించిన మాజీ సిఎం జగన్

**తిరుపతిరూరల్, జనవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తప్పిదం, అధికారుల నిర్లక్ష్యం వల్లే తిరుపతిలో 6మంది శ్రీవారి భక్తులు మృతి చెందారని ప్రతిపక్షనేత వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేసారు. తిరుపతి చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదని, అధికారుల భద్రత వైఫల్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50లక్షల రుపాయాలు, గాయపడినవారికి ఉచిత వైద్యంతో పాటు రూ.5లక్షల రుపాయాలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ ఘటనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు హోం మంత్రి, టిటిడి చైర్మెన్, టిటిడి ఇవో, తిరుపతి కలెక్టర్, తిరుపతి ఎస్పీ బాధ్యులేని స్పష్టం చేసారు. బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలను, శ్రీపద్మావతి మెడికల్ కాలేజ్‌లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైయస్.జగన్ పరామర్శించారు. క్షతగాత్రుల పరామర్శ అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు >>2

## నవ్వుతూ వెళ్లి.. శవాలై ఇంటికి

### పలు కుటుంబాల్లో తీవ్ర విషాదం, స్వామి దర్శనానికి వచ్చి తిరిగిరాని లోకాలకు

**తిరుపతి,జనవరి 9 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా తిరుమలేశుని వైకుంఠ దర్శనం కోసం భక్తి శ్రద్ధలతో వచ్చిన భక్తుల్లో కొందరు శవాలుగా మారారు. దూర ప్రాంతాల నుంచి స్వామిని దర్శించుకోవటానికి వచ్చిన వారిలో ఆరుమంది చనిపోగా 40 మంది గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.ఈ సంఘటన జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. బుధవారం రాత్రి సుమారు 9.30గంటలకు సంఘటన జరిగింది. సంఘటన జరిగిన తరువాత పరుగులు తీసారు. సహాయ కార్యక్రమాలకు పూనుకున్నారు. పరుగులు తీసారు. అయితే ఈ సంఘటనను పాలకులు తీవ్రంగా పరిగణించారు. గురువారంఉదయం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంశాఖ మంత్రి అనిత, సమాచారం శాఖ మంత్రి కొలుసు పార్థసారధి,జలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిలు తిరుపతి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యమంత్రి రుయా ఆసుపత్రిలో గాయపడిన ప్రతి ఒక్కరిని పరామర్శించారు.

ఇక మృతి చెందిన వారి వద్ద ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. గురువారం తిరుపతి నాయకులతో కిట కిట లాడింది. సంఘటనపై కదలి వచ్చిన ప్రభుత్వం విధి నిర్వహణలో సకాలంలో స్పందించని అధికారులను ఇంటికి సాగనంపారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి,టిటిడి జెయిఒ,గోశాల డైరెక్టర్, >>2





## సంక్షేమ హాస్టళ్లలో ఏవీ సౌకర్యాలు?: హైకోర్టు

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం నామ మాత్రపు నిధులను విడుదల చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. 2021-22 లో రూ.24.60 లక్షలు మాత్రమే కేటాయించడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఆ సొమ్ముతో వసతి గృహాల్లో సదుపాయాల కల్పన ఏ విధంగా సాధ్యమని ప్రశ్నించింది. కనీసం ఐదు వసతి గృహాల్లోని పరిస్థితులను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కొరతను ప్రశ్నిస్తూ కాకినాడకు చెందిన కేఏఎం గురుతేజ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ విషయంలో నిధుల కేటాయింపును పెంచామన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024- 25 లో ప్రభుత్వం రూ.143 >>2


స్విమ్స్ వద్ద బాధితులను ఓదార్చుతున్న సిఎం చంద్రబాబు


స్విమ్స్‌లో బాధితులను పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్


టిటిడి ఉన్నతాధికారులతో సిఎం చంద్రబాబు సమావేశం

# తొక్కిసలాటపై న్యాయ విచారణ

>> చికిత్స పొందుతున్న బాధితులను పేరుపేరునా ఒక్కొక్కరిని పలకరించి ఘటన ఎలా జరిగిందని, కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారినుండి వైద్యసేవలందుతున్న విషయం కూడా అడిగారు. ఇంకా మెరుగైన వైద్యంఅందించాలని స్విమ్స్ క్యాజువాల్టీ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్‌కు ఆదేశించారు. సుమారు గంటన్నరసమయం పైగా స్విమ్స్‌లో సిఎం చంద్రబాబు బాధితుల వైద్యసేవలపై, వారి రిపోర్టులను పరిశీలించారు.

**నేను ఊరుకున్నా దేవుడు వదలిపెట్టడు:సిఎం**

వైకుంఠద్వార దర్శనం చేసుకునేందుకు అవకాశం ఉన్న భక్తులందరూ రావడం సహజమేనని, అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చినా రద్దీని నియంత్రించలేకపోవడం వంటి తప్పిదాలు జరిగాయని సిఎం చంద్రబాబు తెలిపారు. భారీగా భక్తులు వచ్చినా అరకొరగా భద్రత చర్యలు తీసుకోవడం, పోలీసు, టిటిడి అధికారులు నిర్లక్ష్యంగా, బాధ్యతలేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో భాదాకరమైన ఘటన చోటుచేసుకుందని, ఈ తొక్కిసలాట ఘటనలో 6మంది చనిపోవడం, 40మంది క్షతగాత్రులవడం తన మనసును కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడే బాధ్యత అందరిపై ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించానని, వారితో మాట్లాడితే పలు ఆసక్తికర విషయాలు తెలిశాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. తిరుమల పుణ్యక్షేత్రమని, దాని పవిత్రతను కాపాడుతామని ఆయన పునరుద్ఘాటించారు. తొక్కిసలాట ఘటనపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, టిటిడి బోర్డుకు, ఉన్నతాధికారులకు కొన్ని సూచనలు కూడా చేశామని సిఎం తెలిపారు. తిరుపతిలో ఇలాంటి ఘటనలు, రాజకీయం చేయడం ఉండకూడదని ఒక భక్తుడుగా తాను కోరుకుంటున్నానని మనసులోని మాటను మరోసారి బయటపెట్టారు. కొందరి అనాలోచిత నిర్ణయాలతో దేవుడిని అప్రతిష్టపాలు చేయొద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**మృతులకుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం:**

తిరుపతిలో బుధవారం రాత్రి వైకుంటదర్శన టోకెన్లకోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయలు పరిహారం అందిస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు. వారి కుటుంబంలో వారికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని వెల్లడించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన 15మందికి 5లక్షల రూపాయులు పరిహారం, క్షతగాత్రులైన 24మందికి 2లక్షల రూపాయలు పరిహారం అందిస్తామన్నారు. గాయపడిన వారందరికీ శుక్రవారం వైకుంఠద్వార దర్శనం చేయిస్తామని ఆయన అప్పటికప్పుడేప్రకటించారు. ఇందుకు టిటిడి అధికారులు తగిన ఏర్పాట్లుచేస్తారన్నారు. కాగా తిరుపతిలో తొక్కిసలాటలో మృతిచెందినవారిలో విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకు చెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారిగ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45)ఉన్నారు. వీరి కుటుంబసభ్యులు తిరుపతి రుయా ఆస్పత్రి మార్చురీ వద్ద ఆర్తనాదాలు మిన్నంటాయి.

# ఉన్నతాధికారులపై వేటు

>> కుమార్, టిటిడి గోశాలడైరెక్టర్ డాక్టర్ హరనాధ రెడ్డిని సస్పెండ్ చేశారు. గురువారం మధ్యాహ్నాం నుండి రాత్రి వరకు తిరుపతిలో పర్య టించి, ఘటనపై కారణాలను ఆరాతీసిన సిఎం చంద్రబాబు సాయంత్రం టిటిడి పరిపాలన భవ నంలో జరిగిన మీడియాప్రతినిధుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. దేవుని దర్శనానికి అనాలోచిత నిర్ణయాల వల్ల, గతంలో తీసుకున్న విధానాల వల్ల భారీగా భక్తులు తరలివచ్చినపుడు అధికారులు ఆలోచనతో పనిచేయాలన్నారు. అలా గాకుండా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ముగ్గురు ఉన్నతాధికారులను తక్షణం బదిలీ చేసినట్లు, ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని సిఎం ప్రకటిం చారు. ఇంకా టిటిడి ఇఒ శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై మండిపడ్డారు. పెద్ద సంఖ్యలో భక్తులు వస్తే రద్దీ పెరుగుతుంటే అధికా రులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంబులెన్స్‌ల లభ్యత లేకపోవడం, అందుబాటులో వుంచకపోవడం జిల్లా యంత్రాంగం వైఫల్యమ న్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

# నవ్వుతూ వెళ్లి.. శవాలై ఇంటికి

>> తిరుపతి డివైయస్‌పి, టిటిడి సివి ఎస్‌ఒ లను ఇంటికి సాగనంపారు. కాగా ప్రతి పక్ష నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి చేరుకున్నారు.

**సంఘటన ఎలా జరిగిందంటే...**

వైకుంఠ ఏకాదశి సర్వదర్శనంను పురస్కరించుకొని టిటిడి 9 ప్రాంతాల్లో 90కౌంటర్లు ఏర్పాటు చేసారు. బైరాగి పట్టెడ ప్రాంతంలోని రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో టోకెన్ల జారికి 10కౌంటర్లు ఏర్పాటు చేసారు. ఇక్కడకు మధ్యాహ్నాం నుంచే తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు తమిళనాడు నుంచి భారీ ఎత్తున భక్తులు చేరుకున్నారు. రాత్రి 8.50గంటల సమంయలో క్యూలైన్లలోకి అనుమతించటంతో ఒక్కసారిగా ప్రవేశించటానికి ప్రయత్నించారు. ఎవరు ముందు వెళ్లాలన్న అంశంలో ఎవరికి వారు జోరపడ్డారు. దాంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. భక్తుల్లో మహిళలు, వృద్ధులు ఉండటంతో కింద పడ్డారు. పోలీసులు అదుపుచేయటానికి విఫల యత్నం చేసినట్లు తెలిసింది. ఈ తోసులాటలో పలువురు కిందపడ్డారు. వారిని తొక్కేసారు. పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. అలాగే శ్రీనివాసంలో కూడా తొక్కిసలాట చోటు చేసుకుంది. భక్తులు గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనల్లో సుమారు 40 మంది గాయపడ్డారు. తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తోపులాటలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం జరిపి స్వస్థలాలకు పంపటానికి కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, టిటిడి చైర్మెన్ బిఆర్ నాయుడులు కృషి చేసారు.

# స్విమ్స్ మహిళా కళాశాలవద్ద ఉద్రిక్తత

>> కల్యాణ్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు, కేకలు వేశారు. అప్పటికే మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వద్దకు చేరుకున్నారు. పవన్ కల్యాణ్ ఆస్పత్రి ఎదుట ఉన్న మీడియా సోదరుల వద్దకు వచ్చి ప్రెస్‌మీట్ ప్రారంభించారు. క్షత గాత్రులను పరామర్శించేందుకు వచ్చాను. ఇప్పటికైనా పోలీసులు తీరు మార్చుకోవాలి. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఒక్కసారిగా జగన్ ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో వైసీపీ శ్రేణులు కూడా ఆస్పత్రి వద్ద ఆయన వెంట పరుగులు తీశారు. దీంతో అర్ధగంట పాటు పోలీసుల పరిస్థితి అయోమయంగా కనపడింది. ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకానొక దశలో వైసీపీ శ్రేణులు, జనసేన నేతలు ఘర్షణకు దిగే పరిస్థితి ఏర్పడింది.

# మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

**విజయవాడ, జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సినీనటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్‌బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గత నెల 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# అది పూర్తిగా ప్రభుత్వ తప్పిదమే

>> ముఖ్యమంత్రి అయ్యాక టిటిడి ప్రతిష్ట దిగజారుతుందని, చంద్రబాబునాయుడుకి దేవుడంటే భక్తి లేదు...దేవుడంటే భయం లేదన్నారు. గతంలోను గోదావరి పుష్కరాలలో 30మందిని బలికోన్నారని వాపోయారు. ఈ తొక్కిసలాటకు మొదటి ముద్దాయి ముమ్మాటికి సిఎం, చంద్రబాబే అన్నారు. ఈ సంఘటనలో చిన్న చిన్న ఉద్యోగులను బాధ్యులను చేసి, బదిలీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సిఎం కుప్పం పర్యటనలో ఉన్నందున జిల్లా యంత్రాంగ అంతా అక్కడ నిమగ్నం అవ్వడంతో ఈ ఘటనకు ఒక కారణమని తెలిపారు. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి శ్రీవారి దర్శన టోకేన్స్ కోసం లక్షల మంది భక్తులు తిరుపతికి వస్తారనే విషయం టిటిడి అధికారులకు తెలిసినప్పటికి భద్రత ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని వైయస్.జగన్మోహాన్‌రెడ్డి ఆరోపించారు. బైరాగిపట్టేడ ఎంజిఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌కు భారీగా భక్తులు చేరుకోగా భక్తులను పక్కనే ఉన్న పద్మావతి పార్కులో పంపారని, పార్కులో 2000 మందికి మాత్రమే పరిమితంగా కాగా పరిమితికి మించి 2500మందిని పంపడంతో పాటు ఒక్కసారిగా గేట్ తెరవడంతో సంఘనట జరిగిందన్నారు. భక్తులను క్యూలైన్‌లో కాకుండా అందర్ని ఒకేచోట గుమిగూడేలా చేర్చారని, ఒకే సారికాకుండా ఒక్కొక్కరిగా పంపి ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. టోకేన్స్ జారీ చేసే కేంద్రాలలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమైనారని ఆవేదన వ్యక్తం చేసారు. భక్తులకు భద్రత ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్య వైఖరి, 6మంది భక్తుల మృతికి కారకులైనారన్నారు. శ్రీవారి దర్శన టోకేన్స్‌కు జారీ చేసే ప్రాంతాలలో జరిగిన తొక్కిసలాటలో 6మంది మృతితో పాటు 60మంది వరకు గాయాలు బారిన పడ్డారని, గాయపడినవారికి పద్మావతి మెడికల్ కాలేజ్, స్విమ్స్, రుయా ఆసుపత్రులలో చికిత్స పోందుతున్నారని వైయస్.జగన్ వాపోయారు. ఎఫ్.ఐ.ఆర్‌లో 5మంది మాత్రమే మృతి చెందినట్లు పేర్కొనడం బాధాకరం అన్నారు. 105 కేసు పెట్టాల్సిందిపోయి, కేసును నీరు గార్చటానికే చిన్న కేసు పెట్టారని, వీరికి మానవత్వం లేదన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, ఆర్కే రోజా, మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠద్వార దర్శనంపై పునఃసమీక్ష!

>> మార్పు తీసుకువస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు మార్పులు తీసుకుంటున్నామన్నారు. ఇక తిరుమలలో పురాతన కాలంనుండి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వారాలను వైకుంఠ ఏకాదశి, ద్వాదశిరోజుల్లో 48గంటలపాటు మాత్రమే తెరచివుంచి, టోకెన్లలేకుండా తిరుమలకు వస్తే 40గంటలు కూడా నిరీక్షించి దర్శనం చేసుకుని సురక్షితంగా వెళ్లేవారని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ విధానం గత ఐదేళ్లముందు వైసిపి ప్రభుత్వం, టిటిడి బోర్డు ఇష్టానుసారంగా అమలుచేసిన విషయం తనకు తెలియదన్నారు. పదిరోజులకు టోకెన్లు జారీచేసే విధానం కూడా తనవరకు రాలేదన్నారు. ఇప్పుడు ఈ విధానంపై కూడా ఆగమపండితులతో, ఆగమశాస్త్ర నిపుణులతో సంప్రదించి టిటిడి బోర్డు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటుందని సిఎం వెల్లడించారు. తిరుమలలో పూర్తిస్థాయిలో పవిత్రతను కాపాడటంలో జరుగుతున్న ప్రక్షాళన సమయంలో ఈ దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. టిటిడి బోర్డులో చర్చించి భక్తులకు మెరుగైన సౌకర్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. శ్రీవారి సన్నిధిలో, దేవుని విషయంలో ఎవరు రాజకీయాలు చేయాలని చూసినా ఆ దేవుని లెక్కల నుండి తప్పించుకోలేరన్నారు. క్రైస్తవులకు జెరూసలేం, ముస్లింలకు మక్కాలాగా తిరుమల హిందువులకు పవిత్ర పుణ్యక్షేత్రమమని మరోసారి ఉద్ఘాటించారు. జీవితకాలంలో ఒకసారైనా ఆ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని ప్రతి హిందూ భక్తులు భావిస్తారన్నారు. భక్తుల ఆశయాలకు తగ్గట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమిష్టిగా సమన్వయంగా భక్తితో సేవలందించాలని సిఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. ఇంకా ఈ ఘటనలో బాధ్యులైన పోలీసులను బదిలీ చేయాలని సిఎం చంద్రబాబు జిల్లా అధికారులను ఆదేశించారు.

# సంక్రాంతికి చేనేత వస్త్రాలు ధరిద్దాం

## -మంత్రి సవిత పిలుపు

### నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2004- 25 ను ప్రారంభించిన మంత్రి

**విజయవాడ, జనవరి9, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతి నెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎగ్జిబిషన్లు, ఎక్స్ పోలు నిర్వహణతో చేనేత వస్త్రాలు విక్రయాలు పెరిగాయి అని మంత్రి తెలిపారు. గురువారంఆమె విజయవాడ నగరం లోని ఓ కన్వెన్షన్ సెంటర్లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పో 2004- 25 ను జ్యోతి ప్రజ్వలనతో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్ పో లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి, ఏ రాష్ట్రం నుంచి వచ్చారు... అమ్మకాలు ఎలా జరుగుతున్నాయి..? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఎంతో కీలకమైన చేనేతకు సీఎం చంద్రబాబు అండగా ఉంటున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించడానికి రాష్ట్రంలోనూ, దేశ విదేశాల్లోనూ చేనేత ఎక్స్‌పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్ పోను నిర్వహిస్తున్నామన్నారు.

# వక్ఫ్ బోర్డుకు 65,783 ఎకరాల ఆస్తి ఉంది

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేర్ అబ్దుల్ అజీజ్

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉన్న 65,783 ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.. వన్ టౌన్ గల రాష్ట్ర వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులు భగవంతుడి కోసం దాతలు ఇచ్చారని, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ముస్లిం మతానికి చెందిన పేదలకు, వితంతువులకు, అనాధలకు ఖర్చుచేస్తామేకాని ఇతరులు ఆక్రమించుకోవడానికి కుదరదన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తి అంటే దేవుడి ఆస్తి అని దానికి బోర్డు చైర్మన్, సభ్యులు ధర్మకర్తలుగా మాత్రమే ఉంటామని అంతేకాకుండా ఆ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే బాధ్యత మా పై ఉందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు భగవంతుని కోసం దాతలు ఇచ్చారన్నారు. మసీదులకు మా తాతలు ధర్మకర్తలుగా, ముతావల్లీలుగా వున్నారని, కాబట్టి మేము ఆ ఆస్తిని అమ్ముకోవచ్చు అన్న అపోహలో కొందరు వున్నారన్నారు, అది జరుగదు, జరగనియ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల వెంకటేశ్వర స్వామిని భక్తితో చూసినట్టు వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా అలాగే చూస్తారని, ముఖ్యమంత్రి నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముకానివ్వనని అంతేకాకుండా వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడతానన్నారు. ఎప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల అవసరాల కోసం వక్ఫ్ బోర్డు భూములను నష్ట పరిహారంగా తీసుకోవచ్చని, కాని ప్రైవేట్ వ్యక్తులకు అది వీలుకాదన్నారు. గతంలో 65,783 ఎకరాల భూమి మసీదులు, దర్గాలకు దానంగా ఇచ్చారన్నారు. ఇందులో 31,590 ఎకరాల భూములు ఆక్రమణ లో వున్నాయన్నారు. ఈ భూములను కొందరు తెలిసో, తెలియకో కొన్నారన్నారు. కొన్నవారు ప్రతి అంగుళం భూమిని వెనక్కి ఇవ్వాల్సిందేనన్నారు. వక్ఫ్ భూముల ఆక్రమణలపై సర్వే సంపూర్ణంగా జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 651 ఎకరాలపై 40 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

# నిలబెట్టాలన్నదే తపన

>> కొందరితో మాట్లాడానన్నారు. కొన్ని విషయాలు తనకు తెలిశాయన్నారు. టిటిడి పరిపాలన భవనంలో అధికారులతో అన్ని కోణాల్లోనూ సమీక్షించిన తరువాత ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని టిటిడి బోర్డును ఆదేశించానన్నారు. పవిత్రత దెబ్బతినే పరిస్థితి రాకూడదన్నారు. అందరూ ఇక్కడ దేవునికి సేవచేస్తున్నామనే భావన కలగాలన్నారు. భక్తుల మనోభావాలు గురించి సిఎం వివరిస్తూ తిరుపతిలో టోకెన్లు జారీ మంచిదికాదని, కొండపైకి అనుమతినిస్తే ఎంతసమయం అయినా క్యూలైన్లలోనే ఉంటామని, స్వామివారిని తలచుకుంటూ ఆయన లీలలు గుర్తుచేసుకుంటూ దేవుని సన్నిధిలో సేవలో ఉన్నామనే భావం కలుగుతుందన్నారు. గురువారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, మంత్రులు రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టిటిడి ఈఓ శ్యామలరావుతో కలసి మీడియాతో కొన్ని విషయాలు తెలిపారు.

# తప్పు జరిగింది.. క్షమించండి


గురువారం మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

>> క్షతగాత్రులు, రాష్ట్రప్రజలు, శ్రీవారి భక్తులు, హైందవధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరూ క్షమించమని రాష్ట్రప్రభుత్వం అడుగుతోందన్నారు. ఈ ఘటన జరగకుండా టిటిడి రద్దీని నియంత్రించే విషయంలో విఫలమైందని మండిపడ్డారు. విఐపిలకు కాదు..సామాన్యభక్తులకు సేవలందించడంలో టిటిడి దృష్టి పెట్టాలన్నారు. మృతుల కుటుంబాల వద్దకు టిటిడి సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలన్నారు. భారీగా భక్తులు వచ్చినా నియంత్రణ, బాధ్యతగా వ్యవహరించడంలో టిటిడి ఇఒ ,అదనపు ఇఒ విఫలమయ్యారని ఆయన మండిపడ్డారు. ఘటనాస్థలిలో ఉన్న పోలీసులు బాధ్యత తీసుకోవాలన్నారు. అధికారులు చేసిన తప్పులకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తిట్లుతింటున్నామన్నారు. తొక్కిసలాట జరిగాక సహాయక చర్యలు ఎలా ఉండాలనేది ప్రణాళిక లేదని, వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్రప్రభుత్వంపై పడుతోందన్నారు. పోలీసుల్లో కొందరు కావాలనే చేశారా?అనే అనుమానాలు కూడా ఉన్నాయని సంచలనం వ్యాఖ్యలు చేశారు. ఈ అనుమాలన్నిటిపై విచారణ జరగాలన్నారు. ఇఒ, అదనపు ఇఒ, బోర్డుకు మధ్య సమన్వయలోపం ఉందని ఈ ఘటన తెలియజేస్తుందన్నారు. పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సిఎం, డిజిపి దృష్టికి తీసుకెళతానని ఉపముఖ్యమంత్రి తెలిపారు. తిరుమలలో దేవుని దర్శనం కోసం 10గంటల సమయం పట్టేవరకు ఎందుకు ఉందని, ఈ మార్పు జరగాలని ఆయన అన్నారు. సాధ్యమైనంతవరకు గంట, రెండుగంటల్లోనే దర్శనం జరిగేలా చూడాలని పవన్‌కల్యాణ్ తెలిపారు.

# హాస్టళ్లలో ఏవీ సౌకర్యాలు?

>> కోట్లు కేటాయించిందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేయడానికి సమయం కావాలని కోరారు. కోర్టు ముందు ఉంచిన వివరాలను పరిశీలించిన ధర్మాసనం వసతి గృహాల్లో ఉన్న పిల్లల కులాలను అధికారులు పేర్కొనడాన్ని ఆక్షేపించింది. పిల్లల విషయంలో కులాల ప్రస్తావన ఎందుకని ప్రశ్నించింది. 2021-22కు పూర్వం, ఆ తర్వాత సైతం తూతూ మంత్రంగా నిధుల కేటాయించారని గుర్తుచేసింది. 2019-24 మధ్య కాలంలో వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.20 కోట్లు కూడా ఖర్చుచేయలేదని పేర్కొంది. 90వేల మంది విద్యార్థులు ఉంటున్న వసతి గృహాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తాము అర్థం చేసుకోగలమని వ్యాఖ్యానించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.143 కోట్లు కేటాయించినా అవి ఏ విధంగా సరిపోతాయని ప్రశ్నించింది. ప్రాథమికంగా తాగునీరు, బెడ్‌లు, దస్తులు, మరుగుదొడ్లు, పౌష్టికాహారం, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించింది. సంక్షేమ వసతిగృహాలకు ఎంతకేటాయించారు? ఎంత ఖర్చుచేశారు, కేటాయించిన సొమ్ము సరిపోతుందా తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణకు సంక్షేమశాఖ కమిషనర్ ఆన్‌లైన్ ద్వారా హాజరుకావాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

తేది : 10-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి ఉ.10.20
కృత్తిక మ.1.45
వర్జ్యం : తె.4.54-6.25
దు.ఉ.9.02-9.47, 2) మ.12.45-1.30
శుభసమయం: ఉ.6.30-7.15,
సా.4.15-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వారఫలం

మేషం : [illegible] పూర్తి చేస్తారు.

వృషభం : [illegible]

మిథునం: [illegible]

కర్కాటకం : [illegible]

సింహం: [illegible]

కన్య : [illegible]

తుల : [illegible]

వృశ్చికం: [illegible]

ధనుస్సు: [illegible]

మకరం: [illegible]

కుంభం: [illegible]

మీనం : [illegible]

- [illegible]

## సచివాలయంలో సంక్రాంతి సంబరాలు

### - ఆకట్టుకున్న రంగవల్లులు.. గంగిరెద్దుల ప్రదర్శన

**సచివాలయం,జనవరి 9,ప్రభాతవార్త :** ఏపి రాష్ట్ర సచివాలయంలో సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లి పోటీలు,గంగిరెద్దుల ఊరేగింపులు నిర్వహించారు.అనంతరం రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల వైస్ ప్రెసిడెంట్ సులోచన మాటా్లడుతూ ప్రతి ఏడాది రాష్ట్ర సచివాలయంలో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తిరుపతిలో అనుకోని సంఘటన కారణంగా కొన్ని కార్యక్రమాలు రద్దుచేస్తున్నట్లు ఆమె తెలిపారు.సచివాలయ సంఘం ఉద్యోగుల తరపున బాధితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సంక్రాంతి రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు.చంద్రబాబుపై ఉద్యోగులు చాలా ఆశలు పెట్టుకున్నారని వారి ఆశలు,ఆకాంక్షలు ఆయన నెరవేరుస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.రంగవల్లుల్లో మహిళా ఉద్యోగులంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.సుమారు 500మంది మహిళలు పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మనోహర్, జాయింట్ సెక్రటరీ శ్రీను,రమాదేవి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సీఎం దార్శనికతకు నిదర్శనం ఆర్టీజీఎస్

### - మంత్రి నాదెండ్ల మనోహర్



రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సమావేశంలో మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు, దార్శనికతకు రియల్ టైమ్ గవర్నెన్స్ ఒక నిదర్శనమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. టెక్నాలజీలో పాలన కొత్త పుంతలు తొక్కించగలమని ఆర్టీజీఎస్ ద్వారా సీఎం నిరూపించారని తెలిపారు. గురువారం ఆయన సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ని సందర్శించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. దినేష్ కుమార్ మంత్రికి స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదేండ్ల మనోహర్ మాట్లాడుతూ ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ఇంతమంది వ్యవస్థ కలిగి ఉండటం అద్భుతమన్నారు. ఈ సాంకేతిక సదుపాయంతో ప్రభుత్వంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు చేపట్టగలమన్న నమ్మకం ఆర్టీజీఎస్‌ను చూశాకా కలుగుతోందన్నారు. టెక్నాలజీ కలిగి ఉండటం ఒక ఎత్తైతే, డాటా కలిగి ఉండటం అనేది చాలా ముఖ్యమన్నారు. డాటా వాస్తవాన్ని చాటుతుందని, డాటాను ఉపయోగించుకుని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆస్తులు, పథకాలు అమలు తీరు, లబ్దిదారులకు పథకాలు ఎలా అందుతున్నాయి తదితర అంశాలను నవంర్ధవంతంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌ను ప్రజలకు ఒక పద్దతి ప్రకారం క్షేత్రస్థాయిలో పంచాయతీ, పురపాలక స్థాయిలో

### - క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి డాటా ముఖ్యం

### - ప్రభుత్వ పనితీరులో ఆర్టీజి సహకారం ఎంతో అవసరం

అందించడానికి ఆర్టీజీఎస్ చక్కగా పనిచేస్తోందన్నారు. ఈ సమాచారంలో శాఖల్లో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఇంకా మెరుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, అలాగే కార్యక్రమాల అమలుకు ఒక నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని ప్రభుత్వంలో జవాబుదారీతనం పెంచేలా ఉపయోగించుకోవచ్చని ఆర్టీజీఎస్‌ను చూశాకా నమ్మకం కలుగుతోందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సాంకేతిక సహకారం అందించడంలో అద్భుతంగా పనిచేస్తున్న ఆర్టీజీఎస్ సీఈఓ, ఆ సంస్థ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.ఒకే ప్రభుత్వం, ఒకే రాష్ట్రం, ఒకే పౌరుడు, ఒకే డాటా విధానంతో స్మార్ట్ గవర్నెన్స్‌ను ప్రజలకు అందించే విధంగా ఆర్టీజీఎస్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయనేది నిరంతరం పర్యవేక్షిస్తూ ఆర్టీజీఎస్ ఎప్పటికప్పుడు తనవద్ద ఉన్న డాటా ఆధారంగా విశ్లేషిస్తోందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో అపారమైన డాటా లభ్యమవుతోందని, అయితే ఇప్పటి వరకు ఈ డాటా అంతా ఒకే చోట అనుసంధానం కాలేదని, ఆర్టీజీఎస్ ఇప్పుడు అన్ని శాఖల్లో లభ్యమవుతున్న డాటాను సేకరించి ఒక పెద్ద డాటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు, డీప్‌టెక్ సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకుని ఈ డాను విశ్లేషించి ప్రజలకు మరింత మెరుగైన సేవలను ప్రభుత్వం అందించడానికి ఆర్టీజీఎస్ సహకారం అంది స్తుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ, ప్రతి పల్లెకు ఒక ప్రత్యేక ప్రొఫైల్ రూపొంది స్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.

## తిరుమల సమాచారం

### 1.20లక్షల వైకుంఠద్వారం దర్శన టోకెన్లు జారీ

### - ఆఫ్‌లైన్‌లో భక్తులకు కేటాయింపు



**తిరుమల,జనవరి 9పభాత వార్త ప్రతినిధి:** తిరుమలేశుని ఆలయంలో వైకుంఠఏకాదశి, ద్వాదశి ఘడియల్లో వైకుంఠద్వార దర్శనం కోసం తిరుపతిలోని 8ప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లో జారీచేసిన టోకెన్లు గురువారం ఉదయం 10గంటలకు 1.20లక్షలు భక్తులు అందుకున్నారు.ఈ టోకెన్ల కోసం బుధవారం మధ్యాహ్నానికే తిరుపతిలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల భక్తులతో బాటు తిరుపతి పరిసరాల్లోని భక్తులు, తెలుగురాష్ట్రాల నుండి భక్తులు భారీగా తోపులాటలు జరిగాయి. కొన్ని విషాద ఘటనలతో భారీ భద్రత, ఏర్పాట్లు మధ్య 12వతేదీ వరకు మూడురోజుల టోకెన్లు కేటాయించారు. గురువారం రాత్రికి తిరుమల కొండ సామాన్యభక్తులతో నిండిపోయింది. గదులు దొరకని భక్తులు ఆలయం ముందు భాగంలో, ప్రత్యేక షెడ్లలో వసతిపొందారు. కాగా 13వతేదీ నుండి 19వరకు ఆయారోజుల్లోనే టోకెన్లు జారీచేస్తారు.

## రేషన్‌బియ్యం మాయం కేసు..

### నిందితుల కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పేర్ని నాని కుటుంబ సభ్యులకు చెందిన గిడ్డంగిలో రేషన్ బియ్యం మాయంపై కేసు నమోదైంది ఈ కేసులో నిందితులను 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ మచిలీపట్నం కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏ2 మానస్ తేజ్, ఏ4 మంగారావు , ఏ5 ఆంజనేయులను కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కోర్టు అనుమతిలో పోలీసులు ఒకరోజు వారిని విచారించారు. ఏ1 గా ఉన్న పేర్ని జయసుధను మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశముంది.

## అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

### కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇంచార్జి మాణికం ఠాకూర్

### - అమిత్ షా వ్యాఖ్యలపై నెల్లిమర్లలో నిరసన

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా) జనవరి 9 ప్రభాతవార్త :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాకూర్ డిమాండ్ చేశారు. పార్లమెంటును అంబేద్కర్‌ను అవ మాని స్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నవ సత్యాగ్రహం పేరుతో విజయనగరం జిల్లా నియోజక వర్గ కేంద్రం నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్‌లో డిసిసి అధ్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల నియోజక వర్గ సమన్వయ కర్త గంటా సతీష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమం జరిగింది. తొలుత రామతర్ధం జంక్షన్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఇందిరా కాలనీకి వెళ్లి అక్కడ ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానికులను ఉద్దేశించి ఠాకూర్ మాటా్లడారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అన్నారు. రాజ్యాంగ నిర్మాత గా పేరుగాంచిన అంబేద్కర్ భారత జాతికి దేవుడని కొనియాడారు. ప్రపంచ మేధావిగా గుర్తింపును పొందారని అన్నారు. అటువంటి మహనీయు డు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తీరుపై రాష్ట్ర పెద్దలు ఖండించక పోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ అధ్యక్షుడు , సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలి తదితరులు మాటా్లడుతూ రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు అంబేద్కర్‌ను అవమానించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. నవ సత్యాగ్రహం పేరిట కా ంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశమంతా ఆందోళన చేపడు తున్నట్లు చెప్పారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పకపోతే 26నుంచి ఆందోళన ఉధృత ం చేస్తామని హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట నియోజక వర్గాల సమన్వయ కర్తలు గంటా సతీష్, డాక్టర్ చిత్రాడ దుర్గాప్రసాద్,డాక్టర్ గేదెల తిరుపతి, ఒబిసి జిల్లా చైర్మన్ తారకేశ్వరరావు, నియోజక వర్గ చైర్మన్ రాయల సురేష్,యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విషాదంలో తిరుపతి

### - భక్తుల నిరసన

**తిరుమల,జనవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ వెంకన్న ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార మోక్షమార్గం తెరచుకోవడానికి 48గంటల ముందే తిరుపతిలో విషాదం అలముకుంది. ఆధ్యాత్మికనగరంలో దర్శన టోకెన్లకోసం వచ్చిన 50వేలమంది యాత్రికులను 8ప్రాంతాల్లో నియంత్రించలేని పోలీసు, టిటిడి అధికారులు విఫలమయ్యారు. దీంతో కొన్నిగంటల్లోపే ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, 40మందివరకు భక్తులు క్షతగాత్రులవడంతో తిరుపతిలో విషాదం అలముకుంది. ఒకచోట,రెండుచోట్ల కాదు....ఏకంగా నాలుగు చోట్ల టోకెన్లు జారీచేసే కేంద్రాల వద్ద ఒక్కసారిగా బుధవారం రాత్రి జరిగిన తోపులాట, తొక్కిసలాట ఘటనలు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా,తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నలుమూలల నుండి భారీగా తరలి వచ్చిన భక్తుల హృదయాలను కలచివేసింది. ఈ ఘటనలతో పలుచోట్ల తిరుపతిలో సామాన్య భక్తులు నిరసనకు దిగారు. గురువారం ఉదయం తిరుమలకు చేరుకున్న భక్తులను సర్వదర్శనానికి వైకుంఠమ్ 2 క్యాంప్లెక్స్ లోనికి అనుమతించక పోవడంతో ఏటిసి, ఎంబిసి ప్రాంతాల్లో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నఫళంగా దర్శనాలను నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటనే ఆందోళన చెందారు. టోకెన్లు లేని భక్తులను దర్శనానికి అనుమతించబోమని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేసినా భక్తులు ససేమిరా వినిపించుకోలేదు. శుక్రవారం నేడు వైకుంఠ ఏకాదశి, శనివారం వైకుంఠ ద్వాదశి పర్వదినాలు కావడంతో నేటి వేకువజామున 2గంటలకు ఆలయంలోని వైకుంఠద్వారాలను తెరుస్తారు. ఇందుకు సామాన్యభక్తులు భారీగా చేరుకున్నారు. గురువారం సాయంత్రానికి కొండపై విపరీతంగా రద్దీ కనిపించింది. కొండపై వైకుంఠద్వార దర్శనం కోసం విఐపిలు తాకిడి కూడా ఎక్కువైంది. ప్రముఖులు భారీసంఖ్యలో తిరుమలకు రావడంతో వసతి కోసం టిటిడి వసతికల్పన విభాగం అధికారులు తలలుపట్టుకొంటున్నారు.

## సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి



సోలార్ పవర్ కార్పోరేషన్ 2025 డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటిరవికుమార్

**విజయవాడ, జనవరి9, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ, క్యాలెండర్ ను చీఫ్ సెక్రటరీ కే. విజయానంద్ తో కలిసి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలోని మూడో బ్లాక్ లోని మంత్రి ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడారు. పునరుత్పాదక రంగానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ని రూపొందించినట్లు పేర్కొన్నారు. గతంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్లిన పునరుత్పాదక రంగం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో సోలార్ పవర్ కార్పోరేషన్ పనితీరును మంత్రి గొట్టిపాటి అభినందించారు. నాణ్యమైన విద్యుత్ ను అందించడంలో కార్పోరేషన్ కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ కె.విజయానంద్ , ఏపీ జెన్కో ఎండీ చక్రధర్ బాబు, ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చెకూరి, సీపీడీసీఎల్ సీఎండీ పఠాన్ శెట్టి రవి సుభాష్ , సోలార్ పవర్ కార్పోరేషన్ ఎండీ కమలాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## గేమ్‌ఛేంజరు, డాకు మహారాజ్ సినిమాల టికెట్ ధరల పెంపు 10 రోజులే

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాల టికెట్ విషయంలో పెంచిన ధరలను పది రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. గతంలోనూ ఇదే తరహా ఉత్తర్వులిచ్చామని, అవి ప్రస్తుత సినిమాల విషయంలోనూ వర్తిస్తాయని తెలిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గేమ్ చేంజర్ డాకు మహరాజ్ సినిమాల అధిక షోల ప్రదర్శన టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ గుంటూరుకు చెందిన అరిగెల శ్రీనివాసుల హైకోర్టులో పిల్ వేశారు. న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ టికెట్ ధరలను 14 రోజులు పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. ఆ సినిమాల కథానాయకులు, ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి బంధువుల కావడంతో అధిక షోలకు, ధరల పెంపునకు అనుమతి ఇచ్చారన్నారు. గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ వేడుకకు వెళ్లి వస్తూ ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని చెప్పారు. అర్ధరాత్రి వేళల్లో సినిమా ప్రీమియర్ షోల ప్రదర్శనను నిలిపివేసేలా ఆదేశాల జారీ చేయాలని కోరారు.

## మైనార్టీ వర్గాల పిల్లలు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి: మంత్రి ఫరూక్



కొండపల్లి దర్గా వద్ద ఉర్సూ కార్యక్రమంలో మంత్రి ఫరూక్

**విజయవాడ.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** జీవన మార్గంలో ఏ రంగంలో రాణించాలన్నా , చదువుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అమరావతి లోని తన క్యాంపు కార్యాలయంలో భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా, ఆదర్శప్రాయురాలిగా నిలిచిన షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్ ఫాతిమా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే లతో కలిసి షేక్ ఫాతిమా కలిసి పని చేశారని అన్నారు. బాలికా విద్య కోసం అహర్నిశలు కృషిచేసిన భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా షేక్ ఫాతిమా కార్యాచరణ అమలు లో ఎన్నో ఇబ్బందులకు, భౌతిక దాడులకు కూడా గురైనప్పటికీ తాను అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసిన ఘనత సొంతం చేసుకుని భావితరాలకు ఆదర్శప్రాయురాలిగా నిలిచిందని అన్నారు. మైనారిటీ వర్గాలు, ప్రజలందరూ చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. చదు వు తోనే తాము అనుకున్న రంగంలో ఉన్నత స్థాయిలోకి చేరేందుకు మార్గం సులభ తరం అవుతుందని అన్నారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షే మానికి , అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. బాలిక విద్య కోసం ఎంతో కృషి చేసిన షేక్ ఫాతిమా సేవలను ప్రభుత్వం 8వ తరగతి పాఠ్యపుస్తకాల్లో ఆమె జీవిత చరిత్రను, సేవలు, పడిన కష్టాలను సవివరంగా పేర్కొంటూ తెలుగు పాఠ్యపుస్తకంలో చేర్చి తగిన గౌరవం కల్పించడం జరిగిందని మంత్రి ఫరూక్ అన్నారు.అనంతరం విజయవాడ సమీపంలోని కొండపల్లి గ్రామంలో జరిగిన హజరత్ సయ్యద్ షా బొఖారి వారి 428 వ ఉరుసు ముబారక్ ఉరుసు మహోత్సవం తొలి రోజు కార్యక్రమానికి న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. మూడు రోజులపాటు ఉరుసు మహోత్సవాన్ని నిర్వాహకులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. పురాతన దర్గాను సందర్శించిన మంత్రి ఫరూక్ చాదర్ ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు... ఎన్ఎండి ఫరూక్ ఉమ్రా యాత్రకు ఆంధ్రప్రదేశ్ న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఈనెల 10వ తేదీ శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లనున్నారు.ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా, మదీనా ప్రార్థన మందిరాల సందర్శన అనంతరం 18వ తేదీన మంత్రి ఫరూక్ తిరిగి రానున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్రా యాత్రకు బయలుదేరుతున్న మంత్రి ఫరూక్ ను మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య అధికారులు, ఇంకా పలువురు ముఖ్యులు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని రావాలని ఆకాంక్షిస్తూ దువా చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం, శాంతి సౌభాగ్యాల కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఉమ్రా యాత్రలో ప్రార్థిస్తానని పేర్కొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక అర్జీలు స్వీకరించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,.జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా సమస్యలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తున్నామని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేసారు.తవ్వేకొద్ది గత ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతున్నాయన్నారు.గత ప్రభుత్వ నిరక్ష్యంగా కారణంగానే సమస్యలు పెరిగాయన్నారు.వాటిపై లెక్కకు మించిన ఫిర్యాదులు తమ పార్టీకి అందుతున్నాయన్నారు.తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నాడు నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి గారు పాల్గొని పలు అర్జీలను స్వీకరించారు.పలు దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను శాఖల వారిగా పరిష్కారానికి మంత్రి ఎండర్స్ చేసి పరిష్కారానికిచొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రభుత్వ విప్ పంచమర్తి అనురాధ, కవాలి గిరిష్మా పాల్గొన్నారు. భూములు నష్టపరిహారం ఇప్పించండి. పల్నాడు జిల్లా నడికుడి గ్రామానికి చెందిన కే. శ్రీనివాసరావు సహా మరో ఏడుగురు రైతులకు సంబంధించిన 2 ఎకరాల పొలాలు గత వైకాపా ప్రభుత్వ హయంలో బైపాస్ రోడ్డు విస్తరణలో కోల్పోయామని , రెండు సంవత్సరాల నుండి అధికారులు చుట్టూ తిరిగిన కాలయాపన చేస్తున్నారని మంత్రికి అర్జీ సమర్పించారు. వైకాపా కక్షసాధింపుతో ఇళ్లు కోల్పోయాం 201419 టిడిపి హయాంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ టిడ్కో గృహాలు తమకు మంజూరై, వాటికి 25000/ డిడి కట్టిన కానీ గత వైసిపి పాలకుల కక్ష సాధింపు చర్యలో భాగంగా తమకు గృహాలు ఇవ్వలేదని కడప జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎం చక్రవర్తి టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి అర్జీ అందజేశారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి వినతి ఏపీ టూవీలర్స్ అసోసియేషన్ తరఫున వాహన సైట్ లో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారికి అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు.వల్లభనేని వంశీ నిర్వాకంతో తీరని నష్టం కృష్ణాజిల్లా మల్లవల్లి గ్రామానికి చెందిన ఆర్సీ నెంబర్ 11 లో గల 1400 ఎకరాల భూమిని ఎకరాకు ఏడున్నర లక్షలు నష్టపరిహారంతో వారికి కంపెనీల నిర్మాణం రెవెన్యూ వారు అందజేసారని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రోత్బాలం తో బాధితులకు తీరని అన్యాయం జరిగిందని, సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ బి. సాంబశివ రావు ప్రజా వేదికలో మంత్రికి అర్జీ సమర్పించారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్ పంచమర్తి అనురాధ, కావాలి గిరిష్మా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేటి నుంచి సంక్రాంతికి మరికొన్ని అదనపు ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,జనవరి 9,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల ప్రజలు నూతన సంవత్సరంలో ఆనందోత్సహాలతో జరుపుకునే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే అదనంగా మరికొన్ని సంక్రాంతి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07209ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10వ తేదీ రాత్రి 8.15గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07210ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.40గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07211 ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12న రాత్రి 9.45గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.25గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07212ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4.35గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సర్వీసులు సికింద్రాబాద్, కాచిగూడ,ఉందానగర్,షాద్‌నగర్,జడ్చర్ల,మహబూబ్‌నగర్,వనపర్తి, గద్వాల,కర్నూలు, డోన్,గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప,రాజంపేట, రేణిగుంట రైల్వేస్టేషన్లలో నిలుస్తాయి. చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07213ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీన రాత్రి 8గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07214ఎక్స్‌ప్రెస్

ఈ నెల 12వ తేదీన సాయంత్రం 7.40గంటలకు కాకినాడ టౌనన నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. శ్రీకాకుళం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07208ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం 2.45గంటలకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.50గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చర్లపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే నెంబర్ 07206ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీన ఉదయం 9.30గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి ఆదేరోజు సాయంత్రం 7.10గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది.

## దుర్గమ్మను దర్శించుకున్న రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి

**ఇంద్రకీలాద్రి, జనవరి 9, ప్రభాతవార్త :** దుర్గమ్మను గురువారం రాష్ట్ర రెవెన్యూ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసి , ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి గుంటూరు వాస్తవ్యులు సి వేంకటేశ్వర్లు, కుటుంబసభ్యులతో కలిసి రు.1,11,116 ల విరాళాన్ని గురువారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసి , ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. దుర్గమ్మవారికి గురువారం కామారెడ్డికి చెందిన మాలోతు నవీన్‌కుమార్ ఆలపించిన భక్తిసంగీత నీరాజనం భక్తులను అలరించింది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ కాల్ టెండర్ ప్రకటన
నిట్ నెం.108 టు 109/జిటిఓ-1/2024-25, తేది: 06.01.2025
ప్రకాశం జిల్లా ర & భ మార్కాపురం డివిజన్ పరిధిలో 2 పనుల కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా వ్యయం: రూ.4.20 లక్షలు. టెండరు డాక్యుమెంట్ www.tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు సమర్పించు చివరి తేది: 24.01.2025. ఫోన్.9440818993.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, రహదారులు & భవనముల శాఖ, మార్కాపురం
DIPR.No.15107/CL/Advt/1/1/2022-23, తేది: 09.01.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ నెం.116-117/TO/EE/R&B/KNG/2024-25, తేది: 03.01.2025
ప్రకాశం జిల్లాలో 2 అత్యవసర మరమ్మతు పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం కింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ: రూ.10.00 లక్షలు. డౌన్‌లోడ్ కొరకు తేది: 10.01.2025 సా.4.00 గం. దాఖలు కొరకు చివరి తేది: 16.01.2025 మ.3.00 గం. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) డివిజన్, కనిగిరి
DIPR.No.15098/CL/Advt/1/1/2022-23, తేది: 09.01.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
నెం.04/జిటిఓ-1/2024-25, షార్ట్ చిట్ టెండర్ ప్రకటన తేది: 06.01.2025
ప్రకాశం జిల్లా రహదారులు మరియు భవనముల శాఖ మార్కాపురం డివిజన్ క్రింద షార్ట్ కాల్ చిట్ టెండరు నోటీసు నెం.4 పని కోసం టెండరు కోరబడుచున్నవి. అంచనా వ్యయం: రూ.1.00 లక్ష. టెండర్ డాక్యుమెంట్ల కొరకు కార్యాలయము పని వేళల యందు సంప్రదించవలెను. టెండరు సమర్పించు చివరి తేది: 20.01.2025. ఫోన్ నెం. 9440818993.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, రహదారులు & భవనముల శాఖ, మార్కాపురం
DIPR.No.15095/CL/Advt/1/1/2022-23, తేది: 09.01.2025

వార్త

మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

న-సెయింట్ థెరిస్సా

# సమన్వయ లోపానికి బాధ్యులెవరు?

వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ నిర్వహణతో అధికారుల వైఫల్యంతో ఆరుగురి భక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సందర్భమేదైనా అనుకోని సంఘటన జరిగిపోయింది. తిరుపతి పట్టణంలో బైరాగి పట్టెడ, విష్ణునివాసం, రామానాయుడు సూళ్ల వద్ద వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కోసం కౌంటర్‌లు ఏర్పాటు చేశారు తప్ప వేలాది భక్తులు వస్తారన్న అంచనాలున్నా అనుభవలేమి వలనో సమన్వయం లేకనో తగినంత భద్రతా సిబ్బందిని నియమించలేదు. టిటిడి సెక్యూరిటీ కానీ పోలీసు సిబ్బంది కాని ఈ కేంద్రాలవద్ద రద్దీని అదుపు చేయలేక పోయారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు లేవు. బుధవారం నాటి తొక్కిసలాట ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందగా, 44 మంది క్షతగాత్రులయ్యారు. ముక్కోటి ఏకాదశి నాడు వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని అంచనాలు ఉన్నా అధికారుల నిర్లక్ష్య వైఫల్యంతో జరగరాని ప్రాణనష్టం జరిగింది. సరైన పోలీసు బందోబస్తు చేయలేకపోవడం టోకెన్ల జారీ సమయం పట్ల సరైన అవగాహన లేకపోవడమూ ఈ సంఘటనకు కారణాలుగా కనపడుతున్నాయి. దీనికి తోడు పాత పద్ధతులు, భక్తుల రద్దీ అంచనాలను పరిగణనలోకి తీసుకోకపోవడమూ తప్పిదమే. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలోకి వచ్చింది. తిరుపతిలో టోకెన్ల జారీకి ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల వద్ద విశేషమైన రద్దీ ఏర్పడింది. కొత్త కేంద్రాలు, కొత్తఏర్పాట్ల పర్యవేక్షణలో లోపం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. టోకెన్ల జారీ సమయాలను కూడా ముందుకు ప్రకటించినట్లు జరుగకపోవడమూ రద్దీకి కారణంగా గుర్తించారు. టిక్కెట్ల జారీ సమయంలో క్యూలోకి వెళ్లకముందే గుమిగూడిన జనం తొక్కిసలాటలో ప్రాణాలు వదలడమనేది తిరుపతి చరిత్రలోనే ఇది ప్రథమం. నాలుగు దశాబ్దాల నాడు శ్రీవారి దర్శన సందర్భంగా క్యూలైన్‌లో తొక్కిసలాటకు గురై కొంత మంది మరణించిన విషయం విదితమే. ఇలాంటి సంఘటనలు, సందర్భాలలో రోజుకి లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గట్లు భద్రతా సిబ్బందిని సమకూర్చుకోలేకపోయారు. ఏమయినా బుధవారం నాటి ఘటనకు దేవాలయ అధికారులదే బాధ్యత. సరైన సమాచారం లేకుండా ఉన్నట్టుండి ఒక్కసారిగా క్యూలైన్లలోకి భక్తులను వదలడంతో తొక్కిసలాట చోటు చేసుకుందని భక్తులు టిటిడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలకాలంలో దేవాలయాల్లో అంతరాలయ దర్శనాలు, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు,గంటల తరబడి క్యూలైన్ల నిలిపివేత వంటి కారణాలచేత భక్తుల రద్దీ బాగా పెరిగిపోతుంది. వాటిని అదుపులో పెట్టగలిగిన యంత్రాంగాన్ని టిటిడి ఇంతవరకు ఏర్పాటు చేసుకోలేకపోయింది. తొలుత క్యూలైన్‌లు అందుబాటులో ఉన్నా భక్తులను ఆ క్యూల్లోకి ప్రవేశించకుండా బయట రోడ్డుమీదనే ఉంచారు. బుధవారం రాత్రి 9 గంటలకు అస్వస్థురాలైన మహిళ కోసం పద్మావతి పార్కు తలుపుతెరవగా ఒక్కసారిగా ఆ క్యూలోని జనం తోసుకువెళ్లారు. ఇలా క్యూలైన్ల వద్ద ఊపిరాడక చాలా మంది అస్వస్థులైనారు. గాయపడిన వారికి టిటిడి సెక్యూరిటీ సిబ్బంది సిపిఆర్ చేసి వారిని ఆపదనుంచి గట్టెక్కించడంవలన కొన్ని ప్రాణాలైనా ఉపశమించినందుకు వారు అభినందనీయులు. వైద్యచికిత్సలకు రూయా ఆస్పత్రికి తరలించిన క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందలేదు. డాక్టర్లు,నర్సింగ్ సిబ్బంది డ్యూటీ మారే సమయం అని సరిపెట్టుకోలేం. ఇలాంటి జాప్యాలకు ఎవరు బాధ్యత వహిస్తారు. రాత్రి 9 గంటలకు 'క్యూ' తలుపులు ఎలాంటి నోటీసులు లేకుండా తెరవడం దుస్సంఘటన జరిగిన తర్వాత 11 గంటలకు టోకెన్ల జారీకి ఉపక్రమించడమంటే నిర్ణీత సమయాల విషయంలో సిబ్బందికి సరైన మార్గదర్శకత్వం లేదన్నవిషయం విశదమౌతోంది. ఆఖరుకు ఈ దుర్ఘటనకు డిఎస్‌పి తొందరపాటు, ఇంటిలిజెన్స్ వైఫల్యం పేరిట విశ్లేషించడం అధికారులు తమతమ బాధ్యతల నుంచి పలాయనం చిత్తగించడమే. ఇంతకు ముందు దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనలు చూస్తే ప్రతీదీ వేర్వేరు పరిస్థితులలో జరిగినవే. 2003 ఆగస్టు 27న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో కుంభమేళా పవిత్రస్నానాల సమయంలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది, 2005లో ఆ రాష్ట్రంలోని సతారాం జిల్లాలో మంధర్‌దేవి ఆలయంలో జరిగినతొక్కిసలాటలో 350మంది భక్తులు, రాజస్థాన్‌లోనిచాముండా ఆలయంలో 2008 సెప్టెంబరు 30న జరిగిన తొక్కిసలాటలో 250 మంది మృతిచెందారు. అదే సంవత్సరం హిమాచల్‌ప్రదేశ్‌లోని నైనాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 162మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంతకన్నా దారుణమై తొక్కిసలాట వంతెన కూలిపోతోందన్న ఓ వదంతిని నమ్మిభక్తులు వంతెన మీద నుంచి ఇటూ అటూ పరుగెత్తడంతో 115 మందిని బలితీసుకొంది. మన రాష్ట్రంలోనే గోదావరి పుష్కర సమయంలో జరిగిన తొక్కిసలాటలో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2015జులై 14న పుష్కరాలప్రారంభం రోజున గోదావరి ఘాట్‌వద్దకు చేరిన సమయంలో ఈసంఘటన జరిగింది. ఇప్పుడు మళ్లీ ఆయన పాలనలోనే ఈ తొక్కిసలాట దుర్ఘటన జరిగింది. కారణాలేవైనా, కారకులెవరైనా అన్నెంపున్నెం ఎరుగని భక్తులు అమాయకంగా బలైపోయారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై పటిష్ట చర్యలు తీసుకొని మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి.

ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.



సోక్రటీస్

చేతను మాటగా మార్చడం కంటే మాటను చేతగా మార్చడమే కష్టమని అందరికీ తెలుసు.



మార్టిన్ లూథర్‌కింగ్

## ప్రజావాక్కు



### ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

నేరస్తులకేసులగురించి మాట్లాడేటప్పుడురాజకీయ నాయకులు తప్పించుకునే పదం ఏమంటే చట్టం తన పని తాను చేసుకుంటూపోతుందని. నిజంగా అలా జరుగుతోందా అని ప్రశ్నిస్తే ద్వంద సమాధానాలు వస్తున్నాయి. ఉదహరణకు ఏనేరం నిరూపించకుండావట్టినే చంద్రబాబు నాయుడు గారిని 53రోజులు కారాగారం పాలు చేసారు. అదే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద అనేక అవినీతి కేసులున్నా, పదిసంవత్సరాల పైగా బైయిల్ మీద ఉన్నా, వేల మీద కోర్టులలో వాయిదాలు పడుతున్నా కేసుల పరిష్కారానికి తీవ్ర జాప్యం జరుగుతుండడాన్ని ఏమనాలి? చట్టం దాని పని అది చేసుకుపోతోందనాలా? కోట్లకొలది కేసులు దేశంలోని అన్ని కోర్టులలోనూ దశాబ్దాల తరబడి పరిష్కారం కాకుండా పేరుకు పోయిన్నాయంటే ఏమనాలి?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సమాన విద్య అందించాలి

తెలంగాణ రాష్ట్రంలో 40 శాతం మంది పేదలు బ్రతుకులు ఛిద్ర స్థితిలోనే ఉన్నాయని ఇందిరమ్మ ఇండ్ల సర్వే తెలిపింది. వారి బాగోగుల కోసం ప్రయత్నం చేయవలసి ఉంది. అందుకు సామాజిక భద్రత లేదా సామాజికతతో కూడినఆర్థికభద్రత అందించవలసినఅవసరంఉంది. అయితే ఇందుకు మానవాభివృద్ధి నివేదికను లెక్కలోకి తీసుకోవాల్సినఅవసరంఉంది. తెలంగాణ ఉద్యమం ప్రారంభంలో ఒక స్వేచ్ఛాయుత తెలంగాణకావాలి అని ఒక ప్రజాస్వామిక తెలంగాణ కావాలి అని మాట్లాడుకున్నాం. ఆ దిశగా ప్రయాణం సాగించాం. ఇప్పుడు పరిపూర్ణ హక్కులు కలిగిన తెలంగాణకోసం కొట్లాడుతున్నాం. అందరికి సమానత్వం కలిగిన విద్యను అందించాలి.

-భారత అవినాష్, జనగామ

### ప్రణాళికలు రూపొందించాలి

విపత్కర పరిస్థితులు ఏర్పడడానికి పర్యావరణంలో కలుగుతున్న పెనుమార్పులే ప్రధానకారణం. పట్టణాలు, నగరాలు అతివేగంగా విస్తరిస్తున్నాయి. చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. పర్యావరణానికి నష్టం కలుగుతుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించి, అమలు చేయాలి. ఈదిశగా ప్రభుత్వాలు చట్టాలు రూపకల్పన చేయాలి.

- ఎన్.కృష్ణమోహన్, కర్నూలు జిల్లా

### విశ్వవిద్యాలయ ప్రక్షాళన అవసరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల్లో తమిళనాడు, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొన్ని యూనివర్సిటీల పేర్లతోయథేచ్ఛగా కోర్సులు నిర్వహిస్తున్నారు. వన్ సిట్టింగ్‌లోనే డిగ్రీ సర్టిఫికెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజాలను బురిడీ కొట్టిస్తున్నారు. పగలు ఉద్యోగం చెసుకుంటూ రాత్రిళ్లుయూనివర్సిటీలకు హాజరై, పరీక్షలు రాస్తే సర్టిఫికెట్లు ఇస్తామని,క్యాంపస్ ఇంటర్వ్యూలను కూడా ఏర్పాటు చేసి ఉద్యోగాలను పొందేందుకు సహాయం చేస్తామని, ఈ నకిలీ విద్యాసంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో అమాయకులైన విద్యార్థులనుఆకట్టుకుంటున్నాయి. అవి నకిలీ యూనివర్సిటీలని తెలియని చాలామంది విద్యార్థులు వాటిల్లో ప్రవేశాలు పొందుతున్నారు. తీరా డబ్బు, సమయం వెచ్చించి చదివిన తర్వాత ఆ ధ్రువపత్రాలు చెల్లవని చెబుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత విద్యాశాఖ,ఉన్నత విద్యా మండలి నకిలీ విశ్వవిద్యాలయాలపై దృష్టి పెట్టాలి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### పెరుగుతున్న వైద్యం ఖర్చులు

దేశంలో నానాటికీ పెరుగుతున్న వైద్యం ఖర్చులపట్ల సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యం పేరిట జరిగే వ్యాపారానికి కళ్ళెం వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈనేపథ్యంలో ఆస్పత్రిఫీజులు అందుబాటులో ఉండే విధంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ నిబంధనలను కఠినంగా అమలుచేయాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం శుభపరిణామం. అయితే, దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రులేవీ ఈనిబంధనలను పాటించడం లేదు. ఆరోగ్యంపై పెరుగుతున్న వ్యయం కారణంగా ప్రభుత్వం ఏదైనా కఠినమైన నిబంధనలను రూపొందించినట్లయితే ఆరోగ్య సంరక్షణలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించవచ్చు.

-సి. సాయిరుత్విక్, నల్గొండజిల్లా

### అన్ని పథకాలకు డిజిటల్ కార్డులు

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు నూతనంగా డిజిటల్ కార్డును అందిస్తుంది. దీనివల్ల ఎంతోమంది ప్రజలు లబ్ధిపొందుతారు. అంతేకాదు వారి ఆరోగ్యసంరక్షణకు, అన్నివిధాల ప్రభుత్వ పథకాలకుకూడా ఈడిజిటల్‌కార్డు ఉపకరించడంహర్షణీయం. అయితే దీన్ని అర్హులకే అందేలా చూడాలి. వీటి జారీ పారదర్శకంగా ఉండాలి. కుల మతాలకు వర్ణాలకు అతీతంగా ఉండాలి.

-పి. అశోక్, జగిత్యాలజిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మళ్లీ మాస్కులే శరణ్యమా?

**కోవిడ్ సోకిన సమయంలో జాగ్రత్తలు పాటించడంలో జాప్యం, కొంతలో కొంత నిర్లక్ష్యం, ఆనక ప్రాణభయం కారణంగా లక్షలాది మంది కరోనా వ్యాధిగ్రస్తులయ్యారు. పుష్కర కాలం నాడే హెచ్‌ఎంపివిని కనిపెట్టినా ఇప్పటికీ దాని నిరోధానికి, నయం చేయడానికి కానీ వాక్సిన్ కనిపెట్టలేకపోవడం తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందన ప్రభుత్వ ఉదాసీనత వైఖరి కనపడుతోంది. హెచ్‌ఎంపివి చైనా వైరస్ కానేకాదని స్పష్టమైంది. కనుక కాస్తంత ఊరట. అంతే తప్ప ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనారోగ్య సమస్యలే.**

వరిగొండ కాశీ విశ్వేశ్వరరావు

సృష్టిలో కనపడిన ప్రతి వైరస్ ప్రమాద భరితం కాకపోయినా తెలిసీ తెలియని పరిజ్ఞానంతో రేకెత్తించే అనుమానాల వల్లనే ప్రజలు ఆందోళన పడుతున్నారనేది జగద్విదితం. అలా అని ఏ వైరస్ వ్యాప్తినీ కొట్టిపారేయలేం. దాదాపు పుష్కరం నాడు నైజీరియాలో 28 మందిని వ్యాధిగ్రస్తులను చేసిన వైరస్ హెచ్‌ఎంపివి ఇన్నాళ్లకు మళ్లీ కనపడి మరోసారి హెచ్చరిస్తోంది. నిజానికి ఈ వైరస్ 2008 నాటికే ఉన్నా అప్పుడప్పుడు కనిపించి వెళ్లిపోతుంటుంది. పెద్ద ప్రమాదకారి కాదు. ఎన్నడూ ప్రాణహానిలేదని, ఇమ్యూనిటీ లేనివారు, బాలలు, వృద్ధులు మాత్రమే ఈ వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ వైరస్ చరిత్రను చూస్తే తెలుస్తుంది. వైరస్‌లన్నీ వ్యాధి కారకాలే అయినా వాటి విజృంభణ తీవ్రతల స్థాయిలో తేడా గోచరిస్తుంది. ఇన్‌ఫ్లూయెంజా, స్పానిష్ ఫ్లూ, ఆసియన్‌ఫ్లూ, సార్స్, మెర్స్ వంటి వైరస్, కొంతకాలం ఉండి కనుమరుగైపోతాయి. ఆ తర్వాత వచ్చిన హైపటైటిస్ వైరస్ ఇప్పటికీ మనుషుల మీద దాడి చేస్తోంది. అయితే ఆ వైరస్ నిరోధానికి వాక్సిన్ కనిపెట్టినందున పెద్ద ప్రమాదం లేనట్లే. కాగా 2019లో చైనా నుంచి దిగుమతి అయిన కొవిడ్ -19 వైరస్ మాత్రం ప్రపంచంలో మానవాళికి తీవ్రప్రాణ నష్టం కలిగించింది. ఎప్పుడు ఏ వైరస్ ప్రవేశించినా వాటి నుండి గట్టెక్కిన సందర్భాలే ఎక్కువ. కాగా కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా 68లక్షల మందిని,భారత్‌లో 5.3 లక్షలమందిని పొట్టన పెట్టుకుంది. దాని ప్రభావం కోలుకున్న కరోనా రోగల మీద పడడం దురదృష్టకరం. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) డాటా ప్రకారం చూస్తే దేశంలో ఇన్‌ఫ్లుయెంజా లాంటి అనారోగ్య సమస్యల (ఐఎల్‌ఐ) లేదా తీవ్రశ్వాసకోశ సమస్య (ఎస్‌ఎఆర్‌ఐ) కేసుల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిన జాడ ఏదీలేదు. ఒక్కకరోనా వైరస్ మాత్రమే మానవాళిని ఇబ్బంది పెట్టింది. కోవిడ్ 19తో హెచ్‌ఎంపివిని పోల్చవద్దని అది పూర్తిగా కొత్త వైరస్ కనుక నిరోధక శక్తి లేని మానవుల ప్రాణాలతో ఆటలాడుకుని విజృంభించిందని ఢిల్లీ ఎయిమ్స్ ఇంటర్నల్ మెడిసిన్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ నీరజ్ నిశ్చల్ వివరించారు. తాజా హెచ్‌ఎంపివి వైరస్ గూర్చి చెప్పాల్సి వస్తే పదేళ్ల వయసు వచ్చేనాటికి చాలామంది హెచ్‌ఎంపివిని తట్టుకోగల రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. దీనికి ప్రత్యేకించి వ్యాక్సిన్ లేకపోయినా కోవిడ్ వ్యాక్సిన్ మూడు దోసులు లేదా ఫ్లూ వ్యాక్సిన్ మూడు దోసులు లేదా ఫ్లూవాక్సిన్ గతంలో తీసుకుని ఉంటే హెచ్‌ఎంపివిని ఎదుర్కొనే రోగనిరోధక శక్తి దానంతటదే వృద్ధి చేసుకుంటుందని బెంగళూరు హెచ్‌సిజి హాస్పిటల్ ఆంకాల జిస్ట్ విశాల్ రోగులకు భరోసానిస్తున్నారు. కోవిడ్ విషాద ఛాయలనుంచి బయటపడక ముందే అంతకన్నా వేగంగా ప్రవేశిస్తున్న హెచ్‌ఎంపివి గురించి కంగారు పడే పరిస్థితి ఇప్పుడు భారతీయుల ఆందోళనకు కారణమైంది. అదీగాక చైనా నుంచి వస్తోందనగానే మరో ఆవేదన. 2001లోనే హ్యూమన్ మెటానిమో వైరస్(హెచ్‌ఎంపివి) ప్రస్తుతం డ్రాగన్ దేశాన్ని ఆందోళనలో ముంచెత్తుతోంది. ఈ వైరస్ వ్యాప్తి చాలా వేగవంతంగా ఉంటుందని, దగ్గుతో వచ్చే తుంపర్లు చాలా ప్రమాదకారియని సబ్బుతో కనీసం 20 సెకండ్లపాటు చేతులు శుభ్రపరుచుకోవాలని తొలి సూచన తప్పక పాటించాలని వైద్య నిపుణులు చెప్పడం చూస్తేమళ్లీ మాస్క్ ధరించడం తప్పని సరిగా అనిపిస్తోంది. గతంలో కోవిడ్ సమయంలో దాని తీవ్రత గుర్తించినా జాగ్రత్తలు పాటించడంలో కాస్త జాప్యం జరిగిందన్నది అందరూ అంగీకరించే విషయమే. లేదు లేదంటూనే కొత్త వైరస్ ఇద్దరికీ సోకింది. నాగ్‌పూర్‌లో రెండు, బెంగుళూరు, గుజరాత్, ఢిల్లీలలో ఒక్కొక్కరికి వెరశి ఇలా మొత్తం ఏడుగురు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వాలు అప్రమత్తమౌతున్న తరుణంలో కేంద్ర ప్రభు



త్వం మార్గదర్శకాలను సూచించింది. వీటిలో ప్రధానంగా 15 సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధులు దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలి. శ్వాసకోస సంబంధిత ఇన్‌ఫెక్షన్ల నుంచి మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ఆరోగ్యశాఖ డైరక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వేగంగా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అయినా కోవిడ్ అనుభవాలతో జనం తల్లడిల్లిపోతున్నారు. కేవలం దగ్గు, జ్వరం, ముక్కుదిబ్బడంగా ఉండడం సాధారణంగా ఇప్పుదున్న శీతల వాతావరణానికి ఉండే లక్షణాలే. కొత్త వైరస్‌కు కూడా ఇవే లక్షణాలు చెబుతున్నందున, ప్రచార మాధ్యమాల్లో గమనిస్తున్న యావత్ ప్రజానీకం తమ ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చలిగాలులకు దూరంగా ఉండడం, దూరప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిదనే సూచనలు కూడా వినవస్తున్నాయి. ఇంత విస్తృతంగా వ్యాప్తి చెందబోతుందన్న అంచనాలున్నా కూడా ఇది మామూలు వైరస్సే కనుకభయపడాల్సిన అవసరమేమి లేదని ఐసి ఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగా ఖేద్కర్ ఊరట కలిగించే మాటలు చెబుతున్నారు. కాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ మాత్రం మరో జన్యు పరివర్తన జరిగిందని నమ్మబలుకుతోంది. దీని వలన ఏ మేరకు ప్రజారోగ్యం కలిగిస్తుందో స్పష్టంగా ఎవరూ చెప్పలేకున్నా వారి వారి మాటల్లో నర్మగర్భంగా దాగివున్న ఆందోళనలు గురించి విశ్లేషించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో కోవిడ్ సమయంలో ఇదే జరిగింది. చివరకు ప్రాణాంతకమైంది. ఆనాటి చేదు అనుభవాలు దేశ ప్రజల్ని వెన్నాడుతూనే ఉన్నాయి. హ్యూమన్ మెటానిమో వైరస్ గతంలో మానవాళికి పరిచయమున్న వైరస్సేనని, ప్రపంచ వ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం ఇలాంటివేనని, డాక్టర్లు వివరిస్తున్నారు. ఈ వైరస్ రెస్పిరేల్ వైరస్‌ను పోలి ఉంటుందని నిర్ధారించారు. కాగా చైనాలో ఎంతో మంది ఆసుపత్రుల పాలయ్యారన్న వార్తల నేపథ్యంలో భారత్‌లోనూ ఆసుపత్రులన్నీ సిద్ధమైపోయాయి. ఈ వైరస్ వ్యాప్తి గురించి ఎలాంటి సమాచారం వస్తుందోనని జనమంతా వేచి చూస్తున్నారు. విశేషమేమిటంటే ఈ వైరస్‌పట్ల వైద్య సమాజంలోనూ కలకలం ఉన్నందున తెలంగాణలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 'నమస్కారం ముద్దు -హ్యాండ్‌షేక్ వద్దు' అనే నినాదంతో ఈ వైరస్ పట్ల అప్రమత్తం చేసే ఆలోచనలో ఉంది. వైరస్ తీవ్రత ఎక్కువైతే బ్రాంకైటిస్,నమోనియాకు దారి తీస్తుందని ఇవి సోకినా కూడా శ్వాసకోస రోగులు బాగా ఇబ్బంది పడతారన్న విషయం తెలిసిందే. శ్వాసకోశ రోగాలైనా న్యూమోనియా వంటి జబ్బులైనా వాటి బారిన పడి ఊపిరాడక తనువు చాలించనివారు లేకపోలేదు. అందుకే శ్వాసకు సంబంధించి వైద్యం ఏ మేరకు మనిషిని బతికిస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేసే పరిస్థితులు తలెత్తాయి. ఐదేళ్ల క్రితం కరోనా బారినపడి ఎంతో మంది మరణించారు. కాని ఆనాడు బతికి బయటపడ్డవారు కూడా అనంతర కాలంలో హృద్రోగం వల్లనో, మరెందు చేతనో మరణించారన్న సమాచారం వినని విన్నాము. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల బారిన పడడం సహజమే అయినప్పటికీ రోగనిరోధకత తక్కువగా ఉండేపిల్లలు, వృద్ధులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. కోవిడ్ సోకిన సమయంలో జాగ్రత్తలు పాటించడంలో జాప్యం,కొంతలో కొంత నిర్లక్ష్యం, ఆనక ప్రాణభయం కారణంగా లక్షలాది మంది కరోనా వ్యాధిగ్రస్తులయ్యారు. పుష్కర కాలం నాడే హెచ్‌ఎంపివిని కనిపెట్టినా ఇప్పటికీ దాని నిరోధానికి, నయం చేయడానికి కానీ వాక్సిన్ కనిపెట్టలేకపోవడం తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందన ప్రభుత్వ ఉదాసీనత వైఖరి కనపడుతోంది. హెచ్‌ఎంపివి చైనా వైరస్ కానేకాదని స్పష్టమైంది. కనుక కాస్తంత ఊరట. అంతే తప్ప ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా అనారోగ్య సమస్యలే. ఇదిలాఉండగా చైనా వైరస్ హెచ్‌ఎంపివి కేసుల గుబులు ఆసియా మార్కెట్లకు తాకింది. మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీమదుపరుల అమ్మకాల సూచీలను ఒక్కసారిగా నేల చూపులు చూసాయి. సూచీలపతనం ప్రారంభమైంది. మార్కెట్ విలువ దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర క్షీణించింది. జనవరి 12నుంచి జరిగే కుంభ మేళాకు 40కోట్ల మంది భక్తులు, యాత్రికులు రాగలరని అంచనా. అటువంటి పరిస్థితుల్లో జనం ఎక్కడ గుమికూడడం, జలకాలుష్యం వలన ఇలాంటి వైరస్‌లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానిదే. ●

# మానవాళిని ఏకం చేసే ప్రధాన సాధనం భాష

బి.మధుపాళి

హిందీ భాష ఒక్క హిందుస్థాన్‌కే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా 610 మిలియన్ల ప్రజలు మాట్లాడుతున్నారు. ఇంగ్లీష్ (1,456 మిలియన్లు), మాండరిన్ చైనీస్ (1,138 మిలియన్లు) తర్వాత అందరూ మాట్లాడే 'ప్రపంచ భాష'గా హిందీకి ప్రత్యేకత ఉన్నది. హిందీ భాష వ్యాప్తిలో సినిమా పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచంలోనే అతి పెద్ద బాలీవుడ్ ఫిలిమ్ ఇండస్ట్రీ విడుదల చేస్తున్న హిందీ సినిమాలతో ప్రపంచ దేశాలన్నింటిలో హిందీ విస్తృత ప్రచారం, ఆదరణ, మక్కువ క్రమంగా పెరుగుతున్నది. తొలిసారిగా 10 జనవరి 1975న హిందీభాష ప్రాధాన్యం, మాధుర్యాలు, భాషాభిమానాల ఏకీకరణ, ప్రముఖ రచయితల ప్రస్తావనల లక్ష్యాలతో కూడిన"ప్రపంచ హిందీ మహాసభలు పెద్ద ఎత్తున విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజుకు గుర్తుగా 2006 నుంచి ప్రతి ఏటా 10 జనవరిన"ప్రపంచ హిందీ దినోత్సవం లేదా విశ్వ హిందీ దివస్" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ హిందీ దినం సందర్భంగా హిందీ భాషమాట్లాడడం, రచనలు,సాహిత్యం, హిందీ భాషను మాట్లాడే ప్రపంచ మానవాళిని ఏకం చేయడం, సంస్కృతులను ప్రచారం చేయడానికి ఈ వేదికలను ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ వేదికల్లో హిందీ భాషకు పట్టం కట్టడం,సాహిత్య వారసత్వాల పరిరక్షణ, విద్యాలయాల్లో హిందీ భాష బోధనలను ప్రోత్సహించడం, హిందీ అందాన్ని ఆదరణను తీసుకు వచ్చిన సాహితీవేత్తలను సముచితంగా గౌరవించడం ఈవేదికలో విధిగాజరగాలి. ప్రపంచ హిందీ దినం2025 థీమ్‌గా ఏకత, సాంస్కృతిక ఆత్మగౌరవ ప్రపంచ గొంతుకహిందీ"అనబడే అంశాన్ని తీసు



కొని ప్రచారం చేస్తున్నారు. డిజిటల్ అంతర్జాల సాంకేతిక ప్రపంచ ఏకీకరణలో హిందీకూడా ప్రధాన భూమిక నిర్వహించే విధంగా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని భాషాభిమానులు కోరుకుంటున్నారు. సంస్కృత భాష నుండి జనించిన ఇండో ఆర్యన్ భాషగానే కాకుండా ఇండోయూరోపియన్ భాషగా కూడా హిందీకి పేరుంది. ఈ కారణంగానే యూరోపియన్ భాషలతో,ముఖ్యంగా ఆంగ్లభాషతో హిందీకి పలు సారూప్యతలు కనిపిస్తాయి. భారత దేశంలో అధికారిక భాషగా హిందీకి ప్రత్యేకస్థానం ఇవ్వబడింది. మన దేశంలో 345మిలియన్ల ప్రజలు హిందీమాట్లాడితే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 610 మిలియన్ల జనులు హిందీభాషలో సంభాషిస్తున్నారు. ఆసియాఖండంలో అధిక జనులు హిందీ మాట్లాడుతుండగా దక్షిణ ఆఫ్రికా, అమెరికా,ఫిజీ, మారిషస్, బంగ్లాదేశ్, యెమన్, ఉగాండా లాంటి దేశాల్లో కూడా భాష పోషణ కనిపిస్తుంది. నేడు మేధో వలసలు పెరగడంతో ప్రపంచ దేశాలకు కూడా హిందీవిస్తరించడం క్రమంగా పెరుగుతున్నది. దేవనగరి లిపిలో ప్రకటించే హిందీకి మృదుభాషగా కీర్తిఉన్నది. ఉత్తరభారతంలోని రాష్ట్రాల ప్రజలు హిందీ భాషను అధికంగా వినియోగిస్తున్నారు. 14సెప్టెంబర్ 1949 రోజున హిందీని అధికారిక భారత భాషగా తీర్మానించిన కారణంగా 14సెప్టెంబర్ రోజున జాతీయ హిందీ దినం కూడా ప్రతి ఏటానిర్వహించుకుంటున్నారు. హిందీభాషను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడం,హిందీభాష సంస్కృతులను కాపాడడం, విద్యాపరంగా ప్రోత్సహించడం, భాషను కాపాడుకోవడం,సాంస్కృతిక వినియమ మాధ్యమాల, అంతర్జాతీయ ఏకీకరణ సాధనంగా వినియోగించడానికి ప్రతిఒక్క భాషాభిమాని కృషిచేయాలి. హిందీభాష విద్యాబోధనలు, సాంస్కృతిక వేడుకలు, ప్రచార మాధ్యమాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వేదికగా ఉపయోగపడాలి. ●

# భారత్‌ను పీడిస్తున్న రుణభారం, రూపాయి పతనం



మేకిరి దామోదర్

మన దేశం రుణభారంలో కూరుకపోవడంతో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. సంపన్న, పెట్టుబడిదారి దేశాలు లాభార్జనే ధ్యేయంగా పెట్టుబడి పెడుతున్నవేళ, రుణభారం నానాటికీ కొండగా పెరిగిపోతోంది. పాలకులకు ముందుచూపు ఆర్థిక క్రమశిక్షణ లేని విధానాలు అవలంభించడంతో మన దేశంలోని పెట్టుబడులకు భద్రత కరువవుతుందని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భావిస్తున్నా దరిమిలా పెట్టుబడులు ఇతర దేశాలకు తరలిపోతాయి. అప్పుల ఊబిలో చిక్కుకున్న దేశంలో వాటికి వడ్డీలకే సర్కారీ ఆదాయం కరిగిపోతుంది. అభివృద్ధి అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. ఇలాంటి విధానాల మూలంగానే సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. ఒక్కశాతం జనాభా చేతిలోనే దేశ ఆర్థిక సంపద కేంద్రీకృతం అవుతుంది. దీనితో సమ్మిళిత అభివృద్ధి అనేది సాధ్యం కావడం లేదు. మన ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్లకు ఓసారి ఎన్నికల్లో అధికారం చేపట్టడానికి దేశం, రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులపై అవగాహన లేకుండా పార్టీలు అమలు చేయలేని హామీలను ఇస్తుంటారు. ఆ తర్వాత వాటి అమలుకు అప్పులు చేసే కాలం గడిపేస్తారు. ఇలాంటి ప్రభుత్వాల విధానాలతో అప్పులు పెరిగిపోతున్నాయి. వాటి వడ్డీలకు మళ్లీ అప్పులు చేస్తున్నారు. అంతర్జాతీయ ఆర్థిక పరపతి తగ్గిపోతుంది. అప్పులు, పెట్టుబడులు పుట్టని తీరుకు దారితీస్తుంది. ఆమేరకు 2025 మార్చి కల్లా మొత్తం రుణభారం రూ,181.6 లక్షల కోట్లకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వం చేసిన అప్పుల్లో 67శాతం కేంద్రం ఖాతాలోనిదే. మిగిలింది రాష్ట్రాలు చేసినవి. దేశం, రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ, బడ్జెట్ నిర్వహణ నిబంధనలు విస్మరిస్తూ ఆర్థిక నిపుణుల సూచనలు పాటించకుండా మరీ పరిమితికి మించి అప్పులు చేస్తున్నాయి. ఇలా తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాలు చేసిన అప్పులు గుదిబండగా మారాయి. మరోవైపు ఆదాయం మెరుగు కాకపోవడంతో సంక్షేమ పథకాల అమలు కోసం తరచూ అప్పులు చేయవలసి వస్తుంది. కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చులు (దుబారాను)తగ్గించుకొని ఆదాయం పెంచే మార్గాలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. సంపన్న, పెట్టుబడిదారుల సంపదపై అదనపు పన్నులు వేసి, పనుల ఎగవేతను కఠినంగా అరికట్టాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటించక,ఆర్థిక నిపుణుల సూచనలను లెక్కచేయని పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక దేశాల్లోని దుర్భర పరిస్థితి నుంచి గుణ



పాఠం నేర్చుకోవాలి. లేదంటే? దేశం ఆర్థిక విపత్తును (సంక్షోభాన్ని)ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారమే ధ్యేయంగా దేశ,రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకోకుండా, ఆర్థిక నిపుణుల సూచనలు పాటించకుండా ఇలానే ప్రభుత్వాలు పాలనా విధానాలు కొనసాగితే ఆర్థిక ఎమర్జెన్సీకి దారితీస్తుంది. ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసిన మరణానంతరం మందు (ఔషధం) ఇవ్వడం లాంటిదే అవుతుంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్లో రూపాయి విలువ భారత కరెన్సీ చరిత్రలోనే అత్యంత కనిష్ట (క్షీణ) దశకు పతనమవుతోంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 85.79 కనిష్ట స్థాయికి దిగజారింది. 'రూపాయి పతనం గత పది ఏళ్లల్లో మారకపు విలువ ఎంతగా తగ్గిందంటే? ఇలా.. 2015లో 66.15, 2016లో 67.93, 2017లో 63.87, 2018లో69.77 2019లో 71.38, 2020లో73.07, 2021లో 74.34 2022లో 82.74, 2023లో 83.21 2024లో 84.70 డిసెంబర్ 3దాకా. ఆధారం లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు. రూపాయి పతనానికి కారణాలు ఎగుమతులకన్నా దిగుమతులు ఎక్కువగా ఉండడం, కరెంటు ఖాతా లోటు, ముడి చమురు ధరలు పెరుగుదల తదితర అంతర్జాతీయ దేశీయంగా, ఆర్థిక క్రమశిక్షణ లేమి, దుబారా పెరిగిపోవడం, ఎగుమతులు పెంచి, దిగుబతులు తగ్గించుకోవడంలో పాలన విధానంలో చిత్తశుద్ధి లేకపోవడం లాంటి తదితర విధానాల మూలంగా రూపాయి పతనానికి దారితీస్తుంది. మన దేశ జనాభాలో 60శాతం 35ఏళ్ల లోపువారే. ఈ యువశక్తిని జనాభాలో సగభాగమైన మహిళా శక్తిని నిపుణ వనరులుగా తీర్చిదిద్ది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించబడాలి. అలా దేశ ఉత్పాదక శక్తి పెంచుకోవడంవల్ల ప్రగతికి దారులు పడతాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతుందన్న సర్కారీ ప్రచారంతోడు జీడీపీ మెరుపులకు సమాంతరంగా జనం బతుకుల్లో వెలుగులు నింపాలి. అంటే ఉపాధి సహిత అభివృద్ధి జరగాలి. మన దేశం వ్యవసాయ ఆధారిత జనాభా 60శాతంకు పైగా ఉంటారు. అందువల్ల వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సంపన్న దేశాలతో పోటీపడి అభివృద్ధిని సాధించాలి. అతి ప్రధానంగా దిగుమతులపై దృష్టిసారించి, ఆయా దిగుమతుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి ఎగుమతులు చేసే స్థాయికి చేరుకునే విధానాలు రూపొందించాలి. మన దేశంలో అవినీతి, నిర్లక్ష్యం సమూలంగా నిర్మూలించబడాలి. దేశ సంపద గుప్పెడు మంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చేస్తూ, సమంగా పంచబడినప్పుడే సమ్మిళిత ప్రగతి సాధ్యపడుతుంది. అలాంటి చిత్తశుద్ధితో కూడిన విధానాలు అమలు చేయాలి. ప్రజాస్వామ్య దేశంలో బహుళ పార్టీల పాలన విధానం లో అధికార దాహంతో దేశ ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఓటుబ్యాంకు పథకాలకు చరమగీతం పాడాలి. ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్యం దేశంగా వెలుగొం దుతున్న వేళ ఆ కీర్తికి కళంకం రాకుండా సమ్మిళిత అభివృద్ధికి పాటుపడండి. ●

# మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన దద్దాల

**కనిగిరి, జనవరి 9, ప్రభాతవార్త**



నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా వాగుపల్లి వైసీపీ యూత్ ఫోర్స్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాగుపల్లి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను వైసీపీ నాయకులతో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్న కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్. ఈ సందర్భంగా వైసీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని తెలిపారు. ఆటల్లో గెలుపోటములు సహజం అని, అందరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. ముందుగా ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణయాదవ్ తన చిన్న నాటి రోజులు గుర్తు చేసుకుంటూ బ్యాటింగ్, బౌలింగ్ చేసి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి ఓబిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వాగుపల్లి సర్పంచ్ మూలే గోవిందరెడ్డి, వైసీపీ యువ నాయకులు మూలే గోపాలరెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేష్‌బాబు, చిన ఇర్లపాడు సర్పంచ్ ముద్దా బాబు, సూరసాని మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, రవి, సంగు వెంకటేశ్వర్లరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సంగు కృష్ణారెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకట రత్నం, పల్లాల భాస్కర్‌రెడ్డి, గాండ్లపల్లి ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం సర్ల ఏడుకొండలురెడ్డి, మడతల వెంకటేశ్వర్లరెడ్డి, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, మూలే రాజశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు వీరారెడ్డి బాబు, వెంకటేశ్వర్లరావు, నాగేంద్రబాబు, నగేష్, మాల్యాద్రి, మురళి, ప్రసంగి, మాలు, చిన్న మీరయ్య, మల్లిఖార్జున, కోటయ్య, నాగయ్య, ఆరోన, ఏసు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్ బాల్ పోటీలలో ప్రకాశంకు తృతీయ స్థానం

**ఒంగోలు, ప్రభాతవార్త**



విశాఖపట్నం ఆర్కే బీచ్ అవరణంలో మొట్టమొదటిసారిగా ప్రకాశం జిల్లా_రాష్ట్ర బీచ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ సత్యరాజ్ అధ్వర్యంలో ఈనెల 4,5 తేదీల్లో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున స్థానిక పేస్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థి వి అజీమ్‌వలి ప్రకాశం జిల్లాకు ఎంపికై రాష్ట్ర బీచ్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రకాశం జిల్లా మూడవ స్థానం కైవసం చేసుకుంది. ఇందులో అజీమ్‌వలి అద్భుత ప్రదర్శన కనపరిచి జాతీయ బీచ్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొని గెలుపొందిన క్రీడాకారుని అభినందించారు. మద్దిశెట్టి కళ్యాణ్ జాతీయస్థాయిలో కూడా ప్రకాశం జిల్లాకు, కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని కోరియారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ రూప ఆకేష్, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గిరి బాబు,ఫిజికల్ డైరెక్టర్లు,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైజ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**ఒంగోలుటౌన్,ప్రభాతవార్త**





సంస్కృతి సంప్రదాయాల విశ్లేషణ ద్వారా విద్యార్థులు విలువైన జ్ఞానాన్ని పొందవచ్చని రైజ్ కృష్ణసాయి గ్రూపు ఇన్స్టిట్యూషన్ కార్యదర్శి శిద్దా హనుమంతరావు పేర్కొన్నారు. గత రెండురోజులుగా రైజ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు విద్యార్థులకు రంగవల్లి పోటీలు నిర్వహించి వారిలో గెలుపొందిన విజేతలకు శిద్దా సూర్యకుమారి బహుమతులను అందజేశారు. రెండవరోజు విద్యార్థులకు కబడ్డీ పోటీలు, టాగ్ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి వారిలో విజేతలకు ట్రస్ట్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, ట్రెజరర్ శిద్దా భరత్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు, కప్పులు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవి భాస్కరరావు, ప్రిన్సిపాల్స్ కెవి సుబ్రహ్మణ్యం, జెవి రమేష్, కోఆర్డినేటర్స్ సురేష్, ప్రవంతి, శాంతి, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్ హిమవంద్రబాబు, ఎస్ సుబ్బారావు, సిహెచ్ సారా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడమా: టీచర్స్‌గిల్డ్ ఆగ్రహం

**ఒంగోలు టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**

గత ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్‌గా ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకోవడం జరిగింది. ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు వీరిని తిరిగి ఎయిడెడ్ పాఠశాలలకు వెళ్లాలని చెప్పడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇదే విషయమై ఏపి టీచర్స్ గిల్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ యర్రగొండపాలెం, కొమరోలు, ముండ్లపాడు ఎయిడెడ్ పాఠశాలల్లో నలుగురు ఉపాధ్యాయులు జాయినింగ్ ఉత్తర్వులు ఉన్నా యాజమాన్యాలు చేర్చుకోలేదని, సంక్రాంతి సెలవుల్లో ఎక్కడ ఉన్నట్లు అని అధికారులు అడిగితే స్పష్టత ఇవ్వలేదని వాపోయారు. విధులు, జీతాల విషయంలో ఉపాధ్యాయులకు ఇబ్బంది జరగకుండా ఆర్‌జెడి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 11న ఎపిఆర్‌పిఎం సర్వసభ్య సమావేశం

**ఒంగోలు టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న ఉదయం 10 గంటలకు పివిఆర్ బాలికల ఉన్నత పాఠశాల నందు జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, గుండ్లపల్లి శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎ శాస్త్రి, కె.సత్యనార్ పాల్గొంటారని, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చ అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

# కేంద్ర హోం మంత్రిని బర్తరఫ్ చేయాల్సిందే - బిఆర్ గౌస్ డిమాండ్

**ఒంగోలు టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**



పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేసే దాకా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త బిఆర్ గౌస్ స్పష్టం చేశారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గం నుండి అమిత్‌షాను బర్తరఫ్ చేసేలా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను కోరామన్నారు. బడుగుల ఆరాధ్యం అంబేద్కర్ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని, దేశ ప్రజలు తిరగబడక ముందే బిజెపి నేతలు తీరు మార్చుకోవాలన్నారు.

# ప్రత్యామ్నాయ ఇంధన వనరులతోనే

**ఒంగోలు టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**



వాహన కాలుష్యం నుండి బయటపడేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులు ఎంపికోవాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ ఛైర్మన్ జి.వీరభద్రాచారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంధన పొదుపు, కాలుష్య నివారణ కోసం ఈనెల 28-30 తేదీలలో సదస్సులు నిర్వహిస్తున్నామని, విద్యుత్ బైక్ వినియోగం, సోలార్, పవన విద్యుత్, సిఎన్‌జి, బయోగ్యాస్ ఇంధన వనరులపై అవగాహన కల్పిస్తామన్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం కోసమై ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సంస్థ కార్యదర్శి కందుకూరు రాంబాబు, సభ్యులు దార్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బాలాజీ ఫర్నిచర్ షాపును ప్రారంభించిన యువ నాయకుడు దామచర్ల సత్య

**టంగుటూరు, జనవరి 9, ప్రభాతవార్త**



టంగుటూరు మండలంలోని రావూరి సోమయ్య నగర్ పక్కన ఉన్న నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ ఫర్నిచర్ షాపును గురువారం నాడు ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్ టీడీపీ యువ నాయకుడు దామచర్ల సత్య టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు, కామని విజయ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి దామచర్ల సత్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా షైన్ గృహాలకు అవసరమైన ఈ పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆఫర్లతో కూడిన అన్ని గృహ వస్తువులు అందుబాటులో ఉన్నాయని షాపు యజమాని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మక్కిన వెంకటరావు, మండల నాయకులు అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఎంపి మాగుంట పర్యటన



**ఒంగోలు టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**

పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి శుక్రవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక రామ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుంటారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల ముస్లింలు నిర్వహించు ఇస్తిమా కార్యక్రమంలో, 11 గంటలకు ఎ1 కన్వెన్షన్ హాలులో క్రెడాయ్, ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ నిర్వహించే ప్రాపర్టీ, బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శనలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు చెరువుకొమ్ముపాలెంలో శ్రీ సరస్వతి విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.

## ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాత:కాల సమయాన ఆలయాలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని శ్రీ మహావిష్ణువు కృపకు పాత్రులు కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# వైయస్ జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు

**- వైకాపా మోసపూరిత విధానాలే ఆ పార్టీకి మృత్యు ఘంటగా మారింది - రాష్ట్ర మంత్రులు డోలా,,, గొట్టిపాటి**









**మార్కాపురం, జనవరి 9, ప్రభాతవార్త**

వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలు అయిందని, ఆయన చేసే మోసపూరిత విధానాలే ఆ పార్టీకి మృత్యు గంటగా మారాయని రాష్ట్ర మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌లు అన్నారు, గురువారం రాత్రి మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన తెలుగుదేశం పార్టీ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రి శవాన్ని పక్కన పెట్టుకొని శవ రాజకీయం చేసి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారని, నాటి నుండి నేటి వరకు శవ రాజకీయాలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు, తిరుపతిలో జరిగిన భక్తుల తొక్కిసలాట ఎలాంటిదో అందరికీ తెలుసుఅని, దానిని ఆసరాగా తీసుకొని కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు శవరాజకీయాలకు వేదికగా మార్చుకున్నారన్నారు, నాటి ప్రభుత్వంపై విశ్వసనీయత కోల్పోయిన ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వానికి అధికారం కట్టపెట్టారని, ఆంధ్రరాష్ట్ర పునర్నిర్మాణంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలు నిమ్మగ్నమై ఉండగా జీర్ణించుకోలేని వైకాపా ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆ పార్టీలో ఉద్దండులుగా ఉన్న నాయకులు క్రియాశీలకంగా ఉన్న కార్యకర్తలు జగన్ ధోరణిని పసిగట్టి వ్యతిరేకిస్తూ టిడిపి లో చేరేందుకు సిద్ధమయ్యారనీ నేడు ఈ కార్యక్రమంలో జరుగుతున్న చేర్పులు జగన్ వ్యతిరేక పవనాల పర్యవసానమేనన్నారు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 7నెలల కాలం అయిందని, విశ్వసనీయతకు మారు పేరుగాపాలన సాగిస్తుందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు సూపర్‌సిక్స్ అమలు అవుతున్నాయని జూన్ మాసంలో అమ్మకు వందనం, ఉగాది పర్వదినాన ఉచితబస్సు అమలు కానుందన్నారు. జగన్ హయాంలో ఆంధ్రరాష్ట్రం కుక్కలు చింపినవిస్తరిలా తయారైందని, రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభ పరిస్థితు లను సరిదిద్ది ప్రజలు హర్షించే స్థాయిలో తెలుగుదేశం ప్రభుత్వం ఉపముఖ్యమంత్రితో కలిసి పాలనసాగిస్తోందన్నారు, రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరగడానికి కారణం నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని ఈవిషయం విద్యావేత్తలకు మేధావులకు తెలుసన్నారు, విద్యుత్ బిల్లుల పెంపుకు కారణమైన ఆ నేతలు నేడు ప్లే కార్డులు పట్టుకొని విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నాలు చేయడం ఆందోళనలకు దిగడం దయ్యాలు వేదాలు వర్ణించేలా ఉన్నా యన్నారు. రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం అంత సంక్షేమాన్ని అందిస్తుందని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వైకాపా పార్టీకి చెందిన ఎందరో ఉద్దండులు తెలుగుదేశం పార్టీలో చేరారని వారందరికీ పార్టీ తరఫున అభినందనలు తెలుపుతున్నామన్నారు, తమపై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి అన్నివేళలా అందుబాటులో ఉండి వారి నమ్మ కాన్ని వమ్ము చేయకుండా సహకరిస్తానన్నారు, తన నిర్ణయానికి జేజేలు పలికిన ప్రతి టిడిపి కార్యకర్తకు అభిమానికి శిరసు వచ్చి నమస్కరిస్తున్నానన్నారు, ఈ సందర్భంగా వైకాపా పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ ఏఎంసి చైర్మన్, వైకాపా కీలకనేత గుంటకు సుబ్బారెడ్డినీ ఘనంగా సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు సుబ్బారెడ్డితో పాటు ఆయన సన్నిహితులు కౌన్సిలర్లు వైకాపా నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు, అభిమానులు సుమారు 200 మంది టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలపై అదనపు విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

**- భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలి - సీపీఎం జిల్లా నాయకులు కే.ఆంజనేయులు పిలుపు**

**దర్శి, జనవరి 9, ప్రభాతవార్త**



జిల్లా ప్రజలకు జనవరి నెలలో సంక్రాంతి కానుకగా వచ్చిన విద్యుత్ బిల్లులు షాక్‌కి గురిచేస్తున్నాయని అదనపు ఛార్జీలు రద్దు చేయాలని భోగి మంటలలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలని సీపీఎంజిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. దర్శి సుందరయ్య భవనంలో ఈమని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం దర్శి నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలపై 78కోట్లు విద్యుత్ అదనపు ఛార్జీలు భారం మోపడంతో బెంబేలెత్తుతున్నారని, గతం కంటే 50శాతం పైగా ఛార్జీలు పెరిగాయని అన్నారు. దర్శిలో 2025 జనవరి 5 వ తేదీన గృహ వినియోగదారులకు వచ్చిన కరెంటు బిల్లు పరిశీలించగా 2019 రూపాయలు వాడిన ఛార్జీ అయితే ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, డ్యూటీ, సర్ ఛార్జీ, ట్రూ ఆఫ్ ఛార్జీ, ఎఫ్‌పీపీసీఏ 4/22, 4/23, 11/24 తదితర ఛార్జీలు రూ.296 వచ్చాయని, మొత్తం కలిసి 515 లు బిల్లు వచ్చిందని,అలాగు 80శాతం మందికి బిల్లులు రావడంతో షాక్ కి ప్రజలు గురవుతున్నారని అన్నారు. బిల్లులను తగ్గించాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు మాట్లాడుతూ రైతుల వద్ద వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రూ.1400 రూపాయలకే 75 కేజీల బస్తా ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతూ రైతులు బస్తాకి రూ.350 నుంచి రూ.400 నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి ఉప్పు నారాయణ, కేవీ పిచ్చయ్య, చిట్ల ఆదినారాయణ, పోట్లూరి పుల్లయ్య, అంజయ్య, రమాదేవి పాల్గొన్నారు.

## తిరుపతిలో భక్తుల మృతి మనసును తీవ్రంగా కలిచివేసింది - డోలా



**ఒంగోలు, ప్రభాతవార్త**

తిరుపతిలో భక్తులు మృతి చెందిన ఘటన మనసును తీవ్రంగా కలిచివేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దైవ దర్శనానికి వెళ్లి మృతి చెందడం బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## ప్రయాణాలు చేయదలుచుకున్న వారు సమాచారం ఇవ్వండి - ఎస్సై ఎం.మురళి





**దర్శి, జనవరి 9, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేయదలుచుకున్న వారు తమకు సమాచారం ఇవ్వాలని దర్శి ఎస్సై ఎం.మురళి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పండుగ సమయాల్లో గ్రామాల్లో దొంగలు సంచరించే అవకాశం ఉన్నందున గ్రామాలకు వెళ్లే వారు తమకు సమాచారం ఇస్తే గస్తీ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు, నగర పంచాయతీ ప్రజలు గమనించాలని ఆయన తెలియజేశారు.

# మోసాలకు పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**నాగులుప్పలపాడు, జనవరి 9, ప్రభాతవార్త**



క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ప్రకాశం పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.8లక్షల విలువ కలిగిన నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొణిజేటి సురేష్‌బాబు అను అతను శనగల వ్యాపారం చేసుకుంటూ ఉంటాడు. నేరస్తులు అతని మేనల్లుడు లాగా ఫోన్లో మాట్లాడి అతనిని నిమ్మించి, వారు ప్రైవేటు కంపెనీ పెడుతున్నట్లు దానికి డబ్బులు అవసరమని ఇస్తే తిరిగి ఇస్తామని నమ్మించి మోసం చేసి అతని వద్ద నుంచి పలుమార్లు ఫోన్ పే ద్వారా రూ.8,34,000 మని ట్రాన్సాక్షన్ పాయింట్‌కు ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించి తరువాత ఆ డబ్బులను డ్రా చేసుకున్నారు. సదరు ఫిర్యాదుపై నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయబడి దర్యాప్తులో ఉంది. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు నిర్దేశంలో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్‌బాబు, వారి సిబ్బంది నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, వారి సిబ్బంది నేరస్తులు బల్లికురవ మండలం కొప్పరపాలెం గ్రామానికి చెందిన కోట విజయకృష్ణ, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం సాలింనగర్ గ్రామానికి చెందిన చిక్కాల దొమ్నిక్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరు తీసుకున్న సొమ్ముతో బెట్టింగ్స్ కోసం గోవాకు వెళ్తున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోసాలకు పాల్పడిన రూ.8లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో కోట విజయకృష్ణ అనే అతను ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 2017 నుండి ఫోన్‌పేలో ఒక నెంబరు కొట్టి వారిని మామయ్య అని పలకరించి తన మేనల్లుడు అని పరిచయం చేసుకుని విజయనగరం, కృష్ణాజిల్లాలో ఆరు కేసులలో ఇప్పటికే అరెస్టు కాబడి ఉన్నాడు. కేసులో ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సీఐ శ్రీకాంత్, నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది రాఘవులు, తిరుపతి రెడ్డి, రవికుమార్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.

# తాగునీరు సాగునీరు చెరువు కబ్జా

- గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఆటంకం
- కుచించిపోతున్న తెల్లబాడు తాగునీటి చెరువు
- తూతూ మంత్రంగా సర్వే నిర్వహణ
- గ్రామస్తులు ఫిర్యాదు చేసిన స్పందించి అధికారులు
- పంచాయతీ కార్యాలయంలో బజారు కొలతల మాయం
- కబ్జా భూమిలో అక్రమ కట్టడాలు

**మద్దిపాడు, జనవరి 9, ప్రభాతవార్త**



గత కొంత కాలం నుంచి తెల్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తెల్లపాడు రెవెన్యూ పరిధిలోని తాగు, సాగు చెరువు కబ్జా చేసి గ్రామంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నాడని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పంచాయతీ రోడ్డు ఆక్రమించి నూతన నిర్మాణం చేపడుతున్న సిమెంట్ రోడ్డును పక్కకు దారి మళ్లించి రోడ్డు నిర్మాణం చేసుకోండి అంటూ గ్రామస్తులకు అడ్డగోలుగా సమాధానం చెబుతూ, అసభ్య పదజాలాంతో దూషిస్తూ వీరంగం ఇస్తున్నాడని గ్రామస్తులు అభియోగం, గత కొంత కాలం నుంచి గ్రామ పంచాయతీ, మండల రెవెన్యూ అధికారులకు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులకు అర్జీ రూపంలో ఫిర్యాదు చేసిన కూడా పట్టి పట్టనట్లుగా వ్యవహారిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పై ఇటీవల కాలంలో మండల సర్వే అధికారిణి అక్కడికి వెళ్లి తూతూ మంత్రంగా సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారణ చేయకుండా సదరు ఆక్రమణదారునికి అనుకూలంగా వ్యవహా



రిస్తున్నట్లు గ్రామస్తుల ఆరోపించారు. సదరు మండల సర్వేయర్ మండల ఉన్నత స్థాయి అధికారులకు చెరవు కబ్జాపై ఎటువటి నివేదికను సమర్పించకుండా కొంత ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థాన సమీపంలో ఏ విధమైనటువంటి అనుమతులు లేకుండా వాగు పోరంబోకు ప్రభుత్వ భూములు అధికార పార్టీకి చెందినటువంటి ఓ నాయకడు రిసార్ట్స్ నిర్మాణం చేపట్టడం జరిగింది. వాగు పోరంబోకు ప్రభుత్వ భూముల్లో రిసార్ట్స్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణ రావడంతో గ్రామ సర్పంచ్ అయినా నారా వెంకట సుబ్బారెడ్డి సర్వే చేయాలని అర్జీ పెట్టిన క్రమంలో మండల సర్వేయర్ నిర్వహించిన సర్వే రిపోర్టును అధికారులకు కార్యాలయంలోనూ అప్పగించకపోవడం, రెండో సారి జిల్లా సర్వేలతో సర్వే నిర్వహించిన కూడా ఆ సర్వే కూడా బయట పెట్టకపోవడంతో మండల సర్వేయర్‌పైన గతంలో కూడా ఆరోపణలు ఉన్నాయి. కొంత కాలం నుంచి చెరువు అలుగు ప్రదేశాన్ని ఆక్రమించి అఆక్రమణ దారుడు పొగాకు బ్యారన్ సంబంధించిన కట్టెలను, గేదెలు కట్టి వేయడం వలన పశువుల వ్యర్థం చెరువు నీటిలో కలుషితమవుతున్నాయని, దీంతో తాగునీటి బావిలోకి పశువుల వ్యర్థాలతో కూడిన నీరు ఊటగా బావిలోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలోని గ్రామ కంఠాలకు సంబంధించిన బజారు కొలతలు రికార్డులు మాయమైనట్లు పంచాయతీ అధికారులు తెలుపుతున్నారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ప్రభుత్వం వారు ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాలలో రైతులు తమ సొంత స్థలాలలో పశువుల షెడ్ల నిర్మాణానికి గోకులం పథకం కింద నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమంగా ఆక్రమించినటువంటి చెరువు అలుగు స్థలంలో గోకులంషెడ్డు నిర్మాణం చేపడుతుంటే నిధులు మంజూరు చేయడమేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తూ అధికారుల పనితీరు విడ్డూరంగా ఉందని ఆరోపించి, పంచాయతీ స్థలం ఆక్రమణపై సమగ్ర విచారణ నిర్వహించి, సమస్యను పరిష్కరించాలని తెల్లపాడు గ్రామస్తులు కోరుతున్నారు.



# అంబేద్కర్ రాజ్యాంగం.. ఇతర దేశాలకు ఆదర్శం

## – ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## – విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**బల్లికురవ, జనవరి 9, ప్రభాతవార్త**

సమాజంలో అసమానతలు తొలగించడానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 సంక్షేమ డైరీని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి అంజలి ఘటించిన అనంతరం.. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ అంబేద్కర్ వంటి మహోన్నత వ్యక్తి స్ఫూర్తితో డైరీ ఆవిష్కరణలు వంటి మంచి కార్యక్రమాలు అసోసియేషన్ చేపట్టడం అభినందనీయమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని భారతదేశం అమలు చేస్తుంటే.. భారతదేశ రాజ్యాంగ స్ఫూర్తితో అనేక దేశాలు తమ రాజ్యాంగాలను రచించుకోవడం గొప్ప విషయమన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ సందర్భంగా స్పందర్భంగా స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని వేళలా ఉద్యోగులకు సహకారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను నష్టాల ఊబిలోకి తోసి.. నాశనం చేసిందని తెలిపిన మంత్రి గొట్టిపాటి, కూటమి ప్రభుత్వ హయాంలో సంస్కరణల అమలుతో విద్యుత్ శాఖను మరలా గాడిలో పెడుతున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థను పునర్వైభవం కోసం ఉద్యోగులు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఉద్యోగులు, వినియోగదారులు గత వైసీపీ ప్రభుత్వ బాధితులే :

ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన పలు సమస్యలను కొందరు ఉద్యోగులు మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి ఉద్యోగుల అభిప్రాయం మేరకు త్వరలోనే జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)తో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు జీతాల కోసం ధర్నాలు చేశారని, కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఉద్యోగస్తులకు ఆ ఇబ్బంది లేదని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ద్వారా బిల్లులు తగ్గే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టని వైసీపీ ప్రభుత్వం, కరెంటు బిల్లుల పేరిట వినియోగదారులపై భారీగా విద్యుత్ భారం మోపిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు అందాల్సిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌లోనూ వైసీపీ ప్రభుత్వం మాయ చేసి.. వారిని మోసం చేసిందని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి ఎటువంటి సమస్యలను అయినా వెంటనే పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వంలో చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి సుమారు 75 సంవత్సరాలు దాటినా కొన్ని ప్రాంతాల్లో ఇంకా విద్యుత్ అందుబాటులోకి రాలేదని, అటువంటి ప్రాంతాలకు కూడా పునరుత్పాదక విద్యుత్ ద్వారా వెలుగులు నింపుతున్నామని చెప్పారు. అటువంటి ఒక తండాలోని సుమారు 1550కి పైగా కుటుంబాలకు మొదటి సారి విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపిన మంత్రి గొట్టిపాటి శుక్రవారం తండాకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరీతో పాటు ఏపీస్టేట్ బ్యాక్వార్డ్ క్లాసెస్ విద్యుత్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్, ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్లతో పాటు టేబుల్ క్యాలండర్‌ను కూడా మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ డైరక్టర్ ఏకేవీ భాస్కర్, హెచ్ఆర్‌డైరక్టర్ పి.నవీన్ గౌతమ్, వీటీపీఎస్ఓ అండ్ ఎం సీఈటీ నాగరాజు, వివిధ విభాగాలకు చెందిన సీఈలు పద్మ సుజాత, శైలజతో పాటు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శివకుమార్, కార్యదర్శి ఏవీ కిరణ్, డైరీ కమిటీకి చెందిన పి.సొలోమన్‌రాజ్‌తో పాటు పలువురు ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన ఎంఈఓలు



**మార్టూరు, జనవరి 9, ప్రభాతవార్త**

మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారులు ఎంసీహెచ్ వస్రామ్ నాయక్, కే.ప్రేమలత సందర్శించారు. మొదటిగా ప్రేమలత ఏపి పాఠశాలను సందర్శించగా, వస్రామ్ నాయక్ పీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.జయకుమార్, ఉపాధ్యాయుల సహకారంతో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఏర్పాటు చేసిన పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిరాశ్రయులైన పేద విద్యార్థులకు మనవంతు సహాకారించడం అనేది చాలా హర్షించదగిన విషయం అన్నారు. అలాంటి వారికి భగవంతుడు అన్ని విషయాలలో సాయం చేస్తాడని, ప్రభుత్వం విద్యార్థులకు మరింత పౌష్టికరమైన ఆహారాన్ని అందించాలనే సదుద్దేశంతో మధ్యాహ్న భోజనం మెనూలో పలు మార్పులు చేసింది. కావున ప్రతి ఒక్క విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి బొద్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 కే.ప్రేమలత, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాయల్ పయనీర్స్ యూపీ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**మార్టూరు, జనవరి 9, ప్రభాతవార్త**

స్థానిక రాయల్ పయనీర్స్ యూపీ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, అచ్చమైన పల్లెటూరి వాతావరణం ప్రతిబింబేలా, వెంకటేశ్వరస్వామి ఆలయ నమూనా, ముగ్గుల పోటీలు, విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకర్షించాయి. చిన్నారులను భోగిపళ్ళతో ఆశీర్వదించారు. సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు మాట్లాడుతూ అందరికి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ ఇన్చార్జ్ కే.మధుబాబు మాట్లాడుతూ పూర్వ కాలంలో పల్లెటూర్లలో ఎలాంటి వాతావరణంలో సంక్రాంతి వేడుకలు జరిగేవో అలానే వేడుకలు జరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, స్వప్న, ఇన్చార్జ్ కే.మధుబాబు, ప్రిన్సిపాల్ బి.రాధిక, ప్రధానోపాధ్యాయులు డీవీ బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తిరుపతి ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

## – మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే

**మార్టూరు, జనవరి 9, ప్రభాతవార్త**

తిరుపతిలో తొక్కిసలాట ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగుదేశంపార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. దైవదర్శనం కోసం వెళ్లిన భక్తుల మృతి తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ఆరుగురు యాత్రికుల మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# తిరుపతి ఘటన చాలా బాధాకరం

## – మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



**జరుగుమల్లి, జనవరి 9, ప్రభాతవార్త**

తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద తొక్కిసలాట ఘటన మనసును కలిచివేసింది. వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ జారీ సందర్భంగా జరిగిన తోపులాటలో భక్తులు మరణించడం చాలా బాధాకరం. భక్తితో ఏడుకొండలస్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన సమయంలో ఇలా జరగడం దిగ్భ్రాంతి కలిగించింది. ఘటనలో గాయపడ్డ వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మాజీ మంత్రి వైసీపీ సభ్యులు, కొండపి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు.

## నూతన కన్వీనర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మండల నాయకులు



**చిన్నగంజాం, జనవరి 9, ప్రభాతవార్త**

పర్చూరు నియోజకవర్గ నూతన కన్వీనర్‌గా నియమితులైన గాదె మధుసూదన్‌రెడ్డిని మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులు కన్వీనర్ స్వస్థలమైన ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ముందుగా మధుసూదన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించమని పావులూరు పొలిమేర వీరాంజనేయదేవస్థానంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన అనంతరం పావులూరులోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ మండల పరిస్థితులపై మండల పెద్దలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని గ్రామాల్లో పార్టీ లోటుపాట్లు, పార్టీ పటిష్టతకు చేయవలసిన కార్యక్రమాలను నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నూతన కన్వీనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ సానుకూలంగా స్పందించి నియోజకవర్గంలో నిత్యం అందుబాటులో ఉండి కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ పటిష్ఠతకు శక్తివంచన లేకుండా పాటు పడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కల చంద్రరెడ్డి, మోటుపల్లి ఎంపీటీసీ కొండూరి గోవింద్, కొల్లా సుబ్బారావు చౌదరి, నల్లమోపు సుబ్బారెడ్డి, కొల్లాటి ఏడుకొండలు, పాదర్తి ప్రకాష్, బొడ్డు ఏడుకొండలు, మేడికొండ సునీల్, అసోది సూరినారాయణ, కుక్కల రవాణారెడ్డి, అంకిరెడ్డి, షేక్‌బాబు, వాటుపల్లి రాములు, రామారావు, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

# నవ్యాంధ్ర మాదిగ చర్మకారుల, డప్పు కళాకారుల

## పోరాట సమితి అధ్యక్షునిగా అంబటి



**కొనకనమిట్ల, జనవరి 9, ప్రభాతవార్త**

నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సమితి మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షునిగా మండలంలోని పెద్దారికట్ల గ్రామానికి చెందిన అంబటి సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవిందప్రసాద్ మాదిగ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షునిగా ఎన్నికైన అంబటి సుబ్బారావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మాదిగ చర్మకారులకు డప్పు కళాకారులకు ఏదైనా సమస్య వస్తే వారి సమస్యలపై పోరాటం చేసి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. నా మీద ఎంతో నమ్మకంతో బాధ్యత అప్పచెప్పిన నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారులు పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల గోవిందప్రసాద్ మాదిగకి, జిల్లా అధ్యక్షులకు మార్కాపురం నియోజకవర్గంలోని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నాయకులు దేవయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చిట్టిబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : దేవలూటి శంకర్



**మార్కాపురం రూరల్, జనవరి 9 ప్రభాతవార్త**

ఇటీవల కాలంలో ఓ ప్రైవేటు న్యూస్ ఛానల్‌లో లైవ్ డిబెట్‌లో పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ ఖగఆఫ్ట్రాల్ చాకలి అనే పదం పదేపదే వాడుతూ మూడుసార్లు ఉచ్చరించడను అతని వ్యాక్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని అతను బహిరంగంగా రజకులకు క్షమాపణ చెప్పాలని రజక విద్యాసేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు, ముఖ్యమంత్రులను కలిసి చిట్టిబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా విజ్ఞప్తి చేయనున్నామని శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. రజకులను ఏకవచనంతో మాట్లాడడం అతని అజ్ఞానానికి నిదర్శనమని అటువంటి వాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామని శంకర్ తెలిపారు.

## మృతుల కుటుంబాలకు కోటిరూపాయల నష్టపరిహారం చెల్లించాలి



**కంభం రూరల్, జనవరి 9, ప్రభాతవార్త**

తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం కోటిరూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీ అవినీతి నిరోధక శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి కోటేశ్వరరావు ప్రజా సంకల్ప వేదిక గిద్దలూరు మండల అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డిలు అన్నారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల విడుదల నేపథ్యంలో తిరుపతిలోని విష్ణునివాసం దగ్గర జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతిచెందడం తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఘటనపై టిటిడి విజిలెన్స్, పోలీసుల వైఫల్యంపై విచారణ చేయాలని అన్నారు. మృతుల కుటుంబాలకు టిటిడిలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని గాయపడిన వారికి మెరుగైన వైద్యం కల్పించి, ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు. ఇటువంటి అవాంఛనీయ ఘటనలకు తావీవ్వకుండా టిటిడి మరింత పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని మృతిచెందిన భక్తుల కుటుంబాలకు ప్రభుత్వం, టిటిడి అండగా ఉండాలని వారు కోరారు.

# విద్యుద్ఘాతానికి గురైన బాధితునికి

## ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ బోనేని



**గిద్దలూరు రూరల్, జనవరి 9, ప్రభాతవార్త**

మండలంలో విద్యుద్ఘాతానికి గురైన అంబవరం గ్రామానికి చెందిన యువకుడు జీడిమెట్ల ధనరాజ్ కుటుంబ సభ్యులకు అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంధ సేవాసంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. మండలంలోని కొమ్మునూరు గ్రామంలో జేఏసి తరపున అంబవరం గ్రామ యువకుడు జీడిమెట్ల ధనరాజ్ విద్యుత్ స్తంభాలపై బల్బులు మారుస్తుండగా విద్యుద్ఘాతానికి గురై గాయాలై వైద్యం కోసం హైదరాబాదులోని యశోద వైద్యశాలలో చేరాడు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి రెండు చేతులు తీసివేయాలని రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుందని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ధనరాజ్ కుటుంబ సభ్యులు దిక్కుతోచని పరిస్థితుల్లో సోషల్ మీడియా పరంగా ఆర్థికంగా సహాయం చేసి ప్రాణాలు కాపాడాలని అందరికీ విజ్ఞప్తి చేసుకున్నారు. ఇందులో భాగంగా స్పందించిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తమ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో సేకరించిన రూ.10వేల నగదును బాధితుని గ్రామానికి వెళ్ళి బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆపద సమయంలో ఎదుటివారికి సహాయం చేయడంలోనే మానవత్వం దాగి ఉందని ప్రతిఒక్కరు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని కోరారు. ఆర్థిక సహాయం అందించిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సెక్రటరీ పందనబోయిన భూపాల్, సలహాదారులు బోనేని రవికుమార్ యాదవ్, సభ్యులు బొమ్మని రవి, బొమ్మని శ్రీకాంత్, రాచకొండ రాము, పెద్ద శ్రీరాములు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత ఓబుల్‌రెడ్డి సతీమణి మహాలక్ష్మికి

### మాజీ మంత్రి సురేష్, జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ తదితరులు ఘన నివాళులు



**సంతనూతలపాడు, జనవరి 9, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం సమీపంలోని మహాలక్ష్మి నగర్‌లో గురువారం జరిగిన వైసీపీ నేత, రిటైర్డ్ హెచ్ఎం సొసైటీ మాజీ అధ్యక్షులు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి సతీమణి మహాలక్ష్మి సంస్మరణ సభలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీపీ, జడ్పీటీసీలు పలువురు వైసీపీ నేతలు ఉద్యోగులు తదితరులు మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నేత గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డికి వారు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ నాయకులు వైద్యులు డాక్టర్ వరికూటి అమృతపాణి, ఎంపీపీలు బుడంగుంట విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, వి.అరుణ కోటిరెడ్డి, జడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావులు మండలాలవైసీపీ కన్వీనర్లు దుంపాచెంచిరెడ్డి, మండవఅప్పారావు, పి.శ్రీమన్నారాయణ, పి.వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు ఐ.పిచ్చిరెడ్డి, మారెళ్ళ బంగారుబాబులు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కనకరావు మాదిగ, వైసీపీ నాయకులు దుంపా యల్లమందరెడ్డి, శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎన్.కృష్ణారెడ్డి, కే.సుధాకరరావు, పి.మహానందిరెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, తేళ్ళ డేవిడ్‌రాజు, పి.ప్రవీణ్, బి.నాగేశ్వరరావు పలువురు ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పాల్గొని మహాలక్ష్మికి ఘన నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## సాయిబాబాకు లక్ష గులాబీలతో వైభవంగా పుష్పార్చన వేడుకలు





**సంతనూతలపాడు, జనవరి 9, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని శ్రీషిర్డీ సుందర సాయి మందిరం నందు గురువారం నాడు వైభవంగా సాయిబాబాకు లక్షల గులాబీలతో పుష్పార్చన వేడుకలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్వి రాఘవరావు, ఐ.జానకి రామయ్య తదితరులు ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేర్నమిట్ట హరిప్రసాద్‌రావు, రావూరి వాసు తదితరులు ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెంగుళూరు నుండి ప్రత్యేకంగా తెప్పించిన లక్షల గులాబీలతో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. భక్తులు సాయిబాబాకు ఈ గులాబీలను భారీగా సమర్పించారు. పలు కేంద్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పేర్నమిట్టలో ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి.

# కమలా స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**మార్కాపురం రూరల్, జనవరి 9 ప్రభాతవార్త**

స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్ మార్కాపురం నందు ముందస్తు సంక్రాంతి సంబరాల వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పి పవన్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఎంపి పుల్లయ్యలు అధ్యక్షత వహించి సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు హరిదాసు, జంగమ్మ దేవర, రైతు వేషధారణలతో, గంగిరెద్దులవారి వేషదారణలతో అందరినీ పాటలు పాడి మొత్తాన్ని అలరించారు. తర్వాత భాగంలో బొమ్మల కొలువు చక్కగా అమర్చి ముత్తైదులకు తాంబూలం ఇచ్చారు. అనంతరం చిన్నారులను కూర్చోబెట్టి భోగి పోసి దీవించారు. చివరిగా విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం కోసం

### మార్కెట్ యార్డ్ స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్



**పెద్దదోర్నాల, జనవరి 9, ప్రభాతవార్త**

పెద్దదోర్నాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనాలు నిర్మించేందుకు అవసరమైన, అనువైన స్థలాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. మూడు దశాబ్దాలుగా నిరూపయోగంగా వృధాగా ఉన్న స్థానిక వ్యవసాయ మార్కెట్ యారు స్థలాన్ని పరిశీలించారు. ఈ విశాలమైన వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల భవనాలు నిర్మించి వసతులు కల్పిస్తే విద్యార్థినీ, విద్యార్థులకు ఎంతో సౌకర్యం గాను, ప్రయోజనకరంగాను ఉంటుందని ప్రజలు హర్షం వెలిబుచ్చుతున్నారు. తగు నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు జిల్లా ఏడీ ఉపేంద్రకుమార్, మండల తహశీల్దార్ శాంతి, మండల సర్వేయర్ ఎనిబెర, సురేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



**మార్కాపురం, జనవరి 9, ప్రభాతవార్త**

అభ్యుదయ భారత తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమాషేక్ 194వ జయంతి వేడుక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించి ఫాతిమా సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ మహనీయులను స్మరించుకోవాలని, వారి బాట మనకు ఎంతో ఆదర్శం అని తెలిపారు. ముఖ్య అతిధిగా హాజరై మండల విద్యాశాఖాధికారి బి.రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో విద్యార్థుల జీవితాలలో మార్పు తెచ్చే విధంగా పని చేయాలని హితవు పలికారు. తెలుగు ఉపాధ్యాయుడు వీరారెడ్డి సమాజంలోని అణగారిన వర్గాల వారికి విద్యను అందించడానికి కృషి చేసిన వాళ్లలో జ్యోతిరావుపూలే మరియు సావిత్రిబాయి పూలే వెంట ఫాతిమా షేక్ నడిచారని కొనియాడారు. ఉర్దూ ఉపాధ్యాయుడు సయ్యద్ సమీ ఉల్లా భాష మాట్లాడుతూ ఫాతిమా షేక్ చేసిన కృషి ఆదర్శవంతమైనదని విద్యార్థులు కూడా అలాంటి గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశ్చిమంలో ఉచిత వైద్యం అందని ద్రాక్షే

## – కూటమి ప్రభుత్వ చేతకాని తనమే వైద్యశాల తరలింపు

## – అచలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్



**మార్కాపురం, జనవరి 9, ప్రభాతవార్త**

పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజల వైద్యం అవసరాల కోసం నిర్మిసూత్తున్న మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలనకు మార్కాపురం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అచలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అచలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వెనుకబడ్డ పశ్చిమ ప్రకాశంలో కూటమి ప్రభుత్వం చర్యలు పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే చర్యలను వారు ఖండించారు. కూటమి ప్రభుత్వ చేతకానితనం కారణంగానే నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పనులు నిలిచిపోయి తరలింపు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. మెడికల్ కాలేజీ సంబంధించిన మూడు బ్లాకుల భవనాలు, పురుషుల మహిళల విద్యార్థుల వసతి భవనాలు 90శాతం పూర్తయ్యాయని పరిశీలన అంశాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పనులు ఆపడం జరిగిందని పనులు ఆపకుండా కొనసాగించి ఉంటే 99శాతం పనులు పూర్తయి ఉండేవని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పీపీపీ పేరు చెప్పి మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఆపి పేదలకు వైద్య సహాయం అందకుండా ప్రైవేటు పరం చేసే దుర్మార్గపు చర్యలు కూటమి ప్రభుత్వం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీని ప్రభుత్వమే వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీ డాక్టర్లు, సిబ్బంది బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని, మెడికల్ కాలేజీ వైద్య సేవలను యధావిధిగా కొనసాగించాలని అన్నారు. మెడికల్ కాలేజీ డాక్టర్లు, ఇతర సిబ్బంది రావడంతో ప్రభుత్వ ఏరియా జిల్లా వైద్యశాలలో ఓపీలు పెరగడం జరిగిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో రావడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యల మూలంగా వైద్యశాలలో రోగులకు వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు అందించకపోగా ఉన్న సేవలను ప్రజలకు దూరం చేసే చర్యలను పూనుకోవడాన్ని వారు ఖండించారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకొని, ప్రభుత్వమే నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రభుత్వ నిర్వహణలోనే కాలేజీ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు, సిబ్బందిని బదిలీలు నిలుపుదల చేసి యధావిధిగా మెడికల్ కాలేజీ సిబ్బందితో వైద్య సేవలు కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని అడ్డుకొని ప్రైవేటీకరణ పేరు చెప్పి పేదలకు వైద్యాన్ని అందకుండా చేసే చర్యలకు సిద్దపడితే అచలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు చూస్తూ ఉండబోమని ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ సీపీఐ ఏరియా కార్యదర్శి అందే నారసయ్య, కో కన్వీనర్ సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే అబ్దుల్ రజాక్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు పి.రిహానాభాను, వీసీకే పార్టీ డివిజన్ నాయకులు ఎన్.రాజు, సీపీఎం మండల కార్యదర్శి గుమ్మల బాల నాగయ్య, సీఐటీయు నాయకులు పి.రూబెన్, జే.నాగరాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు జవాజి రాజు, ఎంపీజే నాయకులు ఎస్కే మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సంకల్ప పూర్వకంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

### - ఎమ్మెల్యే కందుల




**మార్కాపురం, జనవరి 9, ప్రభాతవార్త**
విద్యార్థులు సంకల్ప పూర్వకంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సూచించారు. గురువారం పట్టణం లోని రాక్వెల్ పబ్లిక్ స్కూల్, సాయి బాలాజీ హైస్కూల్‌లలో జరిగిన సంక్రాంతి ముందస్తు వేడుకలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఉన్నత స్థితిని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు ఎన్నో వ్యయసాలను కూర్చి చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి విద్యార్థులు శ్రద్ధతో చదువులలో రాణించాలన్నారు. పాఠశాల యాజమాన్యాలు కూడా పోటీ తత్వంతో విద్యార్థుల కు బోధన అందిస్తున్నారని, చదువుతోపాటు క్రీడలలో రాణించి ప్రతిభలో రాణించాలని అన్నారు. ఆహ్లాద వాతావరణంలో పట్టణానికి దూరంగా ఉన్న ఈ పాఠశాలలు బోధనలలో ర్యాంకులు సాధిస్తూ విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతున్నాయని అన్నారు. త్వరలోనే మార్కాపురం జిల్లాగా మారబోతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసి, అందరికి విద్య అందుబాటులో ఉండేలా సులభమైన రీతిలో చదువు కొనసాగేలా చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలను సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

## నేడు గిరిజనులతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాటామంతి




**పెద్దదోర్నాల, జనవరి 9, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలోని గిరిజన గూడెల్లో విద్యుత్ మౌలిక వసతులు కల్పించుటకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం మోట్ల మల్లికార్జునపురం విచ్చేస్తున్నారు. అక్కడ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గిరిజనులతో మాట మంతి కార్యక్రమం నిర్వహిస్తారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన నేపధ్యంలో మోట్ల మల్లికార్జున పురంలో చేసే ఏర్పాట్లను పరిశీలించేందుకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ ఎరిక్షన్‌బాబుతో పాటు అధికారులు, టీడీపీ నాయకులు కలిసి గురువారం పై చర్లపల్లి మోట్ల మల్లికార్జునపురం గిరిజన గూడెన్ని సందర్శించారు. అలాగే దోర్నాలలో మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసే గోకులం షెడ్లను పరిశీలించారు. మోట్ల మల్లికార్జునపురంలో సిద్ది మల్లికార్జున స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేడు య ర్రగొండపాలెంలో మండల సర్వసభ్య సమావేశం

### - యంపిడివో శ్రీనివాసులు

**య ర్రగొండపాలెం,జనవరి 9,ప్రభాతవార్త**
నేడు శుక్రవారం ఉదయం 10.30గంటలకు మండలపరిషత్ సమావేశ భవనం నందు యంపిడివో శ్రీనివాసులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని యంపిడివో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.మండల ఎంపిపి,జెడ్పిటిసి,ఎంపిటిసి సభ్యులు,సర్పంచ్‌లు, మండల కోఆప్షన్ సబ్యులు,మండంలోని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## ఈ నెల 13న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్

**య ర్రగొండపాలెం,జనవరి 9,ప్రభాతవార్త**
జనవరి 13న యర్రగొండపాలెం పట్టణంలో జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు గురువారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో య ర్రగొండపాలెం వైఎస్ఆర్ సిపి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను వైఎస్ఆర్ సిపి నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ య ర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వైఎస్ఆర్ సీపీ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ య ర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడమైదానంలో జరుగుతుందని తెలిపారు.మొదటి బహుమతి విన్నర్ 50వేల రూపాయలు,2వ బహుమతి రన్నరప్ కలదు,బెస్ట్ బ్యాట్స్ మెన్,బెస్ట్‌బౌలర్,మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్,మ్యాన్‌ఆఫ్ ది సీరీస్ కలదు.ఎంట్రి ఫీజ్12వ తేది మధ్యాహ్నం 2గంటలలోపు 500రూపాయలు చెల్లించిటీమ్‌పేరును నమోదు చేసుకోవాలని వారుతెలిపారు.వివరాలకు ఫోన్‌నెంబర్ 8886422114, 9676531818,య ర్రగొండపాలెం,9441126023,దోర్నాల8008045504,త్రిపురాంతకం9000759500,పెద్దారవీడు9959522411,పుల్లలచెరువు9701248637వారికి సంప్రదించవలెను.

## నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన దామచర్ల సత్య




**కొండపి, జనవరి 9, ప్రభాతవార్త**
స్థానిక కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఎన్ఆర్‌కె యూత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్యం బ్యాట్‌ను పట్టుకుని బ్యాటింగ్ చేయగా మాజీ ఏఎంసి ఛైర్మన్ జి రామయ్య చౌదరి బౌలింగ్ వేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మొదటి రోజున మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి చెందిన క్రికెట్ జట్టు, టంగుటూరు మండలం కారుమంచికి చెందిన క్రికెట్ జట్లు ఆటలో పాల్గొన్నాయి. ఇరుజట్ల క్రికెట్ సభ్యులకు వారు కరచాలనం చేస్తూ మంచిగా క్రీడలో ప్రదర్శన కనబరచాలని సూచించారు. అనంతరం వారు వేధిక పైనుంచి ఇరుజట్ల ఆట ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య, బత్తుల నారాయణ స్వామి, నర్సారెడ్డి, తిప్పారెడ్డి, కృష్ణారెడ్డి, వసంతరావు, రాష్ట్ర మహిళా నాయకురాలు రావిపాటి సీతమ్మ, మండల మహిళా అధ్యక్షురాలు బి ప్రసన్న, యూత్ అధ్యక్షులు కాలేషా, సోమయ్య, రవి, సుబ్బరామయ్య, ఆరికట్ల వెంకటరావు, మండలంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



**మార్కాపురం రూరల్, జనవరి 9, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని స్థానిక వాసవి విద్యానికేతన్ నందు గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ రంగయ్య, ఏఓ రంజిత్ కుమార్‌ల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా అష్టలక్ష్మీదేవీల అలంకరణలు ధరించిన విద్యార్థులను ఆహ్వానించి పిల్లలకు బ్రాహ్మణులచే బోగిపండ్ల ఆశీర్వచనం శాస్త్రోక్తంగా చేపించడం జరిగింది. అష్టలక్ష్మీదేవీల అంకరణలో విద్యార్థినీలు వేసిన వేషధారణలు సాక్షాత్తు ఆ అష్టలక్ష్మీదేవీలు దిగివచ్చినట్లుగా చూపరులను ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి పిల్లలకు భోగిపండ్ల ఆశీర్వచనం చేసి వచ్చిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు తాంబూలాం ఇవ్వడం జరిగింది. పిల్లలకు బిస్కెట్లు పంచడం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పెద్దగంజాం జడ్పీ హైస్కూల్లో సంక్రాంతి పోటీలు



**చిన్నగంజాం, జనవరి 9, ప్రభాతవార్త**
మండలంలోని పెద్దగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు డి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో తెలుగుధనం ఉట్టిపడింది. ఈ సందర్భంగా జరిగిన ముగ్గులు, క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు డి.నారాయణరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు నేటి తరానికి ఎంతో ఉపయోగకరమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.నారాయణ రెడ్డితో పాటు ఎం.అనిల్ కుమార్, విద్య కమిటీ ఛైర్మన్ అశోది సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎన్.రమణమూర్తి, ఎన్.శ్రీరమణ, జి.హవీలదేవి, డి.ఆశాలత, బి.నాగేశ్వరరావు, ఏ.వీరాచారి, బి.చెంచురెడ్డి, కే.నాగరాజు, ఏ.సుబ్బరాజు, షేక్ సుభాని భాషా, ఎం.రవిచంద్ర, టి.వినయ్ కుమార్, డి.సుబ్బారావు, కుమార్ పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఘరానా మోసం

### - పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

**బల్లికురవ, జనవరి 9, ప్రభాతవార్త**
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తనను మోసం చేసి ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన కల్లి అంజని ప్రసాద్‌రెడ్డి రూ.1.75 లక్షలు, డబ్బులు తీసుకుని ఇప్పటి వరకు తిరుగు సమాధానం చెప్పలేదని గ్రామానికి చెందిన గల్లా హరిబాబు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత అయినా డబ్బులు ఇస్తాడని అడుగుతూ ఉంటే డబ్బులు ఇవ్వకపోగా తనను కులం పేరుతో దూషిస్తున్నాడని హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి వారికి తగిన న్యాయం చేయాలని హరిబాబు కోరుతున్నాడు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు




**పొన్నలూరు, జనవరి 9, ప్రభాతవార్త**
పొన్నలూరు మండలంలోని బోగనంపాడు గ్రామంలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎదుట భోగిమంటలను వేశారు. భోగి మంటలు చుట్టూ చేరి సంక్రాంతి పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పల్లె వాతావరణం తలపించేలా అంథమైన ముగ్గులతో గొబ్బెమ్మ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పిల్లలు సంప్రదాయ దుస్తులు ధరించి, ఆట పాటలు, కోలాటాలు, హరిదాసు వేషధారణలతో ఆకట్టుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టామని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా పొన్నలూరు ఎస్సై కే.అనూక్ పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎస్సై అనూక్‌ను విద్యాసంస్థల డైరక్టర్స్ పోతకమూరి యతేంద్ర, వాసుదేవరావు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. పలు రకాల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్సై బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనూక్ మాట్లాడుతూ సమాజంలో పురుషులకు ధీటుగా మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, చదువు నేర్పిన గురువులను మరువకూడదని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికను సద్వినియోగం చేసుకుని సమాజంలో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డీకేను పరామర్శించిన మురళి



**రాచర్ల, జనవరి 9, ప్రభాతవార్త**
అనారోగ్యానికి గురై చికిత్సల అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఫారం సొసైటీ ప్రెసిడెంట్ దూదేకుల ఖాశింసాహెబ్ (డికె)ను మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిఆర్ఐ మురళి గురువారం పరామర్శించారు. డీకె ఇటీవల అనారోగ్యానికి గురై గుండుపాపలలో వైద్యం చేయించుకుని అనంతరం గ్రామానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సిఆర్ఐ మురళి ఫారం గ్రామంలోని డీకె గృహానికి వెళ్ళి అతనిని పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, ఇలాంటి సమస్యల్లోనే ధైర్యంగా ఉడాలని అన్నారు. ఎలాంటి వ్యాధులు సోకినా చికిత్సలు ఉన్నాయని భయపడాల్సిన పని ఏమీ లేదన్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ సమయానికి మందులు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తామంతా అండగా ఉన్నామని అన్నారు. మురళి వెంట స్థానిక వైసిపి శ్రేణులు చిట్టెం దామోదర్, నల్గొండ ఏలియా, చిట్టెం వెంకటరంగయ్య, పూసలపాటి ఆనంద్, చిట్టెం బాబు, పరిశపోగు జాకోబు తదితరులు ఉన్నారు.

## జీవో 117 రద్దుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

### - ఎంఈఓ వి గిరిధర్ శర్మ



**రాచర్ల, జనవరి 9 ,ప్రభాతవార్త**
విద్యాశాఖకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117జీవోను రద్దు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర్ శర్మ తెలిపారు. 117జీవోను ఉపసంహరించుకొనుటకు మెమో నెంబర్ 13021ను ప్రభుత్వం జారీ చేసిందని ఈ మెమో 117జీవో రద్దు కొరకు కాదని కేవలం కసరత్తు కోసమని కూడా ప్రభుత్వం తెలిపిందని ఆయన అన్నారు. లెక్కలు అన్ని తేలిన తర్వాత ఇబ్బందులు సరిచూసుకొని జీవో ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కసరత్తు ప్రక్రియకు కనీసం రెండు నెలల సమయం పడుతుందని కూడా ఆయన తెలిపారు. టీచింగ్ స్టాఫ్ సర్దుబాటు చేయుటకు యుడైస్ లోని సూడెంట్ ఎన్‌రోల్‌మెంట్‌ను కట్ ఆఫ్ డేట్ 2024 డిసెంబర్ 31వరకు పరిగణలోనికి తీసుకుంటారని అన్నారు. క్లస్టర్ మండల్ లెవెల్ కమిటీలు ఏపి బేసిక్ / యూపి స్కూల్స్ ఏపి మోడల్ / హెచ్ఎస్‌లకు మ్యాప్ చేయాలో గైడ్‌లైన్ ప్రకారం నిర్ణయించాలని అన్నారు. ఎంఈఓలు కన్వీనర్లుగా మండల కమిటీలు క్లస్టర్ స్కూల్ హెచ్ఎంలు కన్వీనర్లుగా క్లస్టర్ లెవెల్ కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయని అన్నారు. గ్రామ పంచాయితీ యూనిట్‌గా మోడల్ ప్రైమరీకు బేసిక్ స్కూల్స్‌ను మ్యాప్ చేయాలని తెలిపారు. ఎస్ఎంసిలను పిల్లలను ఇతర స్కూల్స్‌లో మ్యాపింగ్‌కు ఒప్పించాలని తెలిపారు. యుపి స్కూల్స్‌కు పూర్తిగా మంగళం ప్రభుత్వం ప్రతిపాదించే టైప్ ఆఫ్ స్కూల్స్‌లో యుపి లేవని అన్నారు. రిస్ట్రక్టరింగ్ అయిన తర్వాత పంచాయితీ వారీగా జాబితాలు తయారు చేసి ఎస్ఎంసిల అభ్యంతరాలను పరిశీలించి ఫైనల్ జాబితాను మండల్ లెవెల్ కమిటీకు ఇవ్వాలన్నారు. మండల కమిటీల రిపోర్టు జిల్లాకు ఇవ్వవలసి ఉంటుందన్నారు. హెచ్ఎస్‌లలో 3,5తరగతులు ఉంటే వాటిని మోడల్ ప్రైమరీ స్కూల్‌కు మ్యాప్ చేయాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ రెండు క్యాంపస్‌లలో కలిసి ఏర్పాటు చేయవచ్చున్నారు. యుపి స్కూల్స్‌లో 68 తరగతిలో 30మందికంటే తక్కువ ఉంటే మోడల్ బేసిక్ స్కూల్‌గా డౌన్ గ్రేడ్ చేయబడతాయని విద్యార్థులను 3కిలోమీటర్ల లోపల ఉన్న హెచ్ఎస్‌లకు మ్యాప్ చేస్తారని 30 లేదా 59మధ్య విద్యార్థుల సంఖ్య 60కంటే ఎక్కువ ఉంటే వచ్చే అకాడమిక్ ఇయర్ నుండి హెచ్ఎస్‌గా అప్‌గ్రేడ్ చేస్తారని హెచ్ఎస్‌లో 75నుండి 97 మధ్య విద్యార్థులు ఉంటే హెచ్ఎం మరియు పిఈటి పోస్ట్ ఇస్తారన్నారు. ఒక హెచ్ఎస్‌లో 75కంటే ఎక్కువ రోల్ ఉంటే హెచ్ఎం-1స్కూల్ అసిస్టెంట్ -7 పిఈటి / పిడి-1 కనీస పోస్టులు ఉంటాయన్నారు. 6సెక్షన్లు ఉంటే అదనంగా మ్యాథ్స్ 7 అదనంగా తెలుగు, మ్యాథ్స్, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ నాలుగు పోస్టులు ఇస్తారన్నారు. 8వ సెక్షన్‌కు బిఎస్, 9వ సెక్షన్‌కు పిఎస్, 10వ సెక్షన్‌కు హిందీ రెండో పోస్ట్ వస్తాయన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ పిపి-1, పిపి-2, 1-5తరగతులలో మెయిన్ స్ట్రెంత్ 60ఉండాలని 5మంది టీచర్లు ఉండాలని తెలిపారు. రోల్ 120ధాటితే ఒక పిఎస్, హెచ్ఎం, రోల్ 150ధాటితే ప్రతి అదనపు 30మందికి ఒక ఎస్‌జిటీ ఉంటారన్నారు. ఫౌండేషన్ స్కూల్స్ పిపి-1ప్లస్, పిపి-2ప్లస్ వన్‌ప్లస్‌టులో ప్రతి 30మందికి ఒక ఎస్‌జిటి 60మందికి ఇద్దరు ఎస్‌జిటిలు ఉంటారని తెలిపారు. బేసిక్ ప్రైమరీ పిపి-1, పిపి-2 ప్లస్ వన్ టు ఫైవ్ మొదటి 20రోల్‌కు ఒక ఎస్‌జిటి ఆపై 60వరకు ఎస్‌జిటిలు ఉంటారని ఆయన తెలిపారు.

## ఘనంగా ఏపి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**కొనకనమిట్ల, జనవరి 9, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కొనకనమిట్ల ఏపి ప్రాధమిక పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహజంచారు. ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయుల ఆధ్వర్యం లో సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా చిన్నారులచే హరిదాసు, రైతు వేషధారణలు వేయించి ప్రదర్శన చేయించారు. విద్యార్థుల వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి. బాలికలు, వారి తల్లులచే రంగులతో సంక్రాంతి ముగ్గులు పాఠశాల ముఖద్వారం వద్ద వేయించారు. ఆ ముగ్గులపై గొబ్బెమ్మలను ఉంచారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టత గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ మస్తాన్, రహిమాన్, ఎస్ఎంసీ ఛైర్మన్ రూతు, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఉసైల వెలుగొండయ్య మృతికి పలువురు నివాళి



**హనుమంతునిపాడు, జనవరి 9, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఉస్పైల వెలుగొండయ్య(నెంబరు కొండయ్య)(55) గురువారం మృతిచెందారు. వెలుగొండయ్య మృతదేహానికి కనిగిరి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు కొటికల బాలబాదుర్ల ఎంపీటీసీ సభ్యులు రుద్రపాటి శోభా సాల్మన్ రాజ్ సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మ, చిన్న డీలర్ ఉసైల రాజారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటన తీవ్ర ఆవేదన కలిగించింది

### - మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన అప్పిశెట్టి ఉదయ శంకర్



**గిద్దలూరు రూరల్, జనవరి 9 ,ప్రభాతవార్త**
వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్న ఘటనలో ఆరుగురు మృతిచెందారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని భారతీయ జనతాపార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ అన్నారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం చెందడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్య శాఖకు సూచిస్తున్నానన్నారు. మృతులు, క్షతగాత్రులలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఉనట్లు తెలిసిందని, వారి కుటుంభీకులకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు సూచిస్తున్నానని తెలిపారు. అదేవిధంగా మృతుల కుటుంబాల దగ్గరకు వెళ్ళి పరామర్శించి మనోధైర్యం ఇచ్చే బాధ్యతలు టీటీడి పాలకమండలి తీసుకోవాలని అన్నారు.

## టిప్పర్ లారీ ఢీకొని ఒకరు మృతి మరొకరికి గాయాలు



**మార్కాపురం రూరల్, జనవరి 9, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలోని కోమటికుంట నుండి జమ్మనపల్లి వెళ్ళు రహదారిలో గురువారం ముందుగా స్కూటీపై వెళ్తున్న ఇద్దరు మహిళలను వెనుకవైపు నుండి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో 100అడుగుల దూరం వరకు స్కూటీని టిప్పర్ లారీ ఈడ్చుకెళ్ళినట్లు సమాచారం. టిప్పర్ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

**మద్దిపాడు, జనవరి 9, ప్రభాతవార్త**
విద్యార్థులను వేదింపులకు గురి చేస్తున్న ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన స్వర్ణ రాజశేఖర్ మద్దిపాడు మండలం వెంకటరాజుపాలెం పరిధిలో ఉన్న బీఏఅండ్‌కేఆర్ కాలేజీ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలం నుంచి కళాశాలలోని విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నాడని ఆ వేదింపులు శృతిమించడంతో విద్యార్థులు గురువారం మద్దిపాడు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.శివరామయ్య తెలిపారు.

## శ్రీ విద్యానికేతన్ హైస్కూల్లో సం క్రాంతి సంబరాలు




**సింగరాయకొండ,జనవరి 9,ప్రభాతవార్త**
పట్టణంలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్లో చిన్నారుల ఆటలపాటలతో ,పల్లెటూరి వేషదారణలతో పండుగ వాతావరణం ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలును గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మన సాంప్రదాయలు ఉట్టిపడేలా వినూత్న వేషదారణలతో ఆటపాటలాడి అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా ఈ పండుగ వాతావరణంలో ఈ వేడుకలు జరగటం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఏబీసీ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**తాళ్లూరు,జనవరి 9, ప్రభాతవార్త**
సంస్కృతి సంప్రదాయాలను నేటి తరాలకు గుర్తు చేస్తూ ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా క్షయ, లెప్రసీ అధికారి సురేష్‌బాబు అన్నారు. తాళ్లూరులోని ఏబీసీ పాఠశాలలో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు .ఏబీసీ హైస్కూల్ వారు నిర్వహించిన సంబరాలు నేటి తరాలకు నాటి సంప్రదాయాలను గుర్తు చేసే విధంగా ఉన్నాయని అన్నారు. తన చిన్న తనంలో మరింత శోభగా సంక్రాంతి నిర్వహించుకునే వారని చెప్పారు. కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను ఎంతో కళాత్మకంగా సాంప్రదాయ బద్దంగా నిర్వహించడం అభినందనీయమని విద్యార్థులు చక్కగా నృత్యాన్ని ప్రదర్శించారని, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఏబీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. డైరక్టర్ కాలేషా బాబు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుపుతూ సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ముందుగా ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఖాదర్ మస్తాన్‌బి, కోఆప్షన్ మెంబర్ కరిముల్లా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఐ.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీకే విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



**సీఎస్‌పురం, జనవరి 9, ప్రభాతవార్త**
స్థానిక బీకే విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ తర్వాత భోగి మంటలు, హరిదాసుల వేషధారణలతో సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రత్నం విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు మాట్లాడుతూ మకర సంక్రాంతి అనేది మార్పు, కొత్త ప్రారంభాల ఆగమణాన్ని, సూచిస్తుందని వెచ్చదనం, ఉత్సాహంతో జరుపుకునే పండగని వివరించారు. ఈ కార్యక్రమంలో బీకే విద్యామందిర్ ఇంగ్లీషన మీడియం హైస్కూల్ హెచ్ఎం డీ సూర్య, ఉపాధ్యాయ, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డులు



**తాళ్లూరు, జనవరి 9, ప్రభాతవార్త**
ఆరేళ్లలోపు పిల్లలందరికి ఆధార్ కార్డులు తీయించుకోవాలని దర్శి ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి కోరారు. మండలంలో వెలుగువారిపాలెం, తూర్పు గంగవరం, మన్నేపల్లి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన బాల ఆధార్ నమోదు శిబిరాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనన దృవీకరణ పత్రం ఉన్న పిల్లలందరికి తక్షణమే ఆధార్ కార్డు కోసం వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అంతకముందు ఆమె ఆధార్ కార్డు నమోదు చేస్తున్న తీరును తెలుసుకుని పలు సూచనలు చేశారు. క్యాంపు ద్వారా 86 మందికి కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఉన్నారు.

## అగ్నిప్రమాదంలో పూడిగుడిసె, మోటారు సైకిల్ దగ్ధం



**సీఎస్‌పురం, జనవరి 9, ప్రభాతవార్త**
ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిగుడిసె, ఓ మోటారు సైకిల్ దగ్ధమైన సంఘటన మండలంలోని కే.అగ్రహారం గ్రామంలోని యానాదుల సంఘంలో గురువారం సాయంత్రం జరిగింది. యానాదుల సంఘంకు చెందిన సవరం హుస్సేనమ్మ వంట చేస్తుండగా పాప ఏడవడంతో బయటకు వెళ్లింది. ఆ సమయంలో తడికలతో నిర్మించుకుని ఉన్న పూరి గుడిసెకు మంటలు అంటుకున్నాయి. దీంతో పూడి గుడిసె మొత్తం దగ్ధం కాగా, గుడిసెలో ఉన్న మోటారు సైకిల్ కూడా మంటలకు దగ్ధమైంది. కాగా ఆమె భర్త సవరం పోలయ్య వెలిగండ్ల మండలంలో జరిగిన ఓ చోరీ కేసులో ముద్దాయిగా జైల్లో ఉండగా అతనికి బెయిల్ ఇప్పించుకునే ప్రయత్నాలలో భాగంగా ఇతరుల వద్ద తీసుకొచ్చిన రూ.30వేలు నగదు, కర్ర కోసే మిషన్, వంట పాత్రలు, ఆహార సామాగ్రి, బట్టలు మొత్తం అగ్నికి ఆహుతి కాగా తాము కట్టుబట్టలతో మిగిలామంటూ బాధితురాలు హుస్సేనమ్మ వాపోయారు. తహశీల్దార్ మంజునాథరెడ్డి, ఆదేశాలతో వీఆర్వో విష్ణునారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అగ్ని ప్రమాద సంఘటనను ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని కే.అగ్రహారం టీడీపీ నాయకులు చామల తిరుపతిరెడ్డి, పిడతల ఓం శివయ్య, యడవల్లి చిన్న సుబ్బయ్యలు తెలిపారు.

## బధిరుల పాఠశాలలో అన్నదానం

**చీమకుర్తి, జనవరి 9, ప్రభాతవార్త**



చీమకుర్తి ఎస్ కే ఆర్ బదిరుల పాఠశాలలో గురువారం అన్నదానం కార్యక్రమం జరిగింది. సాయిబాబా మందిరం చీమకుర్తి వారి ఆధ్వర్యంలో సాయి పాదాసేవకులు పత్తి ఆంజనేయులు, ధనలక్ష్మి, అమృత, యమా వెంకటేష్, వెంకట వర్షిత, తోట వంశీ రంజన్ బాబు, వెంకట హర్షిత గార్లు ఈ రోజు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సాయిబాబా మందిరం ట్రస్ట్ సభ్యులు మావిల్లపల్లి. వెంకటేశ్వర్లు, చదలపాక. ప్రసాదరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. అంజిరెడ్డి, సాయిబాబా దేవస్థానం అర్చకులు వి. వెంకటాచార్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తులు....

**- మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య**

**చీమకుర్తి, జనవరి 9, ప్రభాతవార్త**



2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు నిమిత్తం నిరుద్యోగులు ఈ నెల 8 నుంచి 16 వ తేదీ వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ నుంచి సచివాలయాల్లో ఓబిఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం,మినీ డైరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ,ఆటో,టాటా టాటా ఎస్, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. చీమకుర్తి పట్టణానికి సంబంధించి బీసీలకు 20 యూనిట్లు, ఈ డబ్ల్యూ ఎస్ లకు 7 యూనిట్లు మంజూరయ్యాయని, వాటి వివరాలు సచివాలయం నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## గోపిరెడ్డి మహాలక్ష్మికి నివాళులు

**చీమకుర్తి, జనవరి 9, ప్రభాతవార్త**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సీనియర్ నాయకులు, మాజీ అధ్యక్షులు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి గారి సతీమణి గోపిరెడ్డి మహాలక్ష్మి గారి దశదిన కర్మకు పలువురు హాజరై గురువారం నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా పరిషత్ చైర్పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ, రాష్ట్ర మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌లు హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఓబుల్ రెడ్డి మాస్టర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గంగాల సుజాత, చీమకుర్తి సంతనూతలపాడు జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, దుంపా రవణమ్మ, గొర్రెపాటి శ్రీనివాసరావు, పమిడి వెంకటేశ్వర్లు, జాష్ట శ్రీనివాసరావు, కార్పొరేటర్ తిరుపతిరావు, చంద్ర, సంతనూతలపాడు టిడిపి నాయకులు వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి, చీమకుర్తి కౌన్సిలర్లు భీమన వెంకట్రావు, తప్పిట బాబురావు, సోమ శేషాద్రి, పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి సంతనూతలపాడు మద్దిపాడు నాగులప్పలపాడు మండలాల నుంచి పలువురు హాజరై నివాళులర్పించారు.

## ఘనంగా శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సంక్రాంతి సంబరాలు

**పామూరు, జనవరి 9, ప్రభాతవార్త**





పామూరులోని స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు సంక్రాంతి సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ సంక్రాంతి విశిష్టత తెలుపుతూ ముగ్గులు వేసి విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. పోటీల్లో గెలుపొందిన వారికి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం భోగి మంటలు వేసి ఆట పాటలతో పిల్లలని అలరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, కోఆర్డినేటర్ జీఎస్ఆర్ వీర, ప్రిన్సిపాల్ భాషా, డీన్ కిషోర్, టెన్త్ ఇన్‌ఛార్జీ గుత్తి మహిత్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రారంభించిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

**వేటపాలెం, జనవరి 9, ప్రభాతవార్త**



బాపట్ల జిల్లా వేటపాలెం మండలం వేటపాలెం గ్రామంలోని జింకన్న క్లబ్ నందు పురుగుమందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా ఉండే వ్యవసాయం కొరకు ఎన్‌పీఎం షాప్ ఓపెన్ చేయడమైంది. ఇందులో భాగంగా బాపట్ల డీపీఎం వాణిశ్రీ అడిషనల్ డీపీఎం జానకి మండల ఏవో కాశివిశ్వనాథ్ వేటపాలెం మండలంలో పని చేస్తున్న క్యాడర్ అందరూ, రైతులు ఈ యొక్క షాప్ ఓపెనింగ్‌లో పాల్గొన్నారు. ఈ యొక్క ఎన్‌పీఎం షాపు నందు వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల పురుగుల వినాశనం కొరకు కషాయాలు మొక్కలు పెరుగుదలకు అమృతాలు, ప్రకృతి వ్యవసాయంలో పండిన అన్ని రకాల ఉత్పత్తులు అమ్ముబడును. ముఖ్యంగా 22 పోషకాలతో కలిగిన బయో కల్చర్ అమ్ముబడును. ఎల్లో ప్లేట్స్ లింగాకర్షణ బుట్టలు పంచగవ్య మీనావ్యం దశపర్ణిగ్నిస్త్రం బ్రహ్మాస్త్రం పలు రకాల కషాయాలు అమ్ముతాలు రైతులకు తక్కువ ధరలకు అమ్ముబడును, భూమి రకాలుగా పోషకాలతో మారటానికి మనుషుల ఆరోగ్యాలు మెరుగుపడటానికి ఈ వ్యవసాయం ముందుకు తీసుకెళ్లడానికి ఈ యొక్క షాపును నిర్వహించడం వలన అందుబాటులో రైతులకు ఉండటం వలన భూమి సాగుపడుతుందన్నారు. ఈ షాపును మీసాల శ్రీనివాసరావు, వేటపాలెం యూనిట్ వేటపాలెం గ్రామంలోని జింకన్న క్లబ్ నందు పెట్టడం జరిగింది.

## ఆనందోత్సవాలతో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**వేటపాలెం, జనవరి 9, ప్రభాతవార్త**



మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలోని వీకేవీ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్‌ను వివిధ పూలతో అలంకరించారు. స్కూల్ ప్రాంగణంలో రంగురంగుల రంగు వల్లులు, హరిదాసు సంకీర్తనలు, భోగి మంటలు, కొత్త ధాన్యంతో పొంగళ్ళు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వినోదాన్ని పంచాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సుదీప్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారి పెద్ద పండుగని, ధనుర్మాసం సందర్భంగా ప్రతి ఇంటి ముంగిళ్లలో వేకువనే మహిళలు రంగవల్లులు అందంగా అలంకరిస్తారని , హరిదాసుల నామ సంకీర్తనలు, గంగిరెద్దుల వారి విన్యాసాలు ఊరంతా సందడిగా ఉంటుందని,ఈ సమయంలోనే రైతులు పండించిన కొత్త పంట చేతికి వచ్చి ఆనందంగా ఉంటారని, ఆ కొత్త ధాన్యంతోనే సంక్రాంతి నాడు పొంగళ్లు చేస్తారని, పల్లెల్లో ఎద్దుల పందాలు కోళ్ల పందాలు వంటివి నిర్వహిస్తారని ఆన్నారు. సంక్రాంతి, కనుమ పండుగ విశిష్టతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తూర్పునాయుడుపాలెం హైస్కూల్ విద్యార్థులకు ఆటల పోటీలు

**టంగుటూరు, జనవరి 9, ప్రభాతవార్త**



తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులకు క్రీడల పట్ల నైపుణ్యత మెరుగుపరచే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రీడలను ప్రోత్సహిస్తూ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. బాలికలకు ముగ్గుల పోటీలు, బాలురకు వాలీబాల్, కబడ్డీ, జంప్ రోప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల ఉపాధ్యాయులు బాలుర విభాగానికి శ్రీనివాసులు రామారావు, బాలికల విభాగానికి మహిళా ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనివి సుధారాణి అభినందించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

**టంగుటూరు, జనవరి 9, ప్రభాతవార్త**



శ్రీచైతన్య హైస్కూల్ టంగుటూరు నందు సంక్రాంతి సంబరాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డ్రెస్సుల వేష, గాలిపటాలు ఎగురవేసి, ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని స్కూల్ ప్రాంగణాన్ని మార్చారు. ఈసంబరాలకు ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ వివి రమణ, హెడ్ మిస్ట్రెస్ ఎస్.వెంకాయమ్మ, స్కూల్ డైరక్టర్ రఘునందన పాల్గొన్నారు. ఈ విధంగా పండుగను ఘనంగా జరిపినందుకు కరస్పాండెంట్ వివి రమణ, హెడ్ మిస్ట్రెస్ వెంకాయమ్మ విద్యార్థులను మెచ్చుకున్నారు.

## స్మశాన వాటికను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమీషనర్, తహాశీల్దార్

**దర్శి, జనవరి 9, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో ఉన్న స్మశాన వాటికను మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ కమీషనర్ మహేష్, ఎమ్మార్వో శ్రావణ్‌కుమార్‌లు పరిశీలించారు. స్థానిక ప్రజలు పాల్గొని మాట్లాడుతూ 30 సంవత్సరాల పైబడి ఇక్కడ స్మశాన వాటికను నిర్వహించుకుంటున్నామని, కావున ప్రభుత్వ నిధులతో స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని అధికారులను కోరారు.

## ప్రయాణాలు చేయదల్చుకున్న వారు సమాచారం ఇవ్వండి - ఎస్సై వై.నాగరాజు

**ముండ్లమూరు, జనవరి 9, ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేయదలుచుకున్న వారు తమకు సమాచారం ఇవ్వాలని ముండ్లమూరు ఎస్సై వై.నాగరాజు తెలిపారు. గురువారం ఆయన ఈ మేరకు విలేకర్లతో మాట్లాడారు. పండుగ సమయాల్లో గ్రామాల్లో దొంగలు సంచరించే అవకాశం ఉన్నందున గ్రామాలకు వెళ్లే వారు తమకు సమాచారం ఇస్తే గస్తీ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముండ్లమూరు మండల ప్రజలు గమణించాలని ఆయన తెలియజేశారు.

## భాష్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**దర్శి, జనవరి 9, ప్రభాతవార్త**



దర్శిలోని భాష్యం స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పిల్లలు ఆటలు పాటలు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 18న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**ముండ్లమూరు, జనవరి 9, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ముండ్లమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్.జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మండల పరిషత్ అధ్యక్షురాలు సుంకర సునీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరవ్వాలని, హాజరయ్యే అధికారులు సంబంధిత శాఖలకు సంబంధించిన రిపోర్టులతో హాజరు కావాలని తెలియజేశారు.

## పందిళ్ళపల్లి హైస్కూల్ అభివృద్ధికి చర్యలు

**వేటపాలెం,ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, చీరాల డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావులు సందర్శించారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ పాఠశాలలో ఉన్న క్రీడా వికాస కేంద్రం, నిర్మాణం మధ్యలో ఆగిపోయిన పాఠశాలకు అదనపు తరగతి గదులు, ఎన్ని సార్లు రిపేరు చేసినా పని చేయని ఆర్వోప్లాంట్ పరిశీలించారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన ఏ సమస్య అయినా సరే సత్వరమే డైరక్టుగా ప్రధానోపాధ్యాయులే నా దృష్టికి తీసుకువచ్చినట్లయితే తప్పనిసరిగా పరిష్కరిస్తానని, క్రీడా వికాస కేంద్రం త్వరలో ప్రారంభించడానికి, అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయడానికి, ఆర్వో ప్లాంట్ పని చేసే విధంగా చర్యలు తప్పకుండా తీసుకుంటానన్నారు. చీరాల డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలతో ఉపాధ్యాయులు ఆత్మీయంగా ఉంటూ, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థుల యొక్క సమస్యలను తెలుసుకుంటూ బోధన అభ్యసనలో వాళ్ళను కూడా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండ్రూస్ అకాడమీ ఆన్‌లైన్‌లో గత నవంబర్‌లో నిర్వహించిన మాథ్స్ ఒలింపియాడ్ లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఏడో తరగతి చదువుతున్న పృదివి షణ్ముఖేశ్వర్‌కి రూ.2వేలు, మెమోంటో, మెడల్ సర్టిఫికేట్, 8వ తరగతి చదువుతున్న బట్ట లలితసాయి విగ్నేష్ రాష్ట్ర స్థాయిలో మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ద్వితీయ స్థానం సాధించినందుకు వెయ్యి రూపాయలు నగదు బహుమతి, మెమోంటో, మెడల్, సర్టిఫికేట్ మహేంద్రనాథ్ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, ఓల్డ్ స్టూడెంట్ సొసైటీ అధ్యక్షులు ఊటుకూరు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రొండా దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## త్వరలో అందుబాటులోకి హోమ్ ట్రై యాంగిల్ యాప్ సేవలు

**- మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్**

**కనిగిరి, జనవరి 9, ప్రభాతవార్త**



పట్టణంలోని వివిధ రకాల సేవలు అనగా కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్ మొదలగు వారికి త్వరలో హోమ్ ట్రై యాంగిల్ సంస్థ ద్వారా వారి జీవనోపాధి మెరుగుకు దోహదం చేస్తుందని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వీస్ ప్రొవైడర్ల రిజిస్ట్రేషన్ మేళాలో మున్సిపల్ కమీషనర్ డానియల్ జోసెఫ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రజలకు అవసరమైన పలు సేవలు అందించేందుకు ముందుగా పట్టణంలోని సర్వీస్ ప్రొవైడర్ లను రిజిస్ట్రేషన్ చేసి అనంతరం వారికి స్కిల్ డవలప్‌మెంట్ వారి ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణంలోని వివిధ రకాల సేవలు అందించే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమీషనర్ డానియేల్ జోసెఫ్ మాట్లాడుతూ బెంగుళూరుకు చెందిన హోమ్ ట్రై యాంగిల్ సంస్థతో ప్రభుత్వం ఒడంబడిక చేసుకుని ఎంపిక చేసిన సర్వీస్ ప్రొవైడర్‌లకు 15 రోజుల శిక్షణ అందించి శిక్షణ అనంతరం వారికి ఉచితంగా యూనిఫాం ఇవ్వడంతో పాటు సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.శిక్షణ అనంతరం వారికి సర్వీస్‌లు అన్‌బోర్డు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 15వ తేదీ వరకు ఇంకా ఎవరైనా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు ఉన్నట్లయితే మెప్మా విభాగంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. 16వతేదీ తర్వాత వారిని స్క్రూట్నీ అనంతరం శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో మెప్మా సీఎంఎంకే రఘు,సీవో రమణమ్మ,దీప్తి,హనీఫా,సర్వీస్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

## గ్రేడ్ వన్ ల్యాబ్‌టెక్నీషియన్‌గా పదోన్నతి పొందిన నరసింహారావు

**కనిగిరి, జనవరి 9, ప్రభాతవార్త**



కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో గ్రేడ్ టూ ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించే కనిగిరి తాలూకా ఏపీ ఎన్జీవో సెక్రటరీ ఎస్‌వీ నరసింహారావు గ్రేడ్ వన్ ల్యాబ్ టెక్నీషియన్‌గా నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పదోన్నతి పొందారు. రీజనల్ డైరక్టర్ సుచిత్ర చేతుల మీదుగా నియామక పత్రాన్ని నరసింహారావు అందుకున్నారు. గ్రేడ్ వన్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పదోన్నతి పొందిన ఎస్‌వీ నరసింహారావుకు ఏపీ ఎన్జీవో పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు, పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీచైతన్య స్కూల్లో వైభవంగా సంక్రాంతి సంబరాలు

**కనిగిరి, జనవరి 9, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు అంబరాననంటాయి. విద్యార్థినీ, విద్యార్థులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను పాఠశాల ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేసి నూతన సంవత్సరంలో కనిగిరి ప్రజలకు శుభాలు కలగాలని ఉపాధ్యాయులు, కోరుకున్నారు. అందమైన రంగులతో గొబ్బెమ్మలు ఉంచి విద్యార్థినులు వేసిన ముగ్గులు విశేషంగా ఆకర్షించాయి. విద్యార్థుల హరిదాసు వేషాలతో పాటలు పాడుతూ అలరించారు. విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేయడం జరిగింది. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ఏజీఎం అంజయ్య, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, కోఆర్డినేటర్ సీహెచ్ వీరాంజనేయులు, డీన్ కే.శ్రీనివాస్, ప్రైమరీ కోఆర్డినేటర్ షహనా, ఏవో మునీర్ భాష, ప్రైమరీ ఇన్‌ఛార్జీ సౌమ్య, ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**కనిగిరి, జనవరి 9, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు ఐటీడీపీ నాయకులు షేక్ షాకీర్ అహ్మద్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు అన్ని శుభాలు కలగాలని కోరారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో సుఖంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కనిగిరి నియోజకవర్గంలోని గ్రామాలు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు.

## డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరక్టర్ రవికుమార్‌ను కలిసిన తేళ్ల

**నాగులుప్పలపాడు, జనవరి 9, ప్రభాతవార్త**



జిల్లా డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరక్టర్ టి.రవికుమార్‌ను మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## సంక్రాంతి ఆటల పోటీలు గ్రామసీమల్లో ఐక్యమత్యాన్ని చాటాలి

**- మండల పార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, ఎన్డీఏ నాయకులు**

**పామూరు, జనవరి 9, ప్రభాతవార్త**





గ్రామగ్రామాన సంక్రాంతి పర్వదినం ముందు నిర్వహించే వివిధ క్రీడా పోటీలు గ్రామసీమల్లోని ప్రజల మధ్య ఐక్యమత్యాన్ని చాటాలని అందుకు ప్రతి ఒక్కరూ క్రీడా స్పూర్తితో ముందుకు సాగాలని మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణం ఫోర్‌మెన్ కమిటీ మెంబరు పందిటి హరీష్, సీనియర్ నాయకులు దేవరపు మాల్యాద్రి, జిల్లా జనసేన నాయకులు యలమందల రహీముల్లా, కోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు, యువజనవిభాగం నాయకులు మెంటా నరసింహారావు, పట్టణ అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లాలు తెలిపారు. మండల కేంద్రమైన పామూరులో ఉగ్రన్న యువసేన ఆధ్వర్యంలో గుమ్మలంపాడు గ్రామంలో గుమ్మలంపాడు క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో పోటీలను యువత కేరింతల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఎన్నికల సమయంలోనే పార్టీలు, వర్గాలు ఉంటాయని, ఎన్నికల అనంతరం గ్రామంలోని ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలిగేందుకు పండగలు, పర్వదినాలు నాడు ప్రజల సంతోషం కోసం ఏర్పాటు చేసే క్రీడలను శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రోత్సహిస్తున్నాడని అన్నారు. 50వేలు ప్రథమ బహుమతితోపాటు రూ.30వేలు, రూ.25వేలు, రూ.15వేలతో పాటు మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్, బెస్ట్ బౌలర్ తదితర విభాగాలకు చెందిన బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఐక్యమత్యానికి నిదర్శనంగా నిలిచే ఆటలను ప్రతి ఒక్కరూ స్పూర్తిగా తీసుకుని పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేమూరి కావేరి రసూల్, జనసేన నాయకులు షేక్ సంధాని, మండల అధ్యక్షుడు దర్శి ఏడుకొండలు, దాదిరెడ్డిపల్లి సర్పంచ్ బద్దిపూడి మార్కు, అబ్బూరి శేషయ్య, తుఫాన్‌రెడ్డి, ముక్కు ఎరికలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్216లో పలు ఆక్రమణలు

**- ఎన్‌ఓసీలు జారీ చేసిన నేషనల్ హైవే అధారిటీ**

**- ఏడు ప్రభుత్వ శాఖలకు నోటీసులు జారీ చేసిన లోకాయుక్త**

**వేటపాలెం,జనవరి 9, ప్రభాతవార్త**



దిగమర్రు జాతీయ రహదారి 216 పై వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో వేటపాలెం జంక్షన్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు యాజమాన్యాలు జాతీయ రహదారిని ఆక్రమించడమే కాకుండా పక్కవారి స్థలాలు ముందు వరకు అడ్డంగా రోడ్డు అంచుల్లో ఉన్న ఇసుకను తొలగించి, అక్రమ నిర్మాణాలను నిర్మించినప్పటికి నేషనల్ హైవే అధారిటి స్పందించకపోగా పెట్రోల్ బంకు యాజమాన్యాలకు ఎన్‌ఓసీలు మంజూరు చేయటం నేషనల్ హైవే అధారిటీ నిర్లక్ష్యానికి, అవినీతికి అద్దం పడుతోంది. ఆక్రమణల విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను సంప్రదించగా ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది రెవెన్యూ వారికి ఏమి సంబందం అంటూ ప్రశ్నిస్తున్నారంటూ వేటపాలెం తహాశీల్దార్ తెలిపారు. హైవే ఆక్రమణలపై స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికి సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైవే ఆక్రమణలకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయంతో సహా పది ప్రభుత్వ శాఖల ఉన్నతాదికారులను ఫిబ్రవరి 4వ తేదీ విచారణకు హాజరు కావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త నోటీసులు కూడా జారీ చేసింది. చీరాల నియోజకవర్గంలో వేటపాలెం, చిన్నగంజాం మండలాల పరిధిలో జాతీయ రహదారిపై పలు చోట్ల ఆక్రమణలు జరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పటికి నేషనల్ హైవే అధారిటీ, రెవెన్యూ అధికారులు మౌనం వహించడం పట్ల స్థానిక ప్రజలలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

## గిరిజనులకు ఆధార్ కార్డులు పంపిణీ

**వేటపాలెం, జనవరి 9, ప్రభాతవార్త**

బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేటపాలెం మండలంలోని చల్లారెడ్డిపాలెం గ్రామ యానాది సామాజిక వర్గంలో ఆధార్ కార్డులేని 25 మంది బడి ఈడు పిల్లలకు లేట్ బర్త్ అప్లికేషన్స్ ద్వారా జనన ధృవీకరణ పత్రంను వేటపాలెం తహాశీల్దార్ చేతుల మీదుగా అందించడం జరిగింది. త్వరలో 18 సంవత్సరాలు దాటిన ఆధార్ లేని పెద్ద వాళ్ళకి కూడా లేట్ బర్త్‌సర్టిఫికేట్ వచ్చేలా ప్రయత్నాలు చేస్తానని తహాశీల్దార్ భరోసాఇచ్చారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటగిరి సంజీవరావు, బాపట్ల జిల్లా యానాది సమాఖ్య ఉపాధ్యక్షులు గంధళ్ళనరేష్, కొనిజేటి నగర్ ప్రెసిడెంట్ పొట్లూరి శ్రీను, లబ్దిదారులు పాల్గొన్నారు.




**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ఆర్ఏసిపిసి, డోర్ నెం.26-1-52, కన్నావారితోట, గుంటూరు-522004

**సంక్షిప్త డిమాండ్ నోటీసు**

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ వెల్లలచెరువు హనుమంతరావు, తండ్రి: ఆది శేషయ్య, డోర్ నెం.5-214, కొమ్మినేనివారిపాలెం గ్రామం, వల్లపల్లి పోస్ట్, బల్లికురవ మండలం, ప్రకాశం జిల్లా - 523260. వేరొక చిరునామా: డోర్ నెం.125 - 2, ఫ్లాట్ నెం.501 & 502, "రితీష్ హైట్స్ బి-బ్లాక్", St.Anns ఉమెన్స్ కాలేజ్ వెనుక వైపు, గోర్లవారిపాలెం డొంక, గోరంట్ల, గుంటూరు - 522034.

II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: 1. హౌసింగ్ లోన్ : 38285984225, 2. ఎస్‌బిఐ సురక్ష : 38287657230, 3. హౌసింగ్ లోన్ : 38635275860.

III) చెల్లించవలసిన బాకీ మొత్తము: తేది.05-12-2024 నాటికి రూ.46,31,302/- (అక్షరాల నలభై ఆరు లక్షల ముప్పై ఒక్క వేల మూడు వందల రెండు రూపాయలు మాత్రమే) + కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.

IV) డిమాండ్ నోటీసు తేది : 05-12-2024 ఎన్‌పిఏ తేది: 04-12-2024

V) ఆస్తి వివరములు: 1. శ్రీ వెల్లలచెరువు హనుమంతరావు, తండ్రి : ఆది శేషయ్య గారికి చెందిన ఆస్తి : షెడ్యూలు-ఎ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్-డిస్ట్రిక్ట్, పూర్వపు గోరంట్ల గ్రామ పంచాయితీ, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గోరంట్ల గ్రామ డి.నెం.471 లోని ఎ.11.38 సెంట్లు విస్తీర్ణం గల భూమి, దీనిలో ఎ.0.50 సెంట్లు విస్తీర్ణం గల భూమి, దీనిలో ప్లాట్ నెం.267డి, 267సి, 267బి లోని 504 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన "రితీష్ హైట్స్ బి-బ్లాక్" అను పేరు గల అపార్ట్‌మెంట్‌నకు హద్దులు: తూర్పు : 40 అ॥ల వెడల్పు రోడ్డు - 73'0", దక్షిణం : ప్లాట్ నెం.267బి లోని ఆస్తి - 64'3", పడమర : ఇతరులకు చెందిన ప్లాట్ల ఆస్తి - 73'0", ఉత్తరం : ప్లాట్ నెం.267ఇ లోని ఆస్తి - 60'0".

ఈ హద్దులలోని విస్తీర్ణం 504 చ॥గ॥లు లేదా 421.40 చ॥మీ॥ల స్థలం, దీనిలో షెడ్యూలు-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తి మొత్తం విస్తీర్ణం 504 చ॥గ॥లలోని 56.4 చ॥గ॥లు లేదా 47.15 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "రితీష్ హైట్స్ బి-బ్లాక్", నాల్గవ అంతస్తు నందు 1500 చ॥అ॥లు ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన తెలిపిన వాటా స్థలం మొత్తం నిర్మాణం నందు కామన్ మరియు ఉమ్మడి హక్కులు మరియు ఎమినిటీస్, కామన్ పార్కింగ్ మరియు ఒక కార్ పార్కింగ్ సౌకర్యంతో గల నివాస ఫ్లాట్ నెం.501. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: కామన్ కారిడార్.

(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1069/2019, తేది.08-03-2019 ప్రకారం)

2. శ్రీ వెల్లలచెరువు హనుమంతరావు, తండ్రి : ఆది శేషయ్య గారికి చెందిన ఆస్తి : షెడ్యూలు-ఎ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్-డిస్ట్రిక్ట్, పూర్వపు గోరంట్ల గ్రామ పంచాయితీ, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గోరంట్ల గ్రామ డి.నెం.471 లోని ఎ.11.38 సెంట్లు విస్తీర్ణం గల భూమి, దీనిలో ఎ.0.50 సెంట్లు విస్తీర్ణం గల భూమి, దీనిలో ప్లాట్ నెం.267డి, 267సి, 267బి లోని 504 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన "రితీష్ హైట్స్ బి-బ్లాక్" అను పేరు గల అపార్ట్‌మెంట్‌నకు హద్దులు: తూర్పు : 40 అ॥ల వెడల్పు రోడ్డు - 73'0", దక్షిణం : ప్లాట్ నెం.267బి లోని ఆస్తి - 64'3", పడమర : ఇతరులకు చెందిన ప్లాట్ల ఆస్తి - 73'0", ఉత్తరం : ప్లాట్ నెం.267ఇ లోని ఆస్తి - 60'0".

ఈ హద్దులలోని విస్తీర్ణం 504 చ॥గ॥లు లేదా 421.40 చ॥మీ॥ల స్థలం, దీనిలో షెడ్యూలు-బి: పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తి మొత్తం విస్తీర్ణం 504 చ॥గ॥లలోని 44.4 చ॥గ॥లు లేదా 37.12 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "రితీష్ హైట్స్ బి-బ్లాక్", నాల్గవ అంతస్తు నందు 1250 చ॥అ॥లు ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన తెలిపిన వాటా స్థలం మొత్తం నిర్మాణం నందు కామన్ మరియు ఉమ్మడి హక్కులు మరియు ఎమినిటీస్, కామన్ పార్కింగ్ మరియు ఒక కార్ పార్కింగ్ సౌకర్యంతో గల నివాస ఫ్లాట్ నెం.502. హద్దులు: తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం: కామన్ కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై

(సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3540/2019, తేది.09-08-2019 ప్రకారం)

పైన చెప్పబడిన ఋణగ్రహీత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎ.టి. అగ్రహారం బ్రాంచ్ (20715), గుంటూరు వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనల ననుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణింపబడినది. బ్యాంకు వారు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీ చేయడమగుచున్నది. కావున సదరు ఋణగ్రహీత పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 09-01-2025 అధీకృత అధికారి

ప్రదేశం : గుంటూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# యుద్ధంతోకాదు బౌద్ధంతోనే భవిష్యత్తు

## ఒడిశా ప్రవాసీ దివస్‌లో ప్రధానిమోడీ




**భువనేశ్వర్, జనవరి 9:** మానవాళి భవిష్యత్తు యుద్ధంలో లేదని బుద్ధుడిలో ఉందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవకార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒడిశాలో అడుగడుగునా సంస్కృతి సాంప్రదాయాల వారసత్వం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడినుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా వంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని గుర్తుచేసారు. భారత్‌ప్రజాస్వామ్యానికికేవలం తల్లి వంటిది మాత్రమే కాదని మన జీవితాల్లో భాగం అన్నారు. విదేశాల్లో జీవించేవారు భారత్‌కు రాయబారులుగా నేనుచూస్తానని, భారత్‌నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలాచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. జీ20 సందర్భంగా దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహించి భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేసామని మన వారసత్వ విభిన్న సంస్కృతులను ప్రపంచం గమనిస్తోందని భారత్‌స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులుకూడా తోడ్పాటునిచ్చారని మోడీ అన్నారు. వచ్చే ఏడాది ప్రవాసీ దివస్‌కు వచ్చే భారతీయులు కనీసం ఐదుగురు విదేశీ మిత్రులను తమతో తీసుకురావాలని, భారత్‌కేవలం యువదేశమే కాదు నిపుణులైన యువకుల దేశం అని భారత్‌కు విశ్వబంధుగా గుర్తింపు ఉందన్నారు. దానిని మరింత బలోపేతం చేయాలని ప్రధానిమోడీ ప్రవాస భారతీయులకు పిలుపునిచ్చారు.

మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు వంటి పండుగల సీజన్‌లోప్రవాస భారతీయ వేడుకలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీనే కార్ల్ విడియోసందేశం పంపించారు. ఆమె భారత్‌పురోగతిని కొనియాడారు. రష్యా, ఇజ్రాయెల్ పేర్లను ప్రస్తావించకుండా భవిష్యత్తు అంతా యుద్ధం కాదని బుద్ధుడిబోధనలతోనే శాంతి సామరస్య ప్రపంచం ఏర్పడుతుందని ప్రధాని అన్నారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు అవకాశం ఉన్నా బౌద్ధం స్వీకరించారని గుర్తుచేసారు. మోడీ ప్రవాసిభారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును భువనేశ్వర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. విదేశాంగమంత్రి జైశంకర్, ఒడిశా సీఎం మోహన్‌చరణ్‌మాఝీ తదితరులు పాల్గొన్నారు.



## భారత్ ప్రజాస్వామ్య విలువలు విశ్వసిస్తున్న బ్రిటన్

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**లండన్, జనవరి 9:** భారత దేశప్రజాస్వామ్య విలువలను, అభివృద్ధిని యుకే బలంగా విశ్వసిస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. యూకే పర్యటనకువెళ్లిన ఆయన లండన్‌లోని హైకమిషన్‌లో జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ప్రముఖ యుకె పార్లమెంటేరియన్లతో సంభాషించారు. వారికి భారత ప్రజాస్వామ్య విలువలు వృద్ధిపై వలమైన నమ్మకం ఉంది. ఇటీవల భారత్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని మరింత బలోపేతంచేసేందుకు దోహదంచేసిందని అన్నారు. ప్రపంచంలోని అతిపెద్దప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌ను ప్రజాస్వామ్య మాతృమూర్తిగా కీర్తిస్తున్నందుకు గర్వంగా ఉందని అన్నారు.రానున్న రోజుల్లో అభివృద్ధిలో భారత్ ఇతర దేశాలను అధిగమిస్తుందని,ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు వికసిత్ భారత్‌కోసం సహకారం అందిస్తున్నారన్నారు. ప్రధానిమోడీ నిర్దేశించిన ఈ లక్ష్యం దిశగాప్రవాసులుచేస్తున్న కృషి కీలక పాత్రపోషిస్తుందన్నారు. యుకెభారత్ ద్వైపాక్షిక సంబందాలు మరింత బలోపేతం కావాలని ఓం బిర్లా అన్నారు. సుమారు 17 ఏళ్లతర్వాత లోక్‌సభ స్పీకర్ యునైటెడ్ కింగ్‌డమ్‌లోపర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలోభాగంగా యుకె హౌస్‌ఆఫ్‌కామన్స్ స్పీకర్ లిండ్సే హోయ్‌లతో ఆయన సమావేశం అయి చర్చలుజరిపారు.



## మా ‘ఎమర్జెన్సీ’ సినిమా చూడాలని ప్రియాంకను కోరా..

### నటి కంగనా రనౌత్

**న్యూఢిల్లీ, జనవరి 9:** కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలో తాను గమనించిన విషయాలను కంగనా రనౌత్ వెల్లడించారు. తాను నటించిన ఎమర్జెన్సీ చిత్రాన్ని వీక్షించాలని ఈ ఇద్దరు నేతలను కంగన కలిసిన సంగతి తెలిసిందే. తొలినుంచి రాహుల్‌గాంధీని కంగన విమర్శిస్తూనే ఉన్నారు. ఇక తన సినిమాను వీక్షించేందుకు రాహుల్‌ను ఆహ్వానించేందుకు వెళ్లగా ఆయన అంత మర్యాదగా వ్యవహరించలేదని వ్యాఖ్యానించారు. అదే ప్రియాంక విషయంలో మాత్రం భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె చిరునవ్వుతో పలకరించి మాట్లాడారు. ఆ సంభాషణ నాకు గుర్తుండిపోతుంది. ఆమె తన సోదరుడిలా కాదు. తెలివైనది. ప్రియాంకతో మాట్లాడటాన్ని నేను ఎంజాయ్ చేశాను అని మీడియాతో మాట్లాడారు. ఇంతకుముందు కూడా ఇదే విషయమై కంగన మాట్లాడిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌లో ప్రియాంకని కలిసినప్పుడు మా ఎమర్జెన్సీ చిత్రాన్ని తప్పకుండా వీక్షించాలని కోరగా, ప్రయత్నిస్తానని ఆమె బదులిచ్చారు. ఈ సినిమా ఆమెకు తప్పకుండా నచ్చుతుందని తెలియజేశా. ఎమర్జెన్సీ అనేది ఎంతో సున్నితమైన అంశం. ఇందిరాగాంధీ పాత్రను ఎంతో మర్యాదపూర్వకంగా చూపించా. రీసెర్చ్ సమయంలో ఎన్నో విషయాలు గ్రహించా. ఇందిరా గాంధీకి తన భర్త, పిల్లలు, స్నేహితులతో ఉన్న అనుబంధం గురించి తెలుసుకున్నా. శత్రువులతో ఎలా వ్యవహరించేవారో అర్థం చేసుకున్నా. ఆ విషయాలను ఎక్కడా టచ్ చేయకుండా ఉండేందుకు కావాల్సిని అన్న జాగ్రత్తలు తీసుకున్నా అని కంగనా తెలిపారు. తాజాగా ఆ పార్లమెంట్ సంభాషణే మరోసారి ప్రస్తావించారు. ఎమర్జెన్సీ చిత్రాన్ని థియేటర్‌లో విడుదల చేయాలనుకోవడం తన పొరపాటని, డైరెక్ట్‌గా ఓటిటిలో విడుదల చేసుంటే పరిస్థితి మరోలా ఉండేదని కంగనా అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం ఎమర్జెన్సీ. కంగనా రనౌత్ కథానాయిక. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో తమని తక్కువగా చూపించారని విడుదలను అడ్డుకోవాలని ఒక వర్గం మధ్యప్రదేశ్ న్యాయస్థానాన్ని సంప్రదించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు వారి వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సూచించింది.

## ఇంటికి ఆహ్వానించి తాళం చెవి మరిచిన మహిళ..

### కాఫీషాప్‌లో రాహుల్‌కు ఎదురైన ఆసక్తికర ఘటన..

**న్యూఢిల్లీ, జనవరి 9:** కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రజలతో మమేకమయ్యే ఏ సందర్భాన్ని వదులుకోరు. ఇటీవల ఆయన ఓ ప్రముఖ కాఫీ షాప్‌కు వెళ్లి యాజమాన్యంతో ముచ్చటించారు. వారి వ్యాపారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కస్టమర్లను పలకరించారు. ఇందుకు సంబంధించి రాహుల్ చేసిన దృశ్యాల్లో ఓ సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ షాప్‌లో రాహుల్ స్వయంగా కోల్డ్ కాఫీ తయారుచేశారు. తర్వాత అక్కడున్న ఓ వృద్ధురాలు రాహుల్‌ను ఇంటికి ఆహ్వానించింది. ఆమె అదే భవనంలో నివాసం ఉంటున్నారు.

ఆమె ఆహ్వానంతో రాహుల్ ఇంటివద్దకు వెళ్లగా సదరు మహిళ ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నారు. రాహుల్‌నైతే పిలిచారు కానీ ఇంటి తాళం చెవిలేదన్న విషయాన్ని మరిచిపోయారు. తాళం చెవి కోసం హైరానా పడ్డారు. ఆమె పరిస్థితి అర్థం చేసుకుని రాహుల్ వారితో ఫొటోలు దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# ఇండియా కూటమిని మూసేయడం మేలు!

## జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ, జనవరి 9:** అజెండాలో స్పష్టతలేని విధంగా ఎవరికివారు వ్యవహరిస్తున్నట్లయితే ఇండియా కూటమిని రద్దుచేయడం మేలు అని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై మీడియా సంధించిన ప్రశ్నలపై ఆయన జవాబిస్తూ ఢిల్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ ఉన్నదని ఆసక్తికరంగా ఆప్ కాంగ్రెస్ పార్టీలు గత లోక్‌సభ ఎన్నికలకు టై అప్ పెట్టుకున్నాయని, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఎవరికి వారు పోటీచేస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిణామాల్లో అసలు ఇండియా కూటమి దేనికున్నట్లు రద్దుచేయడమే మేలని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి నాపాత్ర ఏమీ ఉండదని, ఆప్ కాంగ్రెస్ ఇతర పార్టీలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్నాయని బిజెపిని తుదముట్టించే ప్రక్రియలో ఇండియా కూటమి ఢిల్లీలో కీలక పాత్రలో లేదనే తెలుస్తోందని అన్నారు. దురదృష్టంకొద్దీ ఇండియా కూటమి నిర్వహించినా నాయకత్వం,అ జెండా మనుగడపై ఎలాంటి స్పష్టత లేదని కేవలం పార్లమెంటు ఎన్నికల కోసమే అయితే ఆ కూటమిని రద్దుచేయడం మేలు అని ఒమర్ వ్యాఖ్యలుచేసారు. గడచిన కొన్ని వారాలుగా ఆప్ కాంగ్రెస్‌లు ఒకరిపై ఒకరు విమర్శలుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్ పార్టీ అవినీతి, అధ్వాన్నపరిపాలనతో కొనసాగుతోందని విమర్శిస్తే ఆప్ కాంగ్రెస్ బిజెపిచేతిలో పావుగా మారిందని విమర్శించింది. ఇండియా కూటమి నాయకత్వం భవిష్యత్తుపై ఇపుడు తీవ్ర స్థాయిలో సందిగ్ధత నెలకన్నదని సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి కార్యకలాపాలు పూర్తిగా స్పష్టత లేకుండా పోయాయని ఒమర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం మాత్రమే ఇండియా కూటమికి నేతృత్వం వహించాలని, టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ ఇప్పటికే స్వచ్ఛందంగా ఆఫర్ ఇచ్చినందున కూటమిలోని ఎక్కువ పార్టీలు ఆమెకే మద్దతు పలికినందున ఆమెకు అవకావం ఇవ్వాలన్న డిమాండ్‌కూడా వచ్చింది. ఒమర్ కూడా ఆమెకే వత్తాసుపలికారు. అంతకుముందు అబ్దుల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వం తమకే ఉండాలన్న మంకుపట్టుతో ఉండకూడదని అన్నారు. పార్లమెంటులో ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్నందున రాజ్యసభ, లోక్‌సభల్లో కూడా ప్రతిపక్ష నేత బాధ్యతలు కూడా స్వీకరిస్తున్నందున కూటమికివేరొకరి నాయకత్వం అవసరం అవుతుందని, స్వచ్ఛందంగా మరొకరికి పదవిని అప్పగించడమే సముచితమని ఆయన అన్నారు. ఢిల్లీఎన్నికల్లోనే కూటమి వైఖరి స్పష్టం అవుతున్నందున ఏది ఎలాసాగాలో అలా సాగుతుందని భావించడంకంటే కూటమిని రద్దుచేయడమేమేలని, పార్లమెంటు ఎన్నికలవరకే పరిమితమా లేక కొనసాగుతుందా అన్నది స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఒమర్ అన్నారు.

# కోటలో ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు

### తాజాగా ఎంపికి చెందిన గుణ విద్యార్థి గదిలో ఆత్మహత్య

### పరీక్షల ఒత్తిడే ఆత్మహత్యలకు కారణమంటున్న పోలీసులు


**కోట(రాజస్థాన్), జనవరి 9:** కోచింగ్ కేంద్రాల హబ్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని కోటలో మరో 20 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జెఇఇకి సన్నద్ధం అయ్యేందుకు వచ్చిన ఈ విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. రెండురోజుల ముందే జెఇఇ అభ్యర్థి మరొకరు 19 ఏళ్ల విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరివేసుకుని చనిపోయినట్లు తేల్చారు. 20 ఏళ్ల అభిషేక్ లోధా తనవద్ద ఒక లేఖను ఉంచి మరీ చనిపోయాడు. జెఇఇని తాను క్లియర్ చేయలేనని ఆలేఖలో తననిస్సహాయతను వ్యక్తం చేసాడు. దేశంలోని టాప్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదవాలంటే జెఇఇని క్లియర్‌చేసుకోవాలన్నది తెలిసిందే. తాను చదవలేకపోతున్నానని, జెఇఇ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా తన వల్ల కావడంలేదని సారీఅని ఆ నోట్‌లో స్పష్టంచేసాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ ప్రాంతా నికి చెందిన లోథా గత మేనెలలోనే జెఇఇకి సిద్ధం అయ్యేందుకు వచ్చాడు. చదువుపరంగా టాపర్ అయిన లోథా తనంతతానే కోటకు కోచింగ్‌కోసం వచ్చాడని చాలా బాగుందని, తాను నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పేవాడని ముందు రోజు సాయంత్రమే తాను వాడితో మాట్లాడానని లోథా మేనమామ చెప్పాడు. పరీక్షల ఒత్తిడికి తట్టుకోలేకనే ఆత్మహత్యచేసుకున్నట్లుగా పోలీసులు కూడా అనుమానిస్తున్నారు. పిజి అకామిడేషన్ రూమ్‌లలో యాంటిహ్యాంగింగ్ పరికరాలను ఫ్యాన్‌కు అమర్చలేదని ఇదేవిషయమై యాజమాన్యాన్ని కూడా పిలుస్తున్నట్లు విజ్ఞాన్‌నగర్ ఇన్‌ఛార్జి ముకేష్ మీనా అన్నారు. అలాగే హర్యానాలోని మహేంద్రఘర్‌కు చెందిన నీరజ్ అనే విద్యార్థికూడా గదిలోని సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. అందువల్లనే యాంటి హ్యాంగింగ్ డివైస్‌లు ఏర్పాటుచేయాలనిముందే చెప్పామని ఎస్‌హెచ్‌ఒ చెపుతున్నారు. నీరజ్ తండ్రి బబ్లూప్రజాపత్ మాట్లాడుతూ మధ్యాహ్నామే తనకొడుకుతో మాట్లాడానని సాయంత్రం ట్రైన్‌కు వస్తానని కూడా నీరజ్ చెప్పాడని తన చిన్నకొడుకు కూడా నీట్ సన్నద్ధంకోసం కోటలోనే ఉన్నాడని ఆతడు మెడికల్ ఎంట్రన్స్‌కోసం చదువుతున్నట్లు చెప్పాడు. కేసులో నిష్పాక్షిక విచారణ చేయాలని ప్రజాపత్ డిమాండ్‌చేసారు.

## ఢిల్లీ జాట్‌లను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాల్సిందే: కేజ్రీవాల్ డిమాండ్

**న్యూఢిల్లీ, జనవరి 9:** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయపార్టీలు పలు డిమాండ్లు పెడుతున్నాయి. పలు హామీలు కూడా కుమ్మరిస్తున్నాయి. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ గురువారం తన ప్రచారంలో భాగంగా ఢిల్లీలో నివసిస్తున్న జాట్ కులస్తులకు రిజర్వేషన్ అమలుచేయాలని కేంద్రం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేసారు. ప్రధాని మోడీకి ఇదే విషయమై లేఖను రాస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ఒబిసి కులాల జాబితాలో ఢిల్లీ జాట్‌కులాన్ని కూడా చేర్చాలని ఆయన డిమాండ్ చేసారు. 2015లో బిజెపి జాట్ నేతలను ప్రధానినివాసానికి పిలిపించుకుని వారిని ఒబిసి జాబితాలో చేరుస్తామని కూడా హామీ ఇచ్చారని గుర్తుచేసారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇదే మాటను 2019నుంచి చెపుతూనే వస్తున్నారని ఇప్పటివరకూ ఎలాంటి హామీ నిలబెట్టుకోలేదని అన్నారు. రాజస్థాన్‌లోని జాట్ విద్యార్థులు రిజర్వేషన్లనుంచి లబ్దిపొందుతున్నారని, ఢిల్లీలో ఉన్న జాట్ విద్యార్థులు మాత్రం లబ్దిపొందలేక పోతున్నారన్నారు. వేలాదిగా ఢిల్లీలోని జాట్ పిల్లలు ఢిల్లీయూనివర్సిటీలో అడ్మిషన్ పొందలేక పోతున్నారని, ఇతర రాష్ట్రాల్లో ఒబిసి కేటగిరీ కింద లబ్దిపొందుతున్నవిద్యార్థులు అదే ఢిల్లీలోని జాట్ విద్యార్థులకు మాత్రం కేంద్రం తిరస్కరిస్తోందని ఆరోపించారు.

## లెబనాన్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బాంబింగ్‌కు ఇజ్రాయెల్ ప్రణాళిక!




**బీరుట్, జనవరి 9:** ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు మిలియన్‌ల డాలర్లు అందకుండా చేసేందుకు ఇజ్రాయెల్ దళాలు ఏకంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయం పైనే బాంబింగ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించారట. ఈ విషయాన్ని సౌదీ అరేబియా ప్రభుత్వరంగ ఛానల్ ‘అల్ అరేబియా’ కథనంలో పేర్కొంది. వాస్తవానికి గత గురువారం ఇరాన్ మిలియన్ల డాలర్ల సొమ్మును హెజ్‌బొల్లాకు అందజేసేందుకు ప్లాన్ చేసినట్లు సౌదీ ప్రతిక అల్ హదాత్ పేర్కొంది. టెహ్రాన్ నుంచి డబ్బు తీసుకెళ్లేందుకు ‘మహన్ ఎయిర్’ విమానం వినియోగించాలని వ్యూహరచన చేసింది. ఈ విషయం లెబనాన్‌కు తెలిసింది. ఆ మర్నాడే కొందరు ఇరాన్ అధికారులు మహన్ ఎయిర్ ఫ్లయిట్‌లో బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. వెంటనే విమానం మొత్తాన్ని భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. వారి లగేజీని తనిఖీ చేయడానికి లెబనాన్ భద్రతాధికారులు ప్రయత్నించగా.. ఇరాన్ అధికారులు ప్రతిఘటించారు. కానీ, లెబనాన్ సిబ్బంది మాత్రం తనిఖీలు చేసి కొన్ని అనుమానాస్పదమైనవి, సొమ్ములను స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై ఆ విమానంలో వచ్చిన ఇరాన్ దౌత్య ప్రతినిధి మాట్లాడుతూ.. తమ బ్యాగుల్లో కొన్ని పత్రాలు, ఎంబసీ నిర్వహణ ఖర్చులకు చెల్లించేందుకు సొమ్ములు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు లెబనాన్ మంత్రి బస్సమ్ మలావి మాత్రం ఆ రోజుసాయంత్రం వరకు ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ప్రతి ఒక్కరికి తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. నగదు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుపై బాంబింగ్ ప్లాన్‌ను ఇజ్రాయెల్ పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

అక్టోబరు 2024 నుంచి లెబనాన్ సైన్యమే స్వయంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు చేస్తోంది. గతంలో ఈ ఎయిర్‌పోర్టును హెజ్‌బొల్లా అధీనంలో పెట్టుకుని ఆయుధాలు, నగదు స్మగ్లింగ్‌కు వాడుకొంటోందని చాలామంది రాజకీయ నాయకులు కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నారు.

**లెబనాన్‌లో అధ్యక్ష ఎన్నిక..**

లెబనాన్ పార్లమెంట్‌లో అధ్యక్ష ఎన్నిక ప్రయత్నాలు జోరందుకొన్నాయి. మాజీ అధ్యక్షుడు మైఖేల్ ఔన్ స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకోవడానికి గత రెండేళ్లలో 12 సార్లు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఆర్మీ కమాండర్ జోసఫ్ ఔన్ ముందంజలో ఉన్నారు. అమెరికా, సౌదీకి అత్యంత సన్నిహితుడిగా అతడికి పేరుంది. ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధం నుంచి కోలుకొని దేశ పునర్నిర్మాణం చేయాలంటే అతడి ఎంపిక చాలా అవసరం ఉంది.





## మేము కూడా ‘మెక్సికన్ అమెరికా’ అనొచ్చు కదా!

### డొనాల్డ్ ట్రంప్‌కు మెక్సికో అధ్యక్షురాలి కౌంటర్

**మెక్సికో సిటీ, జనవరి 9:** అగ్రరాజ్య అధ్యక్ష బాధ్యతలను రెండోసారి చేపట్టేందుకు సిద్ధమవుతున్న డొనాల్డ్ ట్రంప్.. ప్రమాణస్వీరానికి ముందే పొరుగు దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కెనడా, గ్రాన్‌లాండ్, పనామా కాలువలను విలీనం చేకుంటామన్న ట్రంప్.. గల్ఫ్ ఆఫ్ మెక్సికోను ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా’గా మారుస్తానని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ స్పందిస్తూ.. అమెరికాకు కాబోయే అధ్యక్షుడికి గట్టి కౌంటర్ ఇచ్చారు. యుఎస్‌ను తామెందుకు ‘మెక్సికన్ అమెరికా’ అని పిలవకూడదంటూ చురకలంటించారు.

బుధవారం (స్థానిక కాలమానం ప్రకారం) మీడియా సమావేశంలో మాట్లాడిన క్లాడియా.. 17వ శతాబ్దం నాటి ప్రపంచపటాన్ని చూపించారు. అప్పట్లో ఉత్తర అమెరికాను ‘మెక్సికన్ అమెరికా’ అని పేర్కొనే వారనే విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికోను ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్న విషయాన్ని మర్చిపోవద్దు (పరోక్షంగా ట్రంప్‌ను ఉద్దేశిస్తూ) మనమెందుకు యునైటెడ్ స్టేట్స్‌ను ‘మెక్సికన్ అమెరికా’ అని పిలవకూడదు. ఇది వినడానికి చాలా బాగుంది కదా..? ఆయన (ట్రంప్) పేరు గురించి మాట్లాడారు. మేమూ దాని గురించే చెబుతున్నాం’ అని మెక్సికో అధ్యక్షురాలు వ్యాఖ్యానించారు. అమెరికాకు కొత్త అధ్యక్షుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు ఉండాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

జనవరి 20న ట్రంప్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. అయితే, గత కొద్ది రోజులగా ఆయన తనలోని విస్తరణ కాంక్షను కాంక్షను బయటపెడుతున్నారు.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చాలని అనుకుంటున్నా. అదే సరైంది కూడా..! లక్షలాది మంది మా దేశంలోకి అక్రమంగా ప్రవేశించకుండా మెక్సికో అడ్డుకోవాలి. ఆ దేశాన్ని మాదకద్రవ్యాల ముఠాలు నడిపిస్తున్నాయి’ అని దుయ్యబట్టారు. అంతకుముందు కూడా ఈ అంశంపై ట్రంప్ మాట్లాడుతూ.. అక్రమవలసదారులు, డ్రగ్స్ రవాణాను అడ్డుకోకపోతే.. మెక్సికోపై టారిఫ్‌లు కఠినంగా విధిస్తామని హెచ్చరించారు.

## బీహార్‌లో సంక్రాంతి తర్వాత కేబినెట్ విస్తరణ

### ఆరుగురికి చోటు కల్పించేందుకు సిఎం నితీశ్ కసరత్తు

**పాట్నా, జనవరి 9:** సంక్రాంతి తర్వాతకేబినెట్ విస్తరణ ఉంటుందని బీహార్ సిఎం నితీశ్‌కుమార్ సంకేతాలు వదిలారు. దీనితో ఆశావహుల్లో మరింతగా ఉత్కంఠపెరిగింది. పార్టీలోను, కూటమిలోను పెరుగుతున్న అసంతృప్తిని అధిగమించేందుకు నితీశ్ కేబినెట్‌ను విస్తరించాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది ఎటూ ఎన్నికలకు వెళ్లాల్సి ఉన్నందున ఈలోపే కేబినెట్‌ను విస్తరించే అవకాశం ఉందని ఆయన పార్టీనేతలు చెపుతున్నారు. కూటమిలో బిజెపికిసైతం స్థానాలు కల్పించాల్సిన అవసరం ఉంది. బిజెపి కోటానుంచిఉన్న నలుగురు ఎమ్మెల్యేలనుమంత్రులుగా కేబినెట్‌లోకి చేర్చుకోవచ్చు. ప్రస్తుతం 50 మంది మంత్రులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి, ఇద్దరు డిప్యూటీ సీఎంలతో సహా కేబినెట్ 30కి పరిమితం అయింది. గత కేబినెట్ 2024 మార్చి 15న ఏర్పాటయింది. 21 మంది మంత్రులతో ఏర్పాటయింది. తొమ్మిది మంది జెడియు, 12 మంది బిజెపినుంచి ఎన్నికయ్యారు. కొత్త ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన 46 రోజుల తర్వాత మంత్రివర్గం ఏర్పాటయింది. 243 మందిసభ్యులున్న అసెంబ్లీలో మొత్తం 36 మందివరకూ మంత్రివర్గ సభ్యులు ఉండవచ్చని రాజ్యాంగం చెపుతోంది. అనేక మంత్రి బిజెపి మంత్రులు ఇప్పటికే అదనపుబాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్తకేబినెట్‌కూర్పుతో వీరందరికీ కొంత విరామం ఇవ్వడంతోపాటు కొత్తవారికి ఛాన్స్ ఇచ్చినట్లవుతుందని అంచనా. వచ్చే ఏడాది అక్టోబరు,నవంబరు మాసాల్లోనే అసెంబ్లీ ఎన్నికలకు వెళుతున్న సందర్భంలో కొత్తవారిని చేర్చుకోవడంద్వారా వారికి శాఖలను కేటాయించి అసంతృప్తిని బుజ్జగించవచ్చని నితీశ్‌కుమార్ యోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈనెల 30వ తేదీలోపు కేబినెట్ విస్తరణ చేపట్టాలని ప్రతిపాదిస్తామని బిజెపినేతలు చెపుతున్నారు. గరిష్టంగా ఆరుగురు కొత్తమంత్రులు కేబినెట్‌లోకి వస్తున్నారు. కొత్తముఖాలుకూడా ఉంటాయన్న అంచనాలున్నాయి. అలాగే మంత్రివర్గ శాఖలను కూడా ప్రక్షాళన చేస్తారని మరో బిజెపినేత చెపుతున్నారు. కొంతమందిమంత్రులను కేబినెట్ నుంచి తప్పించే అవకాశం కూడా లేకపోలేదని, మంత్రుల పనితీరు అధ్వాన్నంగా ఉన్నందున వారిని తప్పించి కొత్తవారికి అవకాశం ఇస్తారని బిజెపినేతలు పేర్కొంటున్నారు. మార్చిన మంత్రులను వారి సామాజికవర్గాలనేతలతోనే భర్తీచేస్తారని అంచనా. జనవరి 15లోపే కేబినెట్ విస్తరించేందుకు నితీష్ ఆలోచనచేస్తున్నట్లు జెడియు నేతలు స్పష్టంచేస్తున్నారు. 30వ తేదీలోపు కేబినెట్ విస్తరిస్తే ఫిబ్రవరిలో ఎటూ బడ్జెట్ సమావేశాలు ఉంటాయి. సారన్, తిర్హట్, పాట్నా డివిజన్లనుంచి ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ లాబీయింగ్‌ను ముమ్మరంచేసారు. కేబినెట్ బెర్త్‌లు కావాలంటూ రాయబేరాలు పంపిస్తున్నట్లు పార్టీనేతల్లోనే గుసగుసలు పెరిగిపోయాయి.

## చెన్నై జాతీయ రహదారిపై ప్రమాదం

### 4గురు మృతి, 44 మందికి తీవ్రగాయాలు


**చెన్నై,జనవరి 9:** చెన్నై బెంగళూరు హైవేపై ప్రయాణీకులతో వెళుతున్న కర్ణాటక బస్సు ప్రైవేటు టిప్పర్ లారీని ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు చనిపోగా బస్సులో ఉన్న 44 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రాణిపేట్ జిల్లాలోని సిప్‌కాట్ ఎమరాల్డ్ నగర్‌వద్ద ఉన్న జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు ఝామున ప్రమాదం జరిగింది. మృతులు ఎన్‌సోమశేఖరన్(30), వి.మంజునాథ్(31), సి.శంకర(32), వి.కృష్ణప్ప(65)లు కోలార్ జిల్లాకు చెందినవారని వీరంతా బస్సులో మేలమరువత్తూరులో ఉన్న ఆదిపరాశక్తి దేవాలయంలో అమ్మదర్శనం అనంతరం తిరిగి వెళుతున్న సందర్భంగా ఈ ప్రమాదంలోచనిపోయారు. హైవేపై బస్సులు ఓవర్‌టేక్‌చేసుకుంటూ ఒకదానికి మించి ఒకటి వెళ్లాయని, ఈక్రమంలో అటుగా వస్తున్న ప్రైవేటు టిప్పర్ లారీని ఢీకొనడంతో నలుగురు మృతిచెందిన 44 మంది గాయాలపాలయ్యారన్నరు. క్షతగాత్రులను వలాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరందరినీ వెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, క్రిస్టియన్‌మెడికల్ కళాశాల ఆసుపత్రిలోకూడా కొందరికి చికిత్స జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# త్వరలో విశాఖ రైల్వేజోన్ అధికారిక కార్యకలాపాలు

## - ఏ క్షణంలోనైనా రైల్వే బోర్డు ఆదేశాలు - విశాఖలో పనిచేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు అధికార ప్రతినిధి వెల్లడి

**గుంతకల్లు రైల్వే,జనవరి 9,ప్రభాతవార్త :** భారతీయ రైల్వేలో కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో అధికారిక కార్యకలాపాలు ఏ క్షణంలో నుంచి అయిన ప్రారంభం అయ్యే అవకాశాలు న్నాయి. విశాఖ రైల్వే జోనల్ కేంద్రంలో పనిచేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు అధికార ప్రతినిధి వెల్లడించారు. రాష్ట్ర పున:ర్విభజన చట్టం-2014ప్రకారం కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను పది సంవత్సరాల ఆలస్యంతో ఎట్టకేలకు ప్రారంభించేందుకు నిర్ణయించడం, ఇందులో రూ.149కోట్ల అంచనా వ్యయంతో జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బుధవారం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. విశాఖపట్నం, విజయవాడ,గుంటూరు,గుంతకల్లు రైల్వే డివిజన్ లను కలుపుకుని దక్షిణ కోసా రైల్వే జోన్ అందుబాటులోకి రానుంది. ఇందులో భాగంగా రానున్న రెండేళ్లలో శాశ్వత భవన నిర్మాణం పూర్తి అయ్యేవరకు విశాఖలో తాత్కాలికంగా భవనాలను అద్దెకు తీసుకుని కార్యకలాపాలను వెంటనే చేపట్టాలని రైల్వే బోర్డు సూచనాప్రాయంగా నిర్ణయించినట్లు అధికార వర్గాల సమాచారం.

విశాఖ రైల్వే జోన్ నైసర్గిక స్వరూపం : విశాఖ రైల్వే జోన్ పరిధి 3,496కి.మీల వరకు విస్తరించి ఉండగా వీటితో పాటు రన్నింగ్ రైలు మార్గం పొడవు 5,437కి.మీలు, అవసరమయ్యే



విశాఖ రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం

సిబ్బంది 65,800ల మంది,సరుకు రవాణా చేసే ఓడరేవులు : విశాఖపట్నం,గంగావరం, క్రిష్ణ పట్నం, కాకినాడ. ప్రధాన రైల్వే స్టేషన్లు విశాఖ పట్నం,విజయవాడ,తిరుపతి. విద్యుత్ లోకోషెడ్లు విజయవాడ,విశాఖపట్నం,గుంతకల్లులలో విద్యుత్ లోకో షెడ్డులు,డీజిల్ లోకో షెడ్లు విశాఖ,గుత్తి,గుంతకల్లు,విజయవాడలో నాలుగు డీజిల్ షెడ్లు. రైల్వే వర్క్‌షాపులు తిరుపతిలో కోచింగ్ వర్క్‌షాప్,రాయనపాడు,విశాఖలలోని వడ్లపూడిలో రెండు వాగన్ వర్క్‌షాప్ వెరసి మొత్తం మూడు వర్ క్షాపులు, ప్రధాన సరుకు పరీక్ష రవాణా యార్డులు విశాఖపట్నం, కాకినాడ,విజయవాడ,గుత్తి. ప్రధాన కోచింగ్ డిపోలు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, కాకినాడ, నర్సాపూర్, మచిలీపట్నం, గుంటూరు, ట్రాక్‌మిషన్ వర్క్‌షాపులు రాయనపాడులోని సెంట్రల్ పిరియాడికల్ ఓవర్హాలింగ్ వర్క్షాప్, మెమోకార్ షెడ్ రాజ మండ్రి. జోన్‌లో విధుల నిర్వహణకై అవసరమైన గెజిటెడ్ అధికారులు జనరల్ మేనేజర్-1,అదనపు జీఎం/హైయ్యర్ అడ్మిని స్ట్రేటివ్ గ్రేడ్(ప్రిన్సిపల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్-13 మంది అధికారులు,ఎస్ ఏగ్రేడ్- 30మంది అధికారులు,జేఏ గ్రేడ్/ఎస్‌జీ గ్రేడ్ అధికారులు-45మంది,సీనియర్ స్కేల్, జూనియర్ స్కేల్ హోదా కలిగిన అధికారులు మరో 81మంది వెరసి జనరల్ అడ్మినిస్ట్రేష న్,అకౌంట్స్,కమర్షియల్,ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్,ఆ పరేటింగ్,మెకానికల్,మెడికల్,పర్సనల్,ఎస్‌అండ్ టీ,స్టోర్స్,సెక్యూరిటీ విభాగాలకు సంబంధించి మొత్తం 170మంది అధికారులు విధుల నిర్వహణకై కావాలసి ఉంటుంది. అలాగే ఈ విభాగాలలో నాన్-గెజిటెడ్ క్యాడర్‌లో మొత్తం 1200మంది సిబ్బంది అవసరం ఉంది. వీరిలో నాన్ మినిస్టీరియల్(సూపర్‌వైజర్స్,సీనియర్ సెక్షన్ ఇంజనీర్స్,జూనియర్ ఇంజినీర్స్,ఎస్‌ఎస్ ఓట్లు,ఎస్‌ఓలు,అకౌంట్స్ అసిస్టెంట్లు, ఐఎస్‌ఎలు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది 700మంది కాగా మినిస్టీరియల్ స్టాఫ్-380మంది,లెవెల్-1 సిబ్బంది-120మంది అవసరమవుతారు. ఇక డివిజనల్ కేంద్రాలు అక్కడ అవసరమయ్యే సిబ్బందిని ఆప్షన్స్,బదిలీల రూపంలో సర్దుబాటు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో రైల్వే శాఖ ఉన్నట్లు తెలుస్తోంది.



# బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

## - ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది

**కోవూరు,(నెల్లూరు) జనవరి 9 ప్రభాతవార్త :** తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుమంది భక్తులు మృతిచెందడంపై ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె గురువారం ఉదయం హుటాహుటిన తిరుపతికి వెళ్లి పద్మావతి ఆస్పత్రిలో, సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరా మర్శించారు. వారితో ఆమె మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత డాక్టర్లతో చర్చించారు. బాధితుల యోగక్షేమాలపై ఆరా తీసి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆమె వైద్యులకు సూచించారు.ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామని, తప్పకుండా వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 25 లక్షలు పరిహారం ప్రకటించిన విషయమై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించేందుకే ఉద్యోగ మేళాలు

## - ప్రతి ఒక్కరూ ఆర్థికాభివృద్ధి చెందాలి :మంత్రి సత్యకుమార్ యాదవ్



ఉద్యోగ నియామక పత్రాలు అందుకుంటున్న యువత

**శ్రీసత్యసాయిజిల్లా, జనవరి 09, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం పొందాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్ళి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటి వ్యయ ప్రాయాసాలు లేకుండా చేసి యువతకు ఉపాధి కల్పించేందుకే ఉద్యోగ మేళాలునిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం ధర్మవరంలోని సిఎన్‌బి కళ్యాణ మండపంలో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సంస్థ సౌజన్యంతో 99 కంపెనీల ప్రతినిధులతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ జాబ్‌మేళాలో పాల్గొనలేక పోయినందుకు మంత్రి విచారం వ్యక్తం చేస్తూ ఫోన్ ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువతీయువకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం మీకు తక్కువ జీతం వస్తుందని నిరాశ చెందకుండా ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో చేరి మీ స్కిల్స్ పెంపొందించుకోవాలని, తరువాత మీ స్కిల్స్‌ను బట్టి జీతం పెంచడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం జరుగుతుందని, యువత ఒక లక్ష్యసాధన దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్ళాలని, ఈ జాబ్ మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ, వైద్య, విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె సంస్కృతి పేరు మీద ఉన్న సంస్కృతి స్వచ్ఛంధ సేవ సంస్థ ట్రస్ట్ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీయువకులకు అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలుకల్పించాలన్న సంకల్పంతో రాష్ట్రంలోనే ప్రముఖ 99 కంపెనీల ప్రతినిధులతో ఈజాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్ మేళాలో 5121 మంది హాజరుకాగా, 1668 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయాకంపెనీల హెచ్‌ఆర్‌లకు మెమొంటోలు అందించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ మాట్లాడుతూ, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పాత్రాలు అందజేశామని, రాబోయే రోజులలో మరిన్ని ఉద్యోగ అవకాశ్యాలు కల్పిస్తామని తెలియజేశారు. జిఆల్లలో జరుగుతున్న స్కిల్‌హబ్‌లలో ప్రస్తుత టెక్నాలజీతో ఉన్నటువంటి శిక్షణలు అందజేసి ఉపాధి కల్పిస్తామన్నారు.

# గుంటూరులో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

**సచివాలయం, జనవరి 9,ప్రభాతవార్త :** ప్రథమస్వాతంత్ర్య సంగ్రమానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటిష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈనెల 11న రాష్ట్రసా థయిలోనూ మరియు అన్ని జిల్లా కేంద్రాల్లోను అధికార పూర్వకంగా జరుపుతున్నట్లు రాష్ట్ర బిసి ఇడబ్ల్యూఎస్ సంక్షేమం, చేనేత మరియు టెక్స్‌టైల్స్ శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆమె పాత్రికేయులతో మాటా డుతూ సీఎం చంద్రబాబు బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ విశ్వకర్మ,వాల్మీకి కనకదాస జయం తులను ఎంతో ఘనంగా నిర్వహించం జరిగిందన్నారు.అదేవిధంగా మరో బిసి ముద్దుబిడ్డ,స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈనెల 11న గుంటూరు నగరంలోని ఏ1 కన్వెన్షన్ హాల్లో మరియు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఎంతోఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ ఉత్తర్వులను జారీచేయడం జరిగిందన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే తిరుపతిలో తొక్కిసలాట : మాజీ మంత్రి ఆర్‌కె రోజా

## -ప్రజా పాలనను గాలికొదిలేసిన కారణంగానే ఈ దుర్ఘటన



**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ నిర్లక్ష్యంతో తిరుపతిలో తొక్కిసలాట జరిగిందని మాజీ మంత్రి ఆర్‌కె రోజా స్పష్టీకరవైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా.తొక్కిసలాట ఘటనలను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్నారు క్రిమినల్ కేసులు కాకుండా ప్రమాదవశాత్తు జరిగినట్టు ఎఫ్‌ఐఆర్ బీఎన్‌ఎస్-105 సెక్షన్ కింద కాకుండా 194 కింద కేసులు నమోదు :మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఆక్షేపఘటనలపై పూర్తి పారదర్శకంగా దర్యాప్తు చేయాలి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి తొక్కిసలాట నిందితులకు శిక్ష పడేదాకా వదిలే ప్రసక్తే లేదు మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి :ప్రెస్‌మీట్‌లో తేల్చి చెప్పిన మాజీ మంత్రి ఆర్‌కె రోజాతాడేపల్లి: తిరుపతి తొక్కిసలాట ఘటనల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం అడుగడుగునా కొట్టొచ్చినట్టు కనపడుతున్నా, ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా తక్కువ చేసి చూపి, చేతులు దులిపేసుకునే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఆక్షేపించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజుల స్వామి వారి దర్శనం కోసం లక్షలాది భక్తులు తరలి వస్తారని తెలిసినా, టోకెన్ల జారీలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే తొక్కిసలాటలు జరిగాయని ఆమె వెల్లడించారు. గేమ్ ఛేంజర్ ఈమెంట్ నిర్వహణలో ఉన్న చిత్తశుద్ధి కూడా భక్తుల విషయంలో ఈ ప్రభుత్వానికి లేకుండా పోయిందని ఆమె ధ్వజమెత్తారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా నమోదు చేసిన బీఎన్‌ఎస్-194 సెక్షన్‌ను మార్చి బీఎన్‌ఎస్-105 కింద కేసులు నమోదు చేయాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రోజా డిమాండ్ చేశారు.భక్తుల భద్రత గాలికొదిలేశారు చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడల్లా తొక్కిసలాట ఘటనలు జరిగి అమాయకులు చనిపోవడం ఆనవాయితీగా మారింది. గతంలో గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది చనిపోగా, ఇప్పుడు తిరుపతిలో ఆరుగురు బలయ్యారు. తిరుపతి తొక్కిసలాట ఘటనతో చంద్రబాబు అసమర్థ పాలన మరోసారి బహిర్గతమైంది. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాల్సింది పోయి నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారు. తాను తప్పించుకునేందుకు అధికారుల నిర్లక్ష్యమంటూ చంద్రబాబు తేలిగ్గా కొట్టి పారేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల పట్ల గౌరవం, ప్రేమ లేనివారిని తీసుకొచ్చి టీటీడీ చైర్మన్, పాలక మండలి సభ్యులుగా నియమించారు. కలెక్టర్, ఎస్పీ సైతం ఈ ఘటనకు బాధ్యత వహించాలి. కుప్పంలో చంద్రబాబు పర్యటనలో తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులంతా ఆయన చుట్టూనే తిరగడానికే సరిపోయింది. ప్రజా పాలనను గాలికొదిలేసిన కారణంగానే ఈ దుర్ఘటన జరిగింది. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారి దర్శనం కోరుతూ, టోకెన్ల కోసం వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలన్న కనీస ఇంగితం ప్రభుత్వానికి లేదు.

# తొక్కిసలాట ఘటనపై అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ, జనవరి9, ప్రభాత వార్త ప్రతి నిధి:** తిరు పతిలో భక్తుల తొక్కిలాట ఘటనకు పూర్తి రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆకోపించారు.గురువారం ఆమె పీసీసీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రభవన్ నుంచి విడుదల చేసిన ప్రకటనలో తిరుపతి దుర్గటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసారు.ఈ ఘటనలో ప్రభుత్వ,టీటీడీ బోర్డు బాధ్యతా రాహిత్యం కన్పడుతుందన్నారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంఠానికే పంపుతున్నారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా ..కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలన యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనం. ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలి. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయం. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలి.

# హంస ప్రచార పత్రాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వచీఫ్ సెక్రెటరీ కె. విజయానంద్



**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:ఆంధ్రప్ర** దేశ్ చీఫ్ సెక్రటరీ మెడికల్, హెల్త్ డిపార్ట్మెంట్లో రికగ్నైజేషన్ సంఘం ఏపీ హంస ప్రతినిధి బృందం ఎపీ ప్రభుత్వచీఫ్ సెక్రెటరీ కె. విజయానంద్ ను ఆయన ఛాంబర్ లో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో నేడు అత్యంత ఘనంగా సత్కరించారు.ఆయనకు మంచి జ్ఞాపికను అందజేసారు..ఈ సందర్భంగా మారేడుమిల్లిలో జరిగిన దారుణాన్ని సిఎస్ విజయానంద్‌కు వివరించి ఇటువంటి చర్యలు మరలా జరగకుండా ఉండటానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అదేవిధంగా మొన్న రెగ్యులరైజేషన్ ప్రాసెస్లో రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన కాంటాక్ట్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయవలసిందిగా కోరడం జరిగింది. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్లో ఉన్న ఇతర సమస్యలన్నిటిని చర్చించడానికి వారిని సమయం అడగగా ప్రత్యేక ఏర్పాటు చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అరవ పాలు, ట్రెజరరీ వై. శ్రీనివాస్, జాయింట్ జనరల్ సెక్రెటరీ జాన్ హేన్రీ, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ రామకృష్ణ, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ జే. సరోజినీ తదితరలు పాల్గొన్నారు. హంస ప్రచార పత్రాన్ని ఈ కార్యక్రమంలో విజయానంద్ ఆవిష్కరించారు.

# రాష్ట్రంలో ఖరీఫ్ కరవు పరిస్థితులపై కేంద్రప్రభుత్వానికి నివేదిక

## - విపత్తుల నిర్వహణ, స్పెషల్ సిఎస్ ఆర్పీ సిసోడియా




రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో జరిగిన సమావేశంలో ఆర్పీసిసోడియా

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి** ఖరీఫ్ కరువు పరిస్థితులను అర్థం చేసుకుని సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో అధ్యాయనం చేసిన కేంద్రబృందాన్ని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్, విపత్తుల నిర్వహణ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో గురువారం కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి నేతృత్వంలోని కేంద్ర బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించారు.కేంద్రబృందం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్ పెండిచర్, డిప్యూటీ డైరక్టర్ సుప్రియా మాలిక్, నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్స్ ఆఫీసర్ అనురాధ బట్నా, డీ/డ్ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ కమిషనర్ డా. దీపాంకర్ సేథ్, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డా.ప్రదీప్ కుమార్, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరక్టర్ ప్రమన్నాజీ ఉపాధ్యాయ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ జయంతి, ఆయిల్ సీడ్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ డా. కె. పొన్నుస్వామి లు ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో భేటీయై చర్చించారు,ఈ సందర్భంగా ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాలు (అన్నమయ్య 19, చిత్తూరు 16, శ్రీ సత్య సాయి 10, అనంతపురం 7 మరియు కర్నూలు 2) ఇప్పటికే ప్రకటించడం జరిగింది. వీటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలు ఉన్నాయి. కేంద్ర కరువు నిబంధనల ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33 అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా అన్నారు. కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06 హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1 లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో 80 సబ్సిడీపై విత్తనాలు, రూ.55.47 కోట్ల వ్యయంతో పశుగ్రాసం, పశుగ్రాస విత్తనాల సరఫరా, 60 సబ్సిడీపై 40 సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టినట్లు కేంద్ర బృందానికి సిసోడియా వివరించారు. కరువు ప్రాంత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ. 4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పెరిన్ దేవి మాట్లాడుతూ..కరువు కారణంగా నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని తెలిపారు.

# వ్యర్థాలతో విద్యుదుత్పత్తికి కార్యాచరణ: సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ జనవరి 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టణాల్లో చెత్త, వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా కూటమి ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది.సీఎం చంద్రబాబు నాయుడు "ఎక్స్" వేదికలో చేసిన పోస్టులో ఆయన ఇందుకోసం వ్యర్థాల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే ప్లాంట్లను ప్రైవేటు రంగంలో ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఇలాంటి ప్లాంట్లు విశాఖపట్నం, గుంటూరులో ఉన్నాయి. రాజమహేంద్రవరం, నెల్లూరు, కర్నూలులో మరో మూడు ప్లాంట్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిందాల్ సంస్థతో ప్రభుత్వం సంప్రదిస్తోంది. ఇతర సంస్థలనూ ఆహ్వానిస్తోంది. పట్టణాల్లో రోజూ వచ్చే వ్యర్థాలు డంపింగ్ యార్డులకు బదులుగా నేరుగా ప్లాంట్లకు వెళ్లేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికలను సిద్ధంచేస్తోంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తిచేసే ఆరు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రయత్నం జరిగింది. విశాఖ గుంటూరులోని రెండు ప్లాంట్లకూ అప్పట్లోనే భూమిపూజ చేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిగతా ప్రాంతాల్లో ప్లాంట్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో ఇళ్ల నుంచి చెత్త సేకరించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం చేపట్టి ప్రజలపై ఫీజుల భారాన్ని మోపింది. పట్టణాల్లో చెత్త సమస్యే లేకుండా చేస్తామని చెప్పి డంపింగ్ యార్డులను వ్యర్థాలతో నింపేసింది. డంపింగ్ యార్డుల్లో ఖాళీ లేక కొన్ని పట్టణాల్లో రోడ్లకు ఇరువైపులా కూడా వ్యర్థాలు పోశారు. గత ప్రభుత్వం నిర్వాకంతో డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాల సమస్యను పరిష్కరించి ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి స్వచ్ఛ నగరాలు, పట్టణాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యార్డుల్లోని లక్షల టన్నుల వ్యర్థాల పునర్వినియోగానికి వీలున్న అవకాశాలపై పరిశీలనకు అధికారులతో కమిటీలను వేసింది. వీరు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఈలోగా వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాజమహేంద్రవరం కాకినాడ నగరపాలక సంస్థలతోపాటు మరో 12 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, అవసరాన్ని బట్టి ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల్లోని కొన్ని పురపాలక సంఘాలను ప్రతి పాదించారు. నెల్లూరు , తిరుపతి, ఒంగోలు నగరపాలక సంస్థలతోపాటు మరో 15 పురపాలక సంఘాలు నగర పంచాయతీలు, కర్నూలు, అనంతపురం కడప నగరపాలక సంస్థలతోపాటు 18 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, అవసరం మేరకు చిత్తూరు జిల్లా నుంచి చెత్తను తరలించే ఏర్పాట్లు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సర బడ్జెట్ రూపకల్పనపై దృష్టి సారించిందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు.ఆయన అందించిన సమాచారాన్ని అనుసరించి రాష్ట్రంలో మౌలిక సౌకర్యాల కల్పనకు మూలధన వ్యయం పెంపు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ రూపొందించనున్నారు. ఫిబ్రవరి లేదా మార్చిలో ఈ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సి ఉన్నందున జనవరి నెలాఖరుకు బడ్జెట్ అంచనాలు సిద్ధంచేసి పంపాలని ప్రభుత్వ శాఖలను ఆర్థికశాఖ ఆదేశించింది. కొత్త బడ్జెట్ ఎలా ఉండాలనే దానిపై మార్గదర్శకాలతో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. 2024-25 బడ్జెట్ సవరించిన అంచనాలను సైతం వీలైనంత వాస్తవికంగా రూపొందించాలని నిర్దేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలకు మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి. మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నదుల అనుసంధానం గృహ నిర్మాణం, రక్షితనీరు, విద్య, ఆరోగ్యం, పారిశ్రామికీకరణను వేగవంతం చేసే అంశాలను పరిగణనలోకి తీసుకొని మూలధన బడ్జెట్‌ను ప్రతిపాదించాలి. మిషన్ లక్ష్యాలు, మధ్య తరహా అభివృద్ధి కార్యకలాపాలు, సేవల వితరణను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఉండాలి. మంజూరైన పథకాలకు మాత్రమే నిధులను ప్రతిపాదించాలి.

ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలను కొనసాగించాలా నిలిపివేయాలా లేక కొంత కేటాయింపులతోనే సరిపెట్టాలా అన్నది మదింపు చేయాలి. పెండింగు బిల్లులు ఎంత ఉన్నాయో స్పష్టంగా లెక్క తేల్చి వాటి చెల్లింపులకు కేటాయింపులు చూపాలి. అంచనాలు, ఖర్చుకు పొంతన ఉండేల కొత్త బడ్జెట్ రూపకల్పన ఉండాలి.

# తిరుపతి తొక్కిసలాట ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి

## - అత్యంత బాధాకరం: విపక్షనేత రాహుల్ గాంధీ

**విజయవాడ,జనవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతిలో తొక్కిసలాట జరగడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తోందని తెలిపారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట చాలా బాధాకరమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. బాధితులకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం జరిగిన తోపులాటలో ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టోకెన్ల కోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చిన సందర్భంలో చోటుచేసుకున్న ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని సీఎం అన్నారు. ఈ ఘటనలో గాయాలైన వారికి అందుతున్న చికిత్సపై అధికారులతో సీఎం ఫోన్లో మాట్లాడారు.

# అబ్బురపరిచిన స్వామివారి తెప్పోత్సవం



## భద్రాద్రిలో వేలాదిగా పాల్గొన్న భక్తులు
## నేడు వైకుంఠ ఉత్తరద్వార దర్శనం
## ఆద్యంతం ఆధ్యాత్మికతతో నిండిన గౌతమీతీరం

**భద్రాచలం, ప్రభాతవార్త :** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ అధ్యయనోత్సవాలలో శ్రీసీతారామచంద్రస్వామి వారు దశావతారాలను రోజుకోక అవతారంలో రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అయితే గురువారం స్వామి వారిని దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి సన్నిధానం నుంచి ఊరేగింపుగా మేళతాళాలతో, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ బయలు దేరి గౌతమీ నది తీరానికి చేరుకుని గోదావరిలో దేవస్థాన అధికారులతో అత్యంత వైభవోపేతంగా అలంకరించిన హంసవాహనంపై జలవిహారం చేశారు. ఈ విధంగా మొదలైన జలవిహారం 5 పర్యాయాలు నదిలో విహరిస్తుండగా వేదపండితులు మంత్రోచ్ఛరణాలు, మరోవైపు దేవస్థానం సిబ్బంది కాల్చే బాణాసంచా వెలుతూరులతో గౌతమీ నది తీరం ఆధ్యాత్మికతతో పులకరించింది. ఇంతటి సీతారామచంద్రస్వామి వారి దంపతుల తెప్పోత్సవ కార్యక్రమాన్ని వేలాది మంది భక్తులు కన్నులారా చూసి తన్మయత్వంతో పులకరించారు. దీంతో గోదావరి నది తీరం జనసంద్రంగా మారింది.

**ఆద్యంతం ఆధ్యాత్మికతతో నిండిన గౌతమీ తీరం**

ఆద్యంతం ఆధ్యాత్మికతతో ఒక పక్క వేదపండితుల మంత్రోచ్ఛరణలతోను, మరోపక్క బాణాసంచా వెలుగులతోను గౌతమీ నది తీరాన్ని చూసి తరించిన భక్తులు ఆహా ... భూలోక స్వర్గం అంటే ఇదేనా ...! అని ఆశ్చర్యార్థకంలో మునిగిపోయే విధంగా రామా ... ఈ జన్మకు ఇది చాలు ... ఇంత అద్భుతమైన దర్శనభాగ్యం కల్పించావు ... మా జన్మ పునీతమైంది అని శ్రీరామనామజపంతో వేలాదిమంది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఇటు శాంతి, భద్రతలకు కానీ, అటు ఆధ్యాత్మికతకు భంగం కలగకుండా అధికారులు కట్టుదిట్టంగా భద్రత చర్యలు చేపట్టారు. స్వామి వారి సేవలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు వైకుంఠ ఉత్తరద్వార దర్శనం**

శుక్రవారం తెల్లవారుజామునే స్వామి వారు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముక్కోటి ఏకాదశి నాడు స్వామి వారిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతల దివి నుంచి భూలోకానికి తరలి వస్తారని, శ్రీవైకుంఠ ఏకాదశి పరమ పవిత్రమైన రోజు ఉత్తరద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకుంటే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని భక్తులకు అపారమైన నమ్మకం. భక్తులందరూ దర్శించుకునేలా 6 సెకార్టులుగా విభజించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను సైతం చేపట్టారు.

# కోర్టుల్లో ఊరట రావడం లేదంటే కెటిఆర్ తప్పు చేసినట్లు తేలినట్టే!

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** కెటిఆర్‌కు ఏ కోర్టులో ఊరట రావటం లేదంటే, తప్పు చేసినట్లు తేలిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నా రు. సిఎల్‌పి ఆఫీసులో గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా కెటీఆర్ విచారణకు పూర్తిగా సహకరించాలని హితవు చెప్పారు. ఆర్బీఐ నిబంధనలు తుంగలో తొక్కి రూ. 55 కోట్లు ఎలా దారిమళ్లించారని ఆయన విమర్శించారు. గ్రీన్‌కో కంపెనీ ద్వారా ఎలక్టోరల్ బాండ్ల పొందారంటేనే అందులో క్విడ్‌ప్రోకో ఉందని స్పష్టం అవుతుందన్నారు. గతంలో మీ హ యాంలో రేవంత్‌రెడ్డిని మీరు ఎంతగా వేధింపులకు గురిచేసినా చట్ట పరంగా ఎదుర్కున్నారు తప్ప మీలా వ్యవహరించలేదని గుర్తు చేశారు. సిరి సిల్లలో కెటిఆర్ అండతో భూఅక్రమాలు చేశారని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డిను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని ఆయన అన్నారు. చేసిన తప్పులకు మూల్యం చెల్లించక తప్పదని ఆయన కెటిఆర్‌కు హితవు చెప్పారు.




# ఎల్ఐసి దక్షిణమధ్య జోన్‌లో 6,284 మంది 'బీమా సఖి'ల నియామకం

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** ఎల్ఐసి దక్షిణమధ్య జోన్‌లో 6,284 మందిని బీమా సఖిలుగా నియామకం చేశామని అందులో మూడువేల మంది వరకు ఎల్ఐసి ఇన్సూరెన్స్ విక్రయాలు చేసి కమీషన్ సంపాదించడం మొదలు పెట్టారని హైదరబాద్ ఎల్ఐసి జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీమా సఖి యోజన కార్యక్రమాన్ని హరియాణలోని పానిపట్టులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ డిసెంబరు9 లాంఛనంగా ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు. దేశంలో ఆనాటి నుంచి యుక్త వయస్సు బాలికల నుంచి మొదలుకొని70 ఏళ్ళ మహిళ వరకు బీమా సఖి యోజనతో ఆర్థిక స్వావలంభన కోసం కష్టపడేవారు పనిచేయడానికి వీలుగా ఉందని ఆయన వివరించారు. దేశంలో 52,511 మంది బీమా సఖి యోజన కోసం దరఖాస్తుచేయగా అందులో 27,695 మందికి నియామకపత్రాలు అందించామని తెలిపారు. సౌత్ సెంట్రల్ జోన్‌లో 12 201 మంది దరఖాస్తుచేసుకోగా 6284మందికి నియామకపత్రాలు అందించామని తెలిపారు. బీమాసఖికి నెలకు ఏడు వేల ఉపకారవేతనం చొప్పున మూడు సంవత్సరాలు ఇస్తామని తెలిపారు. బీమాసఖి కనీసం పదవతరగతి విద్యార్హత ఉండాలని సూచించారు. ఎల్ఐసి ఇండియా వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం అవుతున్నందుకు గర్వంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అధికారులు ఆర్ సతీష్‌బాబు, ఉతూప్ జోసెఫ్, సరస్వతి గోపుకుమార్, జిబివి రామయ్య, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డంగా దొరికిపోయిన కెటిఆర్.. రేవంత్‌రెడ్డిపై అవాకులు, చెవాకులు

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** కేటిఆర్ అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడి దొంగలుగా దొరికిపోయి ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి పైన అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి విమర్శించారు. కేటిఆర్ మతిస్థిమితం కోల్పోయి పిచ్చి వాడిలాగా మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గురువారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘించి ప్రజా ధనాన్ని 55 కోట్ల రూపాయలు విదేశీ కంపెనీలకు ఇచ్చి ఇప్పుడు నిజాయితీ పరునిలాగా మాట్లాడ్డం విడ్డురంగా ఉంది అని అన్నారు. అసలు ఇది కేసు కాదు. లొట్టపీసు కేసు అని, దమ్ముంటే అరెస్ట్ చెయ్యమని, నా వెంట్రుక కూడా పీకలేరు అని అనేక మాటలను మాట్లాడిన కేటిఆర్ ఇప్పుడు నేను నన్ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టులో, సుప్రీంకోర్టులో కేసులు ఎందుకు వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. చట్టంపైన పూర్తి నమ్మకం ఉందని చెప్తున్న కేటిఆర్ తప్పు లేకపోతే ఎందుకు భయపడుతున్నారు అనిఆయన నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకు పోతుందని ముందే చెప్పారని గుర్తుచేశారు. కేటిఆర్ తాను తప్పు చేశాననే విషయాన్ని దాట వేసేందుకు రేవంత్‌రెడ్డిపైన అడ్డగోలుగా మాట్లాడుతున్నారు అన్నారు. కేటిఆర్ మాటలను ప్రజలు ఎవరు విశ్వసించరు, ఆయన తప్పు చేయకపోతే కోర్టులో తన నిజాయితీని నిరూపించుకోవాలి అని సూచించారు.

# ఎఐఎస్ మహిళా అధికారులతో ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టళ్ల తనిఖీలు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టళ్లను ప్రత్యేకంగా ఆల్ ఇండియా సర్వీసుల(ఎఐఎస్)మహిళా అధికారులు స్వయంగా తనిఖీచేసి, హాస్టళ్లలో రాత్రి బసచేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో 540 బాలికల సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, ఈ హాస్టళ్లలో విద్యాప్రమాణాలు పెంచడంతో పాటు ఇటీవల పెంచిన డైట్ చార్జీల ప్రకారం బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ హాస్టళ్లలో ఏఐఎస్ మహిళా అధికారుల తనిఖీలపై గురువారం సంబంధిత ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 540 ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విభాగాల బాలికల హాస్టళ్లున్నాయని, ఈ హాస్టళ్లను తొలిదశలో 29 మంది మహిళా ఐఏఎస్ అధికారులు సందర్శించి ప్రస్తుత పరిస్థితులను స్వయంగా పరిశీలించి, హాస్టళ్లలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు, వీటిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తగుప్రతిపాదనలను అందచేస్తారని వివరించారు. ఈ తనిఖీలు గురించి ఇప్పటికే సవివరమైన మార్గదర్శకాలను రూపొందించామని తెలిపారు. కామన్ డైట్ నిర్వహణ, విద్యా ప్రమాణాలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, హాస్టళ్ల నిర్వహణ తదితర అంశాలపై ఈ మహిళా అధికారులు పరిశీలిస్తారని వెల్లడించారు. ఈనెల 25వ తేదీలోపు తొలిదశ తనిఖీలు పూర్తి చేస్తారని సిఎస్ తెలిపారు. తొలిదశ తనిఖీలు ద్వారా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై సవివరమైన సమీక్ష చేపడతామని అన్నారు. తదుపరి అన్ని స్థాయిల ఏఐఎస్ అధికారులతో సంక్షేమ హాస్టళ్ల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని సిఎస్ శాంతి కుమారి వెల్లడించారు. ఎస్.సి. డెవలప్మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఇతర అధికారులు టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

**కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి జయంతికి ఏర్పాటు చేయండి**

మాజీ కేంద్రమంత్రి, దివంగత ఎస్. జైపాల్ రెడ్డి 83వ జయంతిని ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 16వ తేదీన జైపాల్‌రెడ్డి జయంతిని స్టేట్ ఫంక్షన్‌గా జరపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెక్లెస్‌రోడ్‌లో జైపాల్‌రెడ్డి మెమోరియల్ స్ఫూర్తిస్థల్‌లో సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండిఏ కమీషనర్‌ను ఆదేశించారు.

# సంస్థాగత ఎన్నికలపై బిజెపి దృష్టి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపిని బలోపేతం చేయాలన్న లక్ష్యంగా సంస్థాగత ఎన్నికలపై అధిష్టానం దృష్టిసారించింది. పార్టీని బలోపేతం చేసేందుకు మండల అధ్యక్షులను ప్రకటించింది. అభిప్రాయ సేకరణ తరువాత పార్టీ అధిష్టానం అనుమతి తీసుకుని మండల అధ్యక్షుల జాబితాను విడుదల చేయనుంది. అదేవిధంగా జిల్లా కౌన్సిల్‌ను ప్రటకించింది. శుక్రవారం జిల్లా అధ్యక్షులతో బిజెపి రాష్ట్ర ఇంచార్జ్ సునిల్ బన్సాల్ సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులతో భేటీ కానున్నారు. జిల్లా అధ్యక్షులు పోలీలో ఉన్నా, పదవి అడుగుతున్న ఐదుగురి పేర్లతో కూడిన జాబితా ఇవ్వాలని నేతలకు సూచించారు. రాష్ట్రంలో 80శాతం జిల్లాలకు జిల్లా అధ్యక్ష ఎన్నికలకు అర్హత ఉండడంతో పోటీ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో చాలా మంది లాబీయింగ్ మొదలు పెట్టారు. ఆశావాహులు పార్టీ కీలకనేతల ఇళ్లచుట్టూ తిరుగు తున్నారు. సంక్రాంతి తరువాత జిల్లా అధ్యక్షులపేర్లు వెలువడే అవకాశం ఉంది.

# 14వ తేది ప్రజావాణి 17కు వాయిదా

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 9, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రజల సమస్యలను స్వీకరించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం బేగంపేటలోని మహాత్మా జ్యోతి బాఫూలే ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దర ఖాస్తులు స్వీకరిస్తుంది. అయితే ఈ నెల 14న నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మకర సంక్రాంతి సందర్భంగా శుక్రవారం 17కు వాయిదా వేస్తు న్నట్లు ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి ఒక ప్రకటనలో తెలియజేసారు. దర ఖాస్తుదారులు ఈ మార్పును గమనించి 17వ తేదీ శుక్రవారం ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ ప్రకటనను రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేసారు.

# వర్గీకరణ చేస్తే విజయోత్సవం

### లేదా సర్కారుకు చావు డప్పే: మందకృష్ణ మాదిగ




గురువారం ఒయులో విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 9, ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీలో వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి మద్దత్తుగా ఒయులో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఎంఎస్ఎఫ్ నిర్వహించారు. తెలంగాణలో మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో జరగబోయే వెయ్యి గొంతులు లక్ష డప్పుల మండే మాదిగల గుండె చప్పుడు దండోరా సాంస్కృతిక మహా ప్రదర్శన విజయవంతం కోసం గురువారం సాయంత్రం ఒ.యూ దూర విద్యాకేంద్రం కన్ఫరెన్స్ హాల్ లో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డా.దరువు ఎల్లన్న, డా.నలిగంటి శరత్ చామర్ సమన్వయం చేసి సభ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని, వర్గీకరణ చేస్తే విజయోత్సవం లేకుంటే సర్కారుకు చావు డప్పే అని, దండోరా దండ యాత్రతో చూపిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని రెండుసార్లు సాధిస్తే వర్గీకరణ ఉద్యమంతో వర్గీకరణను మూడుసార్లు సాధించామని అయిన ఇప్పటికీ స్వార్థపర కొంతమంది మాలలు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఆనాడు తెలంగాణకు అడ్డుపడింది లగడపాటి రాజగోపాల్ రెడ్డి అయితే వర్గీకరణకు అడ్డుపడేది వివేక్ వెంకటస్వామి అని లగడపాటి కంటే వెయ్యి రెట్లు వివేక్ శక్తివంతుడని కానీ న్యాయమైన వర్గీకరణ ముందు వివేకు ఓడిపోవలసిందే అన్నారు. అంతిమ పోరాటంగా ఒక సాంస్కృతిక ఉద్యమాన్ని ముందు పెట్టి మాదిగల అస్తిత్వమైన డప్పు తోనే యుద్ధం చేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా స్పందించే విద్యార్థి సంఘాల నాయకులు న్యాయబద్ధమైన వర్గీకరణ పోరాటంలో మొదటి నుండి అండగా ఉన్నారన్నారు. ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# టి-72 కంటైనరైజ్డ్ క్రూ గన్నరీ సిమ్యులేటర్ సిస్టమ్

### ఇండియన్ పేటెంట్ మంజూరును ప్రకటించిన జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** తమ టి-72 కంటైనరైజ్డ్ క్రూ గన్నరీ సిమ్యులేటర్ సిస్టమ్ ఇండియన్ పేటెంట్ మంజూరైనట్టు జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రకటించింది. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరంలో జెన్ టెక్నాలజీస్‌కు 11వ పేటెంట్. ఈ కొత్త పేటెంట్‌తో జెన్ టెక్నాలజీస్ తమ అత్యాధునిక సైనిక శిక్షణ సాంకేతికతలలో నాయకత్వాన్ని మరింత సుస్థిరం చేస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. టి-72 కంటైనరైజ్డ్ క్రూ గన్నరీ సిమ్యులేటర్ సిస్టమ్ (టి-72 సిజిఎస్)ఖి అనేది టి-72 యుద్ధ ట్యాంక్ కమాండర్లు, గన్నర్ల గన్నరీ నైపుణ్యాలను పెంపొందించడానికి రూపొం దించబడిన ఒక అధునాతన శిక్షణా వేదిక. ఈ వ్యవస్థ రియల్ టైం, ప్రభావవంతమైన శిక్షణను నిర్ధారించడానికి యుద్ధభూమి పరిస్థితులు, కార్యాచరణ పనులను ప్రతిబింబిస్తూ, లీనమయ్యే ఇంటరాక్టివ్ అనుభవాన్ని అందిస్తుంది. లక్ష్య సముపార్జన, మందుగుండు సామగ్రి ఎంపిక మరియు కాల్పులు వంటి క్లిష్టమైన కార్యకలాపాలను అనుకరించడం ద్వారా, టి-72 సిజిఎస్ రియల్ వరల్డ్ పోరాట దృశ్యాలకు సిబ్బందిని సిద్ధం చేస్తుంది.

# బిసి గురుకులాలకు అదనంగా రూ.256 కోట్లు

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకులాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 256 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలకు ప్రభుత్వం 251 కోట్ల రూపాయలను ప్రతిపాదించగా, ఆ మేరకు నిధులను విడుదల చేసింది. తాజాగా గురుకుల ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చుల నిర్వహణకు అదనంగా 256 కోట్ల రూపాయలను విడుదల చేసింది. మరోవైపు సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు 13.50 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ మరో ఉత్తర్వులు జారీ చేసింది.

# గిరిజన గురుకులాల్లోని ఔట్‌సోర్సింగ్ నియామక అక్రమాలపై విచారణ జరిపించాలి

### ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకులాలలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి పేషీ ద్వారా 40 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను సృష్టించి అక్రమంగా నియమించారని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), తెలంగాణ గిరిజన సంఘాలు విమర్శించాయి. ఆయా ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలకు జరిగాయని.. కోట్లాది రూపాయల డబ్బులు చేతులు మారాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్, రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్ విమర్శించారు. ఈ అక్రమాలపై సమగ్రమైన విచారణకు ఆదేశించాలని సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుట్టుచప్పుడు కాకుండా 40 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరుచేస్తూ గత నవంబరు 14న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి పేరుతో నియామకాలను చేశారని మండిపడ్డారు. ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుండి రూ. 5లక్షల అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నా యన్నారు. ఈ నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన గురుకులాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు ఆదేశించి, దోషులు కఠినంగా శిక్షించాలని .. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకోవల్సి వస్తుందని ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నాయకులు హెచ్చరించారు.



దేవాదాయ భూముల్లో షెడ్ల తొలగించిన అధికారులు

# 4.26 ఎకరాల దేవాదాయ భూమి స్వాధీనం

### కబ్జాలో వెలిసిన షెడ్లు తొలగింపు
### ఆలయ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు
### జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్

**హైదరాబాద్ (అత్తాపూర్) జనవరి 9, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ పరిధిలోని అనంత పద్మనాభస్వామి దేవాలయ భూముల్లో కొందరు ఆక్రమార్కులుఆక్రమణలకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యా దుతో విచారణ చేపట్టిన జిల్లా దేవాదాయ శాఖ అధికారులు అనంత పద్మనాభ స్వామి భూములను గుర్తించారు. హైకోర్టు ఆదేశాల మేరకు అత్తాపూర్ పరిధిలోని సర్వే నెంబరు 435, 446లలో గల 4.26 ఎకరాల భూమిలో అక్రమార్కులు షెడ్లు, హోటళ్లు, కారు షోరూమ్‌లు, క్రికెట్ గ్రౌండ్ వంటివి వేసుకొని వ్యాపారాల కొనసాగిస్తున్నారు. గురువారం జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య షెడ్లను తొలగించి స్వాధీనం చేసుకొని దేవాదాయ భూమిగా బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. కబ్జా గురైన అనంత పద్మనాభస్వామి దేవాలయానికి సంబంధించిన 4.26 ఎకరాలను స్వాధీనం చేసుకున్నామని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అక్రమార్కులు నకిలీపత్రాలు సృష్టించి కోర్టులో నాట్ ఇంటర్ ఫెయిర్ అర్డర్లు తెచ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. దేవాదాయ భూములో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుర్గామాత ఆలయ సేవా సమితి, వనరాసేనల ఆధ్వర్యంలో దేవా దాయశాఖ అధికారులకు ఆలయ భూముల ఆక్రమణపై ఫిర్యాదు చేశామని రాష్ట్ర బిజెపి మహిళ నేత ఉమామహేశ్వరి రెడ్డి పేర్కొన్నారు. కొంత భూమిని దేవా దాయ శాఖ కాపాడడం సంతోషంగా ఉందన్నారు.

# రెచ్చగొట్టి వాస్తవాలను కప్పిపుచ్చుకోవడం తగదు

### విచారణకు సిద్ధం అన్న కెటిఆర్.. అడ్డుకొనే యత్నం : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** నిబంధనలు ఉల్లంఘిస్తూ, అధికారమత్తు అంధకారంతో ప్రభుత్వ ధనం కేటీఆర్ దుర్వినియోగం చేశారని, ఇప్పుడు రెచ్చగొట్టి వాస్తవాలను కప్పిపుచ్చుకోవాలని జిత్తులు వేయడ తగదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం సిఎల్పీ మీడియా పాయింట్‌వద్ద ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తుగా గవర్నర్ అనుమతితో కేసు విచారణ చేపట్టిందని ఆయన గుర్తుచేశారు. ఫార్ములా ఈ రేస్‌లో నిధుల దుర్వినియోగం కొట్టొచ్చినట్లు కనిపి స్తుంది అని ఆయన వివరించారు. డబ్బులు ఎక్కడికి వేళ్ళయో తెలియాలని ఏసీబీతో విచారణ ప్రభుత్వం జరిపిస్తుననదని ఆయన అన్నారు. ఏ విచారణ కు అయిన సిద్ధం అన్న కేటీఆర్ ఇప్పుడు విచారణ అడ్డుకోవాలని ఎందుకు చూస్తున్నారు అని ప్రశ్నించారు. ఫార్ములా ఇ రేసులో కేటీఆర్ స్వప్రయోజనం ఏంటో తెలుసుకునేందుకే విచారణ అని ఆయన చెప్పారు. పదేళ్లు మంత్రిగా చేసిన వ్యక్తి లొట్ట పీచు కేసు, లొట్ట పీచు సీఎం అని మాట్లాడవచ్చా అని ఆయన అన్నారు. చదువుకున్న వ్యక్తి మాట్లాడే మాటలేనా..!కేసిఆర్ నేర్పిన సంస్కారం.. సంస్కృతి ఇదేనా? సీఎం హోదా ను ఆ పదవిని గౌరవించు అని ఆయన అన్నారు. ఎందుకు 8 కోట్లు హెచ్ఎండిఏ పెనాల్టీ కట్టింది? దుర్వినియోగం కాకపోతే పెనాల్టీ ఎందుకు కట్టినట్లు అని ఆయన ప్రశ్నించారు. జనంను రెచ్చగొట్టి వాస్తవానలు కప్పి పుచ్చడం సాధ్యం కాదు అసందర్భ ప్రేలాపనలు మానుకో కెటిఆర్ అని ఆయన సలహా ఇచ్చారు.

# హైకోర్టు, సుప్రీంకోర్టులో ఊరట లభించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయిన కెటిఆర్

### ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జనవరి 9, ప్రభాతవార్త:** హైకోర్టు సుప్రీంకోర్టులో ఊరట లభించకపోవడంతో కెటిఆర్ మతిస్థిమితం కోల్పోయాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల తారక రామారావు అలియాస్ కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్ లాగా గుర్తింపు పొందారని అన్నారు. కేటీఆర్‌కు హైదరాబాద్‌పై ఒక స్పష్టత లేదని అన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో బావ, బామ్మర్ది ఎన్నో స్కామ్‌లకు పాల్పడ్డారని ఆయన దుయ్యబట్టారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో అడ్డమైన జీవోలు ఇచ్చి ప్రభుత్వ భూములను ప్రైవేటు రంగానికి, బిల్డర్లకు ఇచ్చి డబ్బులు దోచుకు తిన్నారని ఆరోపించారు.

కేటీఆర్ చేసిన అక్రమాలకు ఇప్పుడు కొంతమంది ఐఎఎస్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ అక్రమ ఇసుక రవాణా చేసింది మీ తమ్ముడు, మీ బాబా య్ కాదా అని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్‌లో చెల్లె కవిత ఇరుక్కుని ఊచలు లెక్కపెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్‌లో అదానీతో కెసిఆర్ చేసుకున్న అక్రమ ఎలక్ట్రిసిటీ ఒప్పందాల సంగతేంటి అని నిలదీశారు. ఫోన్ టాపింగ్ విషయంలో ఆర్థిక, రాజకీయ అంశాలను చేర్చి దోపిడీకి తెరలేపింది కేటీఆరే అని నిందించారు. మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం వల్ల తెలంగాణ దోపిడీకి గురైందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతికహక్కు కేటీఆర్‌కు లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

# స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి చట్టం చేయాలి

### లేదంటే ఆమరణదీక్ష చేస్తా : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 9, ప్రభాతవార్త:** బిసి కులగణన పూర్తి అయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిసి బిల్లు ప్రవేశపెట్టి రిజర్వేషన్‌లను పెంచాలని రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాను ఆమరణ నిరా హారదీక్ష చేపడతానని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్‌ల శాతాన్ని 20 నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు ఉందని, న్యాయపరమైన అవరోధాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, బిసిలకు రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచుతూ అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.




ఓపెన్ ఎటిపి టెన్నిస్ టోర్నీలో..

## నిశేష్ సంచలన విజయం

**ఢిల్లీ:** ఏఎస్బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. అక్లాండ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల నిశేష్ 6-4, 5-7, 6-4తో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ 23వ ర్యాంకర్, చీలీకి చెందిన అలెజాంద్రో టబిలోను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. రెండు గంటల 25 నిముసాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేశాడు. గత నెలలో ప్రొఫెషనల్‌గా మారిన నిశేష్ ఈ టోర్నీ తొలి రౌండ్‌లో 6-2, 6-2తో 85వ ర్యాంకర్, అర్జెంటీనాకు చెందిన కమ్సానా పై గెలిచాడు. మరోవైపు అడిలైడ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన శ్రీరామ్ బాలాజీ- మెక్సికోకు చెందిన మిగెల్ వరేలా జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-3, 3-6, 11-13తో నాలుగోసీడ్, ఫిన్లాండ్‌కు చెందిన హ్యారీ హెలియోవారా-బ్రిటన్‌కు చెందిన హెన్రీప్యాటెన్ ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

## ఓపెన్ వరల్డ్‌లో మిశ్రమ ఫలితాలు

### ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ

**ప్రణయ్, మాళవిక శుభారంభం.. ఆకర్షి, అనుపమ ఓటమి**

ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేకు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి 21-10, 16-21, 21-5తో చైనీస్ తైపీ మింగ్ చెలు-టాంగ్ కాయ్ వెలపై గెలుపొందారు. 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి గేమ్‌ను నెగ్గినా, రెండో గేమ్‌లో తడబడింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సాతిక్వ్-చిరాగ్ చెలరేగి ప్రత్యర్థి జోడీ ఆట కట్టించారు. సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకోగా, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రణయ్ 21-12, 17-21, 21-15తో కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌పై విజయం సాధించగా, ప్రియాన్షు 11-21, 16-21తో ఏడో సీడ్, చైనాకు చెందిన ఫెంగ్ లీ చేతిలో ఓడిపోయాడు. కాగా మహిళల సింగిల్స్‌లో మాళిక బన్సోద్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా, అనుపమా, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మాళవిక 21-15, 21-16తో మలేషియాకు చెందిన గో జిన్ వెపై విజయం సాధించగా, ఆకర్షి 14-21, 12- 21తో డెన్మార్క్‌కు చెందిన జూలీ జేకెట్సన్ చేతిలో, అనుపమ 17-21, 21-18, 8-21తో థాయ్‌లాండ్‌కు చెందిన ఫోర్న్‌ఫనీ చోచువోంగ్ చేతిలో ఓటమి పాలయ్యారు.

## బాక్సింగ్‌లో కీలక మార్పులు

**కొత్తగా బరువు విభాగాల అమలు**



**ఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కొత్త తీసుకొచ్చిన బరువు విభాగాలను భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అమలు చేయబోతున్నది. జాతీయ పురుషుల టోర్నీ ద్వారా కొత్త కేటగిరీలతో పోటీలను నిర్వహిస్తున్నది. గతంలో ఉన్న 13 విభాగాలను వరల్డ్ బాక్సింగ్ పదింటికి కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో కొత్త బరువు విభాగాలు 50కి (ఫ్లై వెయిట్), 55కి (బాటమ్ వెయిట్), 60కి (లైట్ వెయిట్), 65కి (వెల్టర్ వెయిట్), 70కి (లైట్ మిడిల్‌వెయిట్), 75కి (మిడిల్ వెయిట్), 80కి (లైట్ హెవీ వెయిట్), 85కి (క్రూజర్ వెయిట్), 90కి (హెవీ వెయిట్), 90+కి (సూపర్ హెవీ వెయిట్)గా ఉన్నాయి. వీటిలో ఆరు 55కి, 60కి, 65కి, 70కి, 80కి, 90కిలను ఒలింపిక్ కేటగిరీలుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) గుర్తింపు కోల్పోయిన తర్వాత గత ఎప్రిల్‌లో వరల్డ్ బాక్సింగ్ కొత్తగా మొదలైంది. ఇప్పటికే 60 మంది సభ్యుల మద్దతు కూడగట్టిన వరల్డ్ బాక్సింగ్ ఐవోసీ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నది.

# మహిళల ప్రీమియర్ లీగ్ షురూ

### రెండు దశల్లో 23 మ్యాచ్‌లు

### బరోడా, లక్నోలో జరిగే అవకాశం

### ఫిబ్రవరి 6, 7 తేదీల్లో ప్రారంభం



**ఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో ఎడిషన్‌కు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంత వరకూ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండు సీజన్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ఇది మూడవ ఎడిషన్‌కు సిద్ధమైంది. బరోడా ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనికి సంబంధించి వేలం ప్రక్రియ ఇటీవలనే పూర్తయింది. వేలం తర్వాత, బీసీసీఐ కూడా డబ్ల్యూపీఎల్ వేదికలను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తాజా నివేదిక ప్రకారం, ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 6 లేదా 7 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీ వేదికలపై తుది నిర్ణయం తీసుకున్నారు. ఈసారి బరోడా, లక్నోలలో మ్యాచ్‌లు ఆడవచ్చు. అయితే తేదీ, వేదికపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయాన్ని తీసుకోలేదు. దీనికి సంబంధించి బీసీసీఐ, డబ్ల్యూపీఎల్ మూడవ సీజన్ కోసం బరోడా, లక్నోలను షార్ట్‌లిస్ట్ చేసింది. టోర్నీని నిర్వహించేందుకు యూపీ క్రికెట్ అసోసియేషన్, బరోడా క్రికెట్ అసోసియేషన్‌తో చర్చలు ప్రారంభించింది. త్వరలో ఈ రెండు నగరాలను కూడా భారత బోర్డు అధికారికంగా వేదికలుగా ప్రకటించనుంది. నివేదిక ప్రకారం, డబ్ల్యూపీఎల్ రెండవ దశ బరోడాలో ప్లాన్ చేసింది. టోర్నమెంట్ చివరి మ్యాచ్ మార్చి 8 లేదా 9 న ఆడవచ్చు. బరోడా దీనికి ఆతిథ్యం ఇవ్వవచ్చు. బరోడా ఇటీవల కోటంబి స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలను కల్పించింది. ఆ తర్వాత ఈ మైదానంలో భారత్, వెస్టిండీస్ మహిళల జట్లు 3 వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఇది కాకుండా, సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో చాలా మ్యాచ్‌లు కూడా ఈ మైదానంలో జరిగాయి. కొన్ని రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు కూడా జరిగాయి. ప్పుడు భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ కొన్ని నాకౌట్ మ్యాచ్‌లు కూడా ఆతిథ్యం ఇచ్చింది. కొత్త సౌకర్యాలను పరీక్షి ంచడానికి, విజయ్ హజారే ట్రోఫీ సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను కూడా బరోడాలో నిర్వహించవచ్చు. అందుకే ఇప్పుడు బీసీసీఐ దీన్ని డబ్ల్యూపీఎల్ వేదికగా ఎంపిక చేసింది. టోర్నమెంట్ మొదటి సీజన్ పూర్తిగా ముంబైలో ఆడింది. రెండో సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీలో మ్యాచ్‌లు జరిగాయి. కాగా డబ్ల్యూపీఎల్ 2025లో, టోర్నమెంట్‌లోని 5 జట్లు ఛాంపియన్‌లు కావాలనే ఉద్దేశ్యంతో ఉన్నాయి. గత ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉంది. బెంగళూరు తన టైటిల్‌ను తిరిగి పొందాలని పట్టుదలతో ఉండగా, ఇతర జట్లు ఈ టైటిల్‌ను గెలుచుకోవాలనుకుంటున్నాయి. ఇందుకోసం రెండు దశల్లో మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి.

## ఛాంపియన్స్ ట్రోఫీయే లాస్ట్ ఛాన్స్

### రోహిత్, కోహ్లీకి బిసిసిఐ వార్నింగ్





**ఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఇప్పుడు బ్యాడ్ టైమ్ నడుస్తోంది. ఆర్నెళ్ల కింద టీ20 వరల్డ్ కప్ గెలవగానే వీళ్లను అందరూ ఆకాశానికెత్తేశారు. లెజెండ్స్ అంటూ ప్రశంసించారు. పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెబితే డెసిషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడు మెచ్చుకున్న వాళ్లే ఇప్పుడు ఇతర ఫార్మాట్ల నుంచి తప్పుకోమంటూ ప్రెజర్ పెడుతున్నారు. టీమ్ వరుస వైఫల్యాలకు తోడు ఇద్దరూ బ్యాటింగ్‌లో దారుణంగా ఫెయిల్ అవుతుండటంతో రిటైర్ అవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో మరికొన్ని నెలల్లో భారత క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లో ఫెయిలైన రోహిత్, కోహ్లీకి బీసీసీఐ గట్టిగా హెచ్చరికలు పంపింది. ఎంత పెద్ద ఆటగాళ్లైనా టీమ్ తర్వాతేనని, జట్టు అవసరాలు, గెలుపే ముఖ్యమని బోర్డు పెద్దలు స్పష్టం చేశారు. తోపు ప్లేయర్లు అయినా జట్టు తర్వాతేనని క్లారిటీ ఇచ్చినట్లు వెల్లడైంది. వచ్చే నెలలో జరగబోయే చాంపియన్స్ ట్రోఫీనే చివరి అవకాశమని, అందులోగానీ సరిగ్గా పెర్ఫార్మ్ చేయకపోయినా, రిజల్ట్ తారుమారైనా కఠిన చర్యలు ఉంటాయని గట్టిగా హెచ్చరించారట. సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ కూడా ఈ జోడీపై సీరియస్ అయ్యాడని సమాచారం. కాగా ఆస్ట్రేలియా టూర్‌లో రోహిత్, కోహ్లీ ఫెయిల్ అయ్యారు. సరిగ్గా ఆడట్లేదు, టీమ్ కూడా వరుస వైఫల్యాల్లో ఉండటంతో హిట్‌మ్యాన్‌ను ఆఖరి టెస్ట్‌లో జట్టు నుంచి తొలగించారు. దీంతో అతడికి సపోర్ట్‌గా విద్యాబాలన్, ఫర్హాన్ అక్తర్ లాంటి పలువురు బాలీవుడ్ సెలెబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టులు చేయడం, పీఆర్ క్యాంపెయినింగ్ లాంటివి జోరుగా నడవడం బీసీసీఐపై ప్రెజర్ పెట్టాయని తెలిసింది. దీంతో ఈ విషయం మీదా బోర్డు పెద్దలు గుర్రుగా ఉన్నారని వినిపిస్తోంది. త్వరలో జరిగే మీటింగ్‌లో దీనిపై మరింత డిస్కస్ చేయనున్నారని, రోహిత్, కోహ్లీకి ఈ విషయంలోనూ వార్నింగ్స్ తప్పవని తెలుస్తోంది.

## ‘చూసింది చాలు.. వచ్చి పని చెయ్’

**న్యూఢిల్లీ, జనవరి 9:** అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటలు చొప్పున పనిచేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు ఇటీవల పెద్ద చర్చకు దారితీసిన సంగతి విదితమే. తాజాగా ఎల్ అండ్ టి చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆదివారాలు కూడా పనిచేయాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. ‘ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. వారానికి 90 గంటలు పనిచేయాలి. అవసరమైతే ఆదివారాలు కూడా వదులుకోవాలి. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. ఆదివారాలు మీతో పనిచేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. మీతో అలా పనిచేయించగలిగితే నాకు సంతోషం. ఎందుకంటే నేను ఆదివారాలు పనిచేస్తున్నాను’ అంటూ వారితో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో వైరల్ కాగా, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. భార్య ప్రస్తావన తీసుకువస్తూ ఆయన మాట్లాడిన మాటలను కొందరు తీవ్రంగా విమర్శించారు. నారాయణ మూర్తి ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువని అన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండోప్రపంచయుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డా యో, మనకూ అలా శ్రమించాలని అన్నా రు. అభివృద్ధి చెందిన దేశాలో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఉద్యోగ జీవితంలో ఉండే ఇబ్బందులను లేవనెత్తగా, మరికొందరు నారాయణ మూర్తి అభిప్రాయాన్ని స్వాగతించారు.



## ఐటి, ఫైనాన్షియల్ షేర్ల ఒత్తిడి

**వాణిజ్యం**




**ముంబై, జనవరి 9:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో దేశీయ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిసాయి. ఐటి, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాలు ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా అమెరికన్ డాలర్ రోజురోజుకూ బలపడుతుండడం, బాండ్ల రాబడి పెరగడంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇది మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లకుపైగా నష్టంతో 78వేల దిగువకు చేరగా, నిఫ్టీ కూడా 23,600 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. రెండురోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు క్షీణించి రూ.435 లక్షల కోట్లకు పరి మితమైంది. సెన్సెక్స్ ఇంట్రాడేలో దాదాపు 600 పాయింట్లు నష్టపోయింది. చివరికి సెన్సెక్స్ 528.28 పాయింట్లు నష్టపోయి 77,620.21 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 162.45 పాయింట్ల నష్టంతో 23,526.50 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయివిలువ రూ.85.88 గా ఉంది. టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2682 డాలర్లకు చేరింది.

## టాటా నుంచి ఫిక్స్డ్ డిపాజిట్ స్కీమ్

**ముంబై, జనవరి 9:** ప్రతిఒక్కరూ డబ్బును ఏదైనా సురక్షితమైన వాటిలో ఇన్వెస్ట్ చేసి ఆదాయం పొందా లని చూస్తారు. ఫిక్స్డ్ డిపాజిట్లలో డబ్బులు వేస్తే ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఫిక్స్డ్ డిపాజిట్లలో పెట్టే వారు కూడా చాలా మంది ఉన్నారు. అయితే ఏ బ్యాంకు ఎక్కువ గా వడ్డీని ఇస్తుం దో తెలియదు. ఇందుకు సంబంధించి దేశంలోనే నమ్మకమైనా ప్రముఖ కంపెనీ టాటా ఫిక్స్‌డ్ డిపాజిట్ సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. టాటా అనగానే మనకు దివంగత వ్యాపారవేత్త రతన్ టాటా గుర్తు కొస్తారు. అతనివల్ల భారతదేశం ఎన్నోరకాలుగా లబ్ధి పొందింది. మనము ఉపయోగించే అన్ని ఉత్పత్తులలో టాటా ఖచ్చితంగా ఎక్కడో ఒకచోట ఉంటుంది. వాటన్నింటినీ మనకు అందించిన వ్యక్తి రతన్ టాటా. ప్రజలం దరినీ సమానంచేయాలనే ఉద్దేశ్యంతో అతను అన్ని వ్యాపారంలో తక్కువ ధర ఉత్పత్తులను ప్రవేశపెట్టాడు. అదే విధంగా టాటా న్యూ పేరుతో ఓ యాప్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో అన్ని టాటా వ్యాపారాలు ఉంటాయి. అయితే తాజాగా మరొక సర్వీస్ ఇప్పుడు పరిచయం చేసింది. దీని ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ.1000 పెట్టుబడిని ప్రారంభిస్తే 9.1% వరకు వడ్డీ ఇవ్వనున్నట్లు సమాచారం. టాటా మ్యూచువల్ ఫండ్‌లు ఇప్పటికే మార్కెట్‌లో ఉండగా, టాటా రిటైల్ కంపెనీ 9.1% వడ్డీ రేటుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు అఫీషియల్ ప్రకటన చేసింది. డిజిటల్ మార్కెట్‌లో బలమైన పట్టుతో టాటా న్యూ కస్టమర్లకు క్యాష్ సేవింగ్ అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలకు సంబంధించిన చాల రకాల ఆర్థిక ఉత్పత్తులు, రిటైల్ పేమెంట్ సౌకర్యాలను అందిస్తుంది. దీని ప్రకారం, మీరు సేవింగ్స్ అకౌంట్ తెరవకుం డానే టాటా న్యూ ద్వారా వివిధ బ్యాంకుల్లో డబ్బును డిపా జిట్ చేయవచ్చు. డిపాజిట్‌చేసిన డబ్బుపై 9.1% వడ్డీ రేటుతో ప్రముఖ ఆర్థిక సంస్థల ఎఫ్‌డి పథకాల్లో కస్టమర్లు పెట్టుబడి పెట్టవచ్చని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. టాటా డిజిటల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (ఫైనాన్షియల్ సర్వీసెస్) గౌరవ్ హజ్రతీ మాట్లాడుతూ మేము చాలా నమ్మకమైన బ్యాంకుల ద్వారా పెట్టుబడిదారులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లక్ష ్యంతో ఈ పథకాన్ని రూపొందించాము. మీరు కేవలం 1,000 రూపాయలతో కూడా ఈ పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు అని చెప్పారు. అదే విధంగా కస్టమర్లు వివిధ పెట్టుబడి అప్షన్లతో బ్యాంకులు ఇంకా చిన్న ఫైనాన్స్ బ్యాంకింగ్ పథకాలలో పెట్టుబడి పెట్టవచ్చు. దీని ప్రకారం, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ వంటి నాన్

## మహిళల కోసం ఎల్ఐసి బీమా సఖి యోజన




**ముంబై, జనవరి 9:** దేశవ్యాప్తంగా సాధికారత లక్ష ్యంగా జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ బీమా సఖి యోజన పేరుతో ప్రతిష్టాత్మ కంగా ప్రారంభించబడింది. 2024 డిసెంబర్ 9న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ పథకం బీమా సఖీలుగా పేర్లే ఏజెంట్లుగా మారడానికి మహిళలకు శిక్షణ ఇస్తారు. దాంతో వారికి ఉపాధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యత, బీమాపై అవగాహనను పెంపొందించడం బీమా సఖి యోజన ప్రాథమిక లక్ష ్యం. పథకం ప్రారంభించిన మొదటి సంవత్సరంలో 1,00,000 మంది మహిళలు, వచ్చే మూడేళ్ల లో 2,00,000మంది మహిళలను ఈ పథ కంలో భాగం చేయడం దీనిలక్ష ్యం. ఫలితం గా గ్రామీణ, పట్టణ ప్రాంతాలవారికి బీమా ను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు, సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఈ పథకంలో చేరినవారు మూడు సంవత్సరాల పాటు ప్రత్యేకశిక్షణ పొందుతారు. ఈసమయంలో వారికి నెలవారీ స్టైఫండ్ అందిస్తారు. మొదటి ఏడాది స్టైపెండ్ రూ.7 వేలు, రెండో ఏడాది రూ.6 వేలు, మూడో ఏడాది రూ.5 వేలు. దాంతో పాటు నిబంధనలకు అనుగు ణంగా






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps